
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 220

మంగళవారం 31-10-2023



గాన సరస్వతి

వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న రావు బాలసరస్వతి -IVలో



అఫ్గాన్ తీన్‌మార్

వన్డే వరల్డ్‌కప్‌లో శ్రీలంకపై ఏడు వికెట్ల తేడాతో విజయం - 12లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మరాఠాల ఆందోళన హింసాత్మకం

ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఇద్దరు ఎన్సీపీ ఎమ్మెల్యేల ఇళ్లకు నిప్పు పెట్టారు.

వివరాలు 6లో ▸



ఆ హక్కు పౌరులకు లేదు

రాజకీయ పార్టీలకు విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకునే హక్కు పౌరులకు లేదని కేంద్రం సుప్రీంకోర్టులో వాదించింది.

వివరాలు 6లో ▸



గాజాలో మరణ ఘోష

ఇజ్రాయెల్ సేనలు గాజాలోకి మరింత ముందుకు చొచ్చుకెళ్తున్నాయి. 24 గంటల్లో 600 హమాస్ స్థావరాలపై దాడిచేశాయి.

వివరాలు 6లో ▸




కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆ రాష్ట్ర సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులిచ్చింది.

వివరాలు 6లో ▸

వర్సిటీల్లో ఖాళీల భర్తీ

విశ్వవిద్యాలయాల్లో 3,220 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్



- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఒకే దరఖాస్తు ఫీజుతో అన్ని వర్సిటీలకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యం
- ఏపీపీఎస్సీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు స్క్రీనింగ్ టెస్ట్
- కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారికి గరిష్టంగా 10 మార్కుల వెయిటేజీ.. హేతుబద్ధీకరణ అనంతరం వర్సిటీల్లో మొత్తం 4,330 పోస్టులు మంజూరు
- చంద్రబాబు 14 ఏళ్ల సీఎంగా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయని వైనం
- దశాబ్దాల తర్వాత భారీ ఎత్తున పోస్టులను భర్తీ చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో నవశకానికి నాంది పలికింది. విశ్వవిద్యాలయాల్లో దశాబ్దాలుగా భర్తీకి నోచుకోని అధ్యాపక, అధ్యాపకేతర పోస్టుల్లో నియామకాలకు శ్రీకారం చుట్టింది. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 18 యూనివర్సిటీల్లో ఏకంగా 3,220 పోస్టుల భర్తీకి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 418 ప్రొఫెసర్, 801 అసోసియేట్ ప్రొఫెసర్, 2,001 అసిస్టెంట్ ప్రొఫెసర్ (రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం 220 లెక్చరర్ పోస్టులతో కలిపి) పోస్టుల నియామకాలను చేపడుతోంది. ఉన్నత విద్యా మండలి 'ఉమ్మడి పోర్టల్' ద్వారా మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. అభ్యర్థులపై ఆర్థిక భారం తగ్గించేందుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు మాత్రం ఒకే దరఖాస్తు ఫీజుతో అన్ని యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించింది. గతంలో అయితే ప్రతి వర్సిటీకి ఒక్కో దరఖాస్తు పెట్టుకోవాల్సి వచ్చేది. వీటికే అభ్యర్థులు రూ.వేలు చెల్లించాల్సి వచ్చేది. భవిష్యత్ తరాలకు సైతం యూనివర్సిటీల్లో అత్యుత్తమ బోధన సామర్థ్యాలు అందించేందుకు వీలుగా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తోంది. ముఖ్యంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి పారదర్శకంగా ఎంపికలు చేపట్టనుంది.

దరఖాస్తు రుసుము ఇలా..

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఓపెన్ కేటగిరీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.2,500..

మిగతా 10వ పేజీలో ▶



హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నరేందర్ ప్రమాణం

5లో

తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు

కాసాని రాజీనామా



ఎన్నికల్లో పోటీ చేయనప్పుడు పార్టీ ఎందుకు?

లోకేశ్ చిన్న పిల్లవాడో, పెద్దవాడో అర్థంకాదు

కాసాని జ్ఞానేశ్వర్

13లో



గిరిజనుల గుండె చప్పుడు

సీఎం వైఎస్ జగన్

- ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారు
- పాడేరు సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

10లో

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



బాధితురాలిని ఓదారుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బాధితులకు భరోసా..

విజయనగరం జిల్లా రైలు ప్రమాద బాధితులకు సీఎం జగన్ ఓదార్పు

- క్షతగాత్రుల్లో అవసరమైన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం కల్పిస్తాం
- పూర్తిగా కోలుకునే వరకూ ప్రభుత్వమే వైద్య ఖర్చులు చెల్లిస్తుంది
- అత్యవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం
- మృతుల కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ
- విజయనగరం ప్రభుత్వాస్పత్రిలో 22 మంది క్షతగాత్రులకూ పరామర్శ
- వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షలు..
- శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల పరిహారం
- ఉదారంగా పరిహారం.. ఏరియల్ సర్వే ద్వారా ప్రమాద స్థల పరిశీలన

2లో

13కు చేరిన మృతులు

50 మంది క్షతగాత్రులు

విజయనగరం సర్వజనాస్పత్రి, విశాఖ కేజీహెచ్ తదితర ఆస్పత్రుల్లో కోలుకుంటున్న బాధితులు

2లో

ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి..

రెండు రైళ్లలోని పరికరాలు సీజ్.. దర్యాప్తు నివేదిక వచ్చాక తదుపరి చర్యలు

'సాక్షి'తో వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

2లో

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

మృతుడి తండ్రి కన్నీళ్లు తుడిచిన సీఎం జగన్

- వివరాలు 2లో

రైలు ప్రమాదంపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలి

ప్రధాని, రైల్వే మంత్రికి 'ఎక్స్'లో సీఎం జగన్ వినతి

2లో



నారా వారి లిక్కరు స్కాం

టీడీపీ అడ్డగోలు మద్యం వ్యవహారాలపై మరో కేసు

- తన హయాంలో కావాల్సిన కంపెనీలకు దోచిపెట్టిన చంద్రబాబు
- కావాల్సిన డిస్టిలరీలకు అడ్డగోలు అనుమతులు
- క్విడ్‌ప్రోకోలో భాగంగా ఎక్సైజ్ పాలసీనే మార్చేసిన నాటి ప్రభుత్వం
- రెండు బేవరేజ్‌లు, మూడు డిస్టలరీలకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు
- ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.1,300 కోట్ల నష్టం
- ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్.. అనుమతించిన న్యాయస్థానం
- ఏ-1గా ఐఎస్ నరేష్, ఏ-2గా కొల్లు రవీంద్ర, ఏ-3గా చంద్రబాబు

13లో

మరిన్ని పెట్టుబడులు

రూ.19,037 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



- వీటి ద్వారా 69,565 మందికి ఉద్యోగావకాశాలు
- సీఎం జగన్ అధ్యక్షతన సమావేశమైన ఎస్ఐపీబీ ఈ ప్రతిపాదనలకు ఆమోదం
- ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి
- ఆ మేరకు అధికారులు మరింత వేగంగా అనుమతులివ్వాలి.. రాష్ట్రంలో పారిశ్రామిక సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చాం
- అత్యధిక మందికి ఉపాధి కల్పించే ఎంఎస్ఎంఈలకు పునరుజ్జీవం కల్పించాం
- విశాఖ జీఐఎస్ పెట్టుబడుల అమలు విషయంలోనూ స్పీడ్ పెంచాలి
- ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

3లో

క్లుప్తంగా...

అత్యంత విషాదకరం

- రైలు ప్రమాదంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దిగ్భ్రాంతి
- సంతాపం తెలిపిన కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం అత్యంత విషాదకరమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఈ ప్రమాదం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ దుర్ఘటనలో పలువురు మృతిచెందడం పట్ల ఆవేదన వెలిబుచ్చారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు స్పీకర్ సోమవారం ట్వీట్ చేశారు. కాగా, రైలు ప్రమాదంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

రైళ్ల భద్రతపై విస్తృత సమీక్ష జరపండి

రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ జీవీఎల్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో తరచూ రైళ్లకు ఎదురవుతున్న భద్రతా సమస్యలపై విస్తృత సమీక్ష చేయాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు సోమవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. వాల్తేర్ రైల్వే డివిజన్‌లోని అలమండ, కంటకపల్లె మధ్య విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో కనీసం 14 మంది మృతి చెందిన ఘోర రైలు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో కేవలం ఐదు నెలల వ్యవధిలో రెండు పెద్ద రైలు ప్రమాదాలు సంభవించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్‌లో ఒడిశాలోని బహనాగ బజార్ స్టేషన్ సమీపంలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ఘోర ప్రమాదంలో 280 మంది ప్రయాణికులు మరణించిన విషయాన్ని కేంద్రమంత్రికి గుర్తు చేశారు. రైలు ప్రమాదాలను అరికట్టడమే కాకుండా ప్రయాణికులకు భద్రతా భావాన్ని కలిగించాలని లేఖలో కోరారు.

రైలు ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా రైలు ప్రమాద ఘటనకు సంబంధించిన సహాయక చర్యల్లో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ రెండు బృందాలను ఏర్పాటు చేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో బాధితులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తాయన్నారు. ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను బృందం సభ్యులు పరామర్శిస్తారని తెలిపారు. బాధితులకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా అండగా నిలుస్తుందన్నారు. రైలు ప్రమాద ఘటన ప్రతి ఒక్కరినీ కలిచి వేసిందని, 13 మంది ప్రాణాలు కోల్పోయి, వంద మందికిపైగా క్షతగాత్రులవ్వడం బాధాకరమన్నారు.




రైలు ప్రమాదంలో గాయపడి విజయనగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



రైలు ప్రమాదం ఫొటోలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

బాధితులకు భరోసా..

విజయనగరం జిల్లా రైలు ప్రమాద బాధితులకు సీఎం వైఎస్ జగన్ ఓదార్పు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం ఫోర్ట్ : విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి సంభవించిన ఘోర రైలు ప్రమాదంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. విధి వంచనతో పుట్టెడు దుఃఖంతో కుమిలిపోతున్న వారికి పెద్ద కొడుకులా అండగా నిలిచి వారి కన్నీరు తుడిచి ఓదార్చారు. రైలు ప్రమాదమైనా సరే... రాష్ట్ర పరిధిలో సంభవించటంతో శనివారం రాత్రి నుంచే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. సీఎం ఆదేశాలతో స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు విషయం తెలుసుకుంటూ సోమవారం ప్రమాద స్థలానికి బయలుదేరారు. అయితే ట్రాక్ పునరుద్ధరణ పనులకు ఆటంకం కలగవచ్చని అధికారులు చెప్పటంతో అక్కడకు వెళ్లకుండా విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు ప్రతి ఒక్కరినీ నేరుగా పరామర్శించారు. మానవీయ దృక్పథంతో స్పందించి పరిహారాన్ని ప్రకటించారు. ప్రమాదం పెద్దదే అయినా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి సహకరించటంతో 24 గంటలు తిరక్కముందే ట్రాక్ పునరుద్ధరించి రైళ్ల రాకపోకలకు అధికారులు అనుమతివ్వగలిగామని రైల్వే అధికారులు పేర్కొనటం గమనార్హం. సీఎం సైతం క్షతగాత్రులను, మృతుల కుటుంబీకులను స్వయంగా పరామర్శించి, తాను అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గాయపడిన వారు పూర్తిగా కోలుకునే వరకూ వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ధైర్యం చెప్పారు.

విజయనగరం జిల్లా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు పాసింజర్ రైళ్లు ఢీకొనడం తెలిసిందే. విశాఖపట్నం నుంచి బయల్దేరిన విశాఖ-పలాస ప్యాసింజర్ రైలును అదే మార్గంలో కొద్ది నిమిషాల వ్యవధిలో బయల్దేరిన విశాఖ-రాయగడ ప్యాసింజర్ రైలు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు రైల్వే సిబ్బంది సహా 13 మంది దుర్మరణం పాలయ్యారు. 50 మంది క్షతగాత్రులయ్యారు. వారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రిలోను, మిగిలిన వారిని ప్రైవేట్ ఆస్పత్రుల్లో హుటాహుటిన చేర్చారు. దుర్ఘటన గురించి తెలిసిన వెంటనే ప్రధాని మోదీ, రైల్వే మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా మానవీయ కోణంలో సకాలంలో స్పందించి ఘటన వివరాలను కేంద్రానికి ఎప్పటికప్పుడు తెలియజేయటమే కాక రాష్ట్రంలో వివిధ శాఖలను అప్పటికప్పుడు అప్రమత్తం చేసి అర్ధరాత్రి వరకూ పరిస్థితిని సమీక్షించారు.

సీఎం ఏరియల్ సర్వే..

వాస్తవానికి రైళ్లు ఢీకొన్న ప్రమాద స్థలానికి వెళ్లి స్వయంగా పరిశీలించాలని సీఎం జగన్ తొలుత నిర్ణయించారు. అయితే, ట్రాక్ పునరుద్ధరణ పనులు, మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ దృష్ట్యా సందర్శనను రద్దుచేసుకోవాలని రైల్వే అధికారులు సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన హెలికాప్టర్‌లో నేరుగా విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఆసుపత్రిలో క్షతగాత్రులు, మృతుల కుటుంబీకుల పరామర్శ అనంతరం విశాఖకు తిరిగివెళ్తూ ఏరియల్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీఎం వెంట మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనర్సయ్య, శంభంగి వెంకటచిన అప్పలనాయుడు, జోగారావు, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, రఘురాజు, వరుదు కళ్యాణి, విజయనగరం మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయా యాదవ్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సర్వజన ఆస్పత్రి వైద్యాధికారులు ఉన్నారు.



> ఎవరికైనా అవసరమైతే ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించాలి. ఒక్కపైసా కూడా వారిపై భారం పడకూడదు. పూర్తి ఉచితంగా వైద్యసేవలు అందించాలి. క్షతగాత్రుల్లో కొంతమంది ఇంకా షాక్‌లో ఉన్నారు.. పూర్తిగా కోలుకున్నామని వారు సంతృప్తి వ్యక్తంచేసిన తర్వాతే వారిని ఇళ్లకు పంపించాలి.
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రతి ఒక్కరికీ పరామర్శ..

ఆదివారం అర్ధరాత్రి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన వారిలో స్వల్ప గాయాలైన వారు కొందరు చికిత్స అనంతరం సోమవారం డిశ్చార్జి అయ్యారు. మిగిలిన 22 మంది బాధితులకు రెండు వార్డుల్లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఆసుపత్రికి చేరుకున్న ముఖ్యమంత్రి... అక్కడ రైలు దుర్ఘటనకు సంబంధించిన చిత్రాలను చూశారు. ప్రమాదం జరిగిన తీరును మంత్రి బొత్స సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితులు ప్రతి ఒక్కరినీ వారి వద్దకు వెళ్లి పరామర్శించారు. వారికి వైద్యసేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. తీవ్ర గాయాలైన వారికి ఇంకా ఏమైనా మెరుగైన వైద్యం అవసరమా అని వైద్యులను అడిగారు. ఎవరికైనా అవసరమైతే ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. ఒక్కపైసా కూడా వారిపై భారం పడకూడదని, పూర్తి ఉచితంగా వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు స్పష్టంగా చెప్పారు.

ఉదారంగా ఎక్స్‌గ్రేషియా..

రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి ప్రకటించారు. క్షతగాత్రుల విషయంలోనూ ఉదారంగా వ్యవహరించారు. స్వల్పగాయాలైన ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల చొప్పున సాయం ప్రకటించారు. నెలరోజుల కన్నా ఎక్కువ రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స అవసరమైన వారికి.. వైకల్యం కారణంగా ఉపాధి పొందలేని వారికి రూ.5 లక్షల చొప్పున, శాశ్వత వైకల్యం కలిగిన వారికి రూ.10 లక్షల వరకూ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీఎం ఆదేశించారు. దీంతో.. క్షతగాత్రుల్లో ఎవరెవరికి ఎంత ఎక్స్‌గ్రేషియా చెల్లించాలో నిర్ణయించేందుకు డాక్టర్లతో కమిటీ వేసినట్లు విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ఈ మొత్తాన్ని మంగళవారం మంత్రి బొత్స సత్యనారాయణ, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల ద్వారా అందిస్తామని చెప్పారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..

మృతుడి తండ్రి కన్నీళ్లు తుడిచిన సీఎం జగన్



లోకో పైలట్ సువ్వారి చిరంజీవి తండ్రి సన్యాసిరావును ఓదారుస్తున్న సీఎం జగన్

ఈ ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుశాలపురానికి చెందిన లోకో పైలట్ సువ్వారి చిరంజీవి మృతిచెందడంతో ఆయన తండ్రి సన్యాసిరావును ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓదార్చారు. సీఎంను చూడగానే ఒక్కసారిగా సన్యాసిరావు బోరున విలపించారు. 'ఒక్కగానొక్క కొడుకు మృతి చెందాడు.. ఈ వయసులో మాకు ఎవరు దిక్కు'.. అంటూ కన్నీరుమున్నీరయ్యారు. సీఎం వెంటనే ఆయన కన్నీళ్లు తుడుస్తూ.. 'అధైర్య పడొద్దు.. కుటుంబానికి అండగా ఉంటా'మంటూ ఓదార్చారు.

కుటుంబ సభ్యుడిలా ఓదార్చారు..



వైద్యులు బాగా చూస్తున్నారా.. ఏ పనిచేస్తున్నావు.. మీది ఏ గ్రామం ... దెబ్బలు ఏమైనా తగిలాయా.. అంటూ కుటుంబ సభ్యుడిలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులను ఓదార్చారు. వైద్యులు బాగా చూసుకుంటారు, అధైర్య పడొద్దు.. మెరుగైన వైద్య సేవలు అందించమని వైద్యులకు చెప్పానని సీఎం చెప్పారు. విజయనగరం నుంచి విశాఖపట్నం కళాసీ పనికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో నేను గాయపడ్డాను.
– కొల్లి ఎర్ని ఆంజనేయులు, బురదపాడు గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా

ఆప్యాయంగా పలకరించి.. ఓపిగ్గా అంతా విన్నారు..



డాక్టర్లు బాగా చూసుకుంటారు.. ఏ ఇబ్బంది లేకుండా నేను చూసుకుంటాను. అధైర్య పడొద్దని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. ఆప్యాయంగా పలకరించి నాకు తగిలిన గాయాలు గురించి అడిగారు. నొప్పులు తగ్గాయా, ఆరోగ్యం ఎలా ఉందని ప్రశ్నించారు. ఓపిగ్గా నేను చెప్పింది అంతా విన్నారు. తాపీ పనికోసం కొత్తవలస వెళ్లి అక్కడ నుంచి మా గ్రామానికి రైలులో వస్తుండగా ప్రమాదంలో గాయపడ్డాను.
– గదల మహాలక్ష్మినాయుడు, చక్కవలస గ్రామం, గరివిడి మండలం, విజయనగరం జిల్లా

ఎంత ఖర్చయినా భరిస్తామన్నారు.. అది చాలు



ఆరోగ్యం ఎలా ఉంది.. మా తరఫున అవసరమైన సాయాన్ని అందిస్తాం. వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించాలని వైద్యులకు ఆదేశాలిచ్చామని సీఎం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, వైద్యానికి ఎంత ఖర్చయినా భరిస్తామని చెప్పారు. అది చాలు.
– రెడ్డి రాము, ఎం.అలమండ గ్రామం, దేవరాపల్లి మండలం, విశాఖపట్నం జిల్లా

ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి..

- రెండు రైళ్లలోని పరికరాలు, రికార్డింగ్ సిస్టమ్ సీజ్
- 'సాక్షి'తో వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్



సాక్షి, విశాఖపట్నం: వాల్తేరు డివిజన్ పరిధిలో రైలు ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని వాల్తేరు డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ అన్నారు. ప్రమాద స్థలికి ఆదివారం రాత్రి చేరుకున్న డీఆర్ఎం పునరుద్ధరణ పనుల్ని నిరంతరాయంగా పర్యవేక్షించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నట్టు తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశించిందన్నారు. 'జ్యుడిషియల్ పవర్స్ ఉన్న రైల్వే సేఫ్టీ కమిషనర్ నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం దర్యాప్తు ప్రారంభించింది. ప్రమాద సమయంలో రైలు ఎంత వేగంలో వెళ్తోందనేది నమోదైన స్పీడ్ రికార్డర్‌ను సీజ్ చేశాం. ప్రమాద సమయంలో సిగ్నల్ పొజిషన్ ఏ విధంగా ఉంది? మొదటి ఎక్స్‌ప్రెస్‌కు సంబంధించిన సిగ్నల్ ఎప్పుడు నమోదైంది, రెండో రైలుకు సిగ్నల్ ఎప్పుడు ఇచ్చారు, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తిందా.. మొదలైన అంశాలన్నీ డేటా లాగర్‌లో నిక్షిప్తమై ఉంటాయి. డేటా లాగర్‌ని సీజ్ చేశాం. రైల్లో ప్రయాణిస్తున్న వారి నుంచి వివరాలు సేకరిస్తాం. మొత్తాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి.. దర్యాప్తు బృందం తుది నివేదికను వెల్లడించాక తదుపరి చర్యలు తీసుకుంటాం. మొత్తం ఆరు కోచ్‌లు ప్రమాదానికి గురయ్యాయి. పలాస ప్యాసింజర్‌కు చెందిన 3, రాయగడ ప్యాసింజర్‌కు చెందిన 2 కోచ్‌లు, ఒక లోకో మోటివ్ ధ్వంసమయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నాం. సోమవారం రాత్రి కల్లా మూడు లైన్లు అందుబాటులోకి తెస్తాం. ఓవర్ హెడ్ వైర్స్ మరమ్మతులు కూడా పూర్తి చేసి, టెక్నికల్ టీమ్‌తో పరిశీలించి.. ఆయా మార్గాల్లో రాకపోకలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాం. ప్రమాదం జరిగినప్పటి నుంచి 36 గంటల వ్యవధిలో 47 రైళ్లను రద్దు చేయగా, 24 రైళ్లను దారి మళ్లించాం.' అని డీఆర్ఎం తెలిపారు.

రైలు ప్రమాదంపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలి

ప్రధాని, రైల్వే మంత్రికి 'ఎక్స్'లో సీఎం జగన్ వినతి

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇటువంటి దుర్ఘటనలు ఎందుకు జరుగుతున్నాయన్న దానిపై ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీ వేయాలంటూ ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ప్రధాని, రైల్వేమంత్రిని ట్యాగ్‌చేస్తూ ఆయన 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు. అందులో ముఖ్యమంత్రి ఏం పేర్కొన్నారంటే..

'ఆదివారం రాత్రి విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదం నన్ను చాలా బాధించింది. రన్నింగ్‌లో ఉన్న రైలు మరో రైలును ఢీకొట్టింది, ఈ రెండూ ఒకే దిశలో నడుస్తున్నాయి. ఈ భయంకరమైన ప్రమాదం కొన్ని స్పష్టమైన ప్రశ్నలకు దారితీస్తోంది..

- బ్రేకింగ్ సిస్టం, అలర్ట్ సిస్టం ఎందుకు పనిచేయలేదు?
- సిగ్నలింగ్ ఎందుకు విఫలమైంది?
- కమ్యూనికేషన్ వ్యవస్థ ఎలా విఫలమైంది?

ఇక భవిష్యత్తులో ఇలాంటి విధ్వంసకర ప్రమాదాలు పునరావృతం కాకుండా చూసేందుకు, ఈ లైన్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా అన్ని మార్గాల్లో ఈ అంశాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఒక ఉన్నతస్థాయి ఆడిట్ కమిటీని ఏర్పాటుచేయాలని గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గౌరవనీయ రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌లను నేను హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను. నా ఆలోచనలు, ప్రార్థనలు ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతో కలిసి ఉన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమమైన సంరక్షణ చర్యలను మా ప్రభుత్వం అందిస్తోంది'.

బాధితులకు అండగా ప్రభుత్వం..

అంతకుముందు.. విజయనగరం జిల్లా పర్యటన అనంతరం ముఖ్యమంత్రి 'ఎక్స్'లో మరో పోస్టు ద్వారా కూడా తన బాధను పంచుకున్నారు. 'విజయనగరం జిల్లా రైలు ప్రమాద ఘటనలో పలువురు మరణించడం బాధాకరం. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఈ ఘటనలో గాయపడి విజయనగరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించాను. వారు కోలుకునేంత వరకూ ప్రభుత్వం తోడుగా నిలుస్తుంది. వారికి మంచి వైద్యం అందించడంతో పాటు మరణించిన వారి కుటుంబాలకు, క్షతగాత్రులకు ఎక్స్‌గ్రేషియాను సత్వరమే అందించాలని అధికారులను ఆదేశించాను' అంటూ పేర్కొన్నారు.

13కు చేరిన మృతులు

- 50 మంది క్షతగాత్రులు
- విజయనగరం సర్వజనాస్పత్రి, విశాఖ కేజీహెచ్ తదితర ఆస్పత్రుల్లో కోలుకుంటున్న బాధితులు
- విజయనగరానికి విశాఖ నుంచి నలుగురు వైద్యులు



మృతిచెందిన లోకో పైలట్ మధుసూదనరావు(ఫైల్)



మృతిచెందిన పలాస ప్యాసింజర్ గార్డు శ్రీనివాసరావు(ఫైల్)

ఆరిలోవ(విశాఖతూర్పు)/మహారాణిపేట (విశాఖ దక్షిణ) /తాటిచెట్లపాలెం(విశాఖఉత్తర): విజయనగరం జిల్లా భీమాలి-అలమండ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కి చేరింది. మొత్తం 50 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో 34 మందిని విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించగా.. మిగిలిన వారిని విశాఖ కేజీహెచ్, రైల్వే, ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా, విశాఖ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన పలాస ప్యాసింజర్‌లో స్పెషల్ గార్డుగా ఉన్న మరిపి శ్రీనివాసరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. విశాఖ ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. రైల్వే అధికారులు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని సోమవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయనకు తల్లితో పాటు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న భార్య అమల, పీజీ చదువుతున్న కుమార్తె హర్షప్రియ, బీటెక్ చదువుతున్న కుమారుడు చంద్రదీప్ ఉన్నారు. శ్రీనివాసరావుది పార్వతీపురం కాగా, ఉద్యోగ రీత్యా విశాఖలో స్థిరపడ్డారు. అలాగే, రాయగడ ప్యాసింజరుకు లోకో పైలట్‌గా ఉన్న విశాఖ జిల్లా తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి మధుసూదనరావు(53) ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య సూర్యలత, ఇద్దరు కుమార్తెలున్నారు. ఉద్యోగరీత్యా మధుసూదనరావు కుటుంబం సహా విశాఖలో ఉంటున్నారు.

విశాఖ కేజీహెచ్‌లో ఇద్దరికి శస్త్ర చికిత్స


విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో గాయపడ్డవారిలో నలుగురిని కేజీహెచ్‌కు తరలించగా.. వారిలో ఇద్దరికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. విజయనగరం జిల్లా జామి మండలానికి చెందిన నల్ల కుమారి, విశాఖ జిల్లా గాజువాక దయాల్‌నగర్ ప్రాంతానికి చెందిన ముర్రు లక్ష్మిలకు సోమవారం శస్త్ర చికిత్స నిర్వహించారు. నల్ల కుమారికి ఆర్థోపెడిక్ వార్డులో శస్త్ర చికిత్స అనంతరం ప్లాస్టిక్ సర్జరీ వార్డుకు తరలించినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. లక్ష్మికి సాయంత్రం అత్యవసరంగా శస్త్ర చికిత్స చేశామన్నారు. శ్రీకాకుళం జిల్లా సింగపురం గ్రామానికి చెందిన మోహిద వరలక్ష్మి, శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం నడగాం గ్రామానికి చెందిన గొట్ట కమలమ్మలు చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా, రైలు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్సలు అందించడానికి, పోస్టుమార్టం నిర్వహించడానికి ముగ్గురు ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యులను విజయనగరం పంపినట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. అలాగే ఆర్థోపెడిక్ వైద్యుడు భగవాన్‌ను క్షతగాత్రులకు వైద్య సేవలు అందించడానికి విజయనగరం పంపినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ చెప్పారు. విజయనగరం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడినవారిలో 8మందిని విశాఖ తరలించారు. వీరిలో నలుగురు కేజీహెచ్‌లో, మరొకరు ఆరిలోవ హెల్త్ సిటీలో చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురిని రైల్వే హాస్పిటల్లో చేర్పించారు. వీరిలో పలాస పాసింజర్ స్పెషల్ గార్డు మరిపి శ్రీనివాసరావు ఆదివారం రాత్రే మృతిచెందారు. మిగిలిన బి.తేజేశ్వర రావు, పి.శ్రీనివాసరావు రైల్వే హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వీరు కూడా రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ఆదివారం విధులు ముగించుకుని గోపాలపట్నం నుంచి పలాస రైలులో తమ సొంత ఊరు శ్రీకాకుళం వెళ్తూ ప్రమాదంలో గాయపడ్డారు.

మృతుల వివరాలు



1. కె.రవి (గొడికొమ్ము, జామి మండలం, విజయనగరం జిల్లా)
2. గిడిజాల లక్ష్మి (ఎస్పీ రామచంద్రాపురం, జి.సిగడం మండలం, శ్రీకాకుళం జిల్లా)
3. కరణం అప్పలనాయుడు (కాపుశంభాం, గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
4. చల్లా సతీష్ (తోటపాలెం, విజయనగరం)
5. శింగంపల్లి మధుసూదనరావు (లోకో పైలట్, ఎస్‌ఏడీ, విశాఖపట్నం)
6. చింతల కృష్ణమనాయుడు (గ్యాంగ్‌మన్, కొత్తవలస, విజయనగరం జిల్లా)
7. పిల్లా నాగరాజు (కాపుశంభాం, గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
8. మరిపి శ్రీనివాసరావు (పలాస ప్యాసింజర్ గార్డ్, ఆరిలోవ, విశాఖపట్నం)
9. టెంకల సుగుణమ్మ (మెట్టవలస, జి.సిగడం మండలం, శ్రీకాకుళం జిల్లా)
10. రెడ్డి సీతంనాయుడు (రెడ్డిపేట, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా)
11. మజ్జి రాము (గదబవలస, గరివిడి మండలం, విజయనగరం జిల్లా)
12. సువ్వారి చిరంజీవి (లోకో పైలట్, కుశాలపురం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా)
13. ఒక మృతదేహం ఆచూకీ తెలియాల్సి ఉంది.

రైలు ఒక్కసారిగా కుదుపునకు గురైంది..



నేను విజయనగరం జిల్లా రాజాంలో తృతీయ సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్నా. రెండు రోజుల సెలవులకు విశాఖ వచ్చి తిరుగు ప్రయాణంలో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం పలాస ట్రైన్ ఎక్కా. చీపురుపల్లిలో దిగాలి. ఆఖరి చివరి నుంచి రెండో బోగీలో ఉన్నాను. సాయంత్రం వేళలో రైలు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. రైల్లోని లగేజ్ షెల్ఫ్‌లో ఉన్న సామాన్లు నాపై పడ్డాయి. దీంతో కంగారుపడ్డాను. ఒక్కసారిగా బోగీ 45 డిగ్రీల కోణంలో ఒరిగిపోయింది. నేను, నా స్నేహితుడు కలిసి బోగీలోని రాడ్లను పట్టుకుని బయటకు వచ్చేశాం.
– వి.అవినాష్, ఇంజినీరింగ్ విద్యార్థి, మునగపాక

వైద్య విద్యార్థుల హాజరు పర్యవేక్షణకు నోడల్ అధికారులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యార్థుల హాజరును పర్యవేక్షించేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రాక్టికల్, థియరీ హాజరు పర్యవేక్షణకు బ్యాచ్‌ల వారీగా ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్‌లను నియమించాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనలకు అనుగుణంగా థియరీలో 75 శాతం, ప్రాక్టికల్స్‌లో 80 శాతం హాజరు తప్పనిసరిగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

బాలికల విద్యాభివృద్ధికి కృషి

కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు

సాక్షి, అమరావతి: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో బోధనను పటిష్టం చేసి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కేజీబీవీ కార్యదర్శి డి.మధుసూదనరావు సూచించారు. కేజీబీవీల్లో సేవలు అందించే సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు 108 మంది స్టేట్ రిసోర్స్ పర్సన్స్‌కు అవగాహన సదస్సు సోమవారం విజయవాడలో ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ బాలికలకు నాణ్యమైన విద్య అందించేందుకు శిక్షణ దోహదం చేస్తుందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణకు 'ఇగ్నస్ ఫెహల్' బృందం భాగస్వామిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

విద్యారంగ సంస్కరణలపై క్షేత్రస్థాయి పరిశీలన

హిందూ కళాశాల విద్యార్థులకు ప్రవీణ్ ప్రకాశ్ అభినందన

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, వాటి ఫలితాలపై గుంటూరులోని హిందూ కళాశాల విద్యార్థుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. బీఎస్సీ బయోమెడికల్ సెకండియర్ చదువుతున్న ఎం.ప్రేమ్ హర్షవర్ధన్, ఐశ్వర్య, షణ్ముఖి తమ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ నుంచి అనుమతి పొంది.. గుంటూరులోని పలు ప్రభుత్వ స్కూళ్లను సందర్శించారు. అందుకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారిని ప్రవీణ్ ప్రకాశ్ అభినందించి.. సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

మరిన్ని పెట్టుబడులు

రూ.19,037 కోట్ల విలువైన 10 ప్రాజెక్టులకు సర్కారు గ్రీన్ సిగ్నల్



రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: స్థానిక యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పరిశ్రమల ఏర్పాటును పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో రూ.19,037 కోట్ల విలువైన 10 పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఇందులో ఏడు కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు కాగా.. మూడు విస్తరణ కార్యక్రమాలకు చెందినవి ఉన్నాయి. వీటి ద్వారా మొత్తం 69,565 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్‌ఐపీబీ) ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికరంగంలో సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. వీటన్నింటినీ అధికారులు తెలుసుకుంటూ ప్రపంచ పారిశ్రామిక రంగం పోకడలను అర్థంచేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు పారిశ్రామిక విధానాల్లో మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. అత్యంత పారదర్శక విధానాల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక సానుకూల వాతావరణాన్ని తీసుకొచ్చామని.. ఈ క్రమంలోనే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచామని ముఖ్యమంత్రి జగన్ గుర్తుచేశారు. పరిశ్రమలపట్ల సానుకూల క్రియాశీలతను మరింత బలోపేతం చేయడం ద్వారా ఈ ప్రయాణం మరింతగా ముందుకు సాగించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇచ్చే అనుమతులు, తదితర అంశాల్లో ప్రభుత్వం వేగంగా స్పందిస్తోందని, ఏ సమస్య ఉన్నా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉన్నామన్న భరోసాను వారికి కల్పిస్తున్నామన్నారు. కానీ, అనుమతులు, క్లియరెన్స్ విషయంలో ఇప్పుడున్న వేగాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని, పారిశ్రామిక వర్గాల నుంచి వచ్చే ప్రతిపాదనలపట్ల చురుగ్గా వ్యవహరించడంతో పాటు, వాటికి త్వరగా అనుమతులు మంజూరు చేసే ప్రక్రియ వేగాన్ని ఇంకా పెంచాల్సిందిగా అధికారులను సీఎం జగన్ ఆదేశించారు.

జీఐఎస్ ఒప్పందాల అమలును వేగవంతం చేయండి..

ఇక విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల అమలు విషయంలో మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి కోరారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాల విషయంలో గత ప్రభుత్వంలో కన్నా ఈ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున మేలు చేకూర్చామని, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈల రంగానికి పునరుజ్జీవం కల్పించిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఇస్తూ వారికి చేదోడుగా నిలవడం ద్వారా ఎంఎస్‌ఎంఈల పట్ల ఈ ప్రభుత్వం సానుకూలతతో ముందుకు సాగుతోందన్నారు. ఈ రంగంపై ఎక్కువమంది ఆధారపడి బతుకుతున్నారు కాబట్టి.. వీటిని కాపాడుకోవడం ప్రభుత్వ బాధ్యతన్నారు. ఈ సమావేశంలో విద్యుత్, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్.. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్.. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె. విజయానంద్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ (చేనేత, జౌళి) ముఖ్యకార్యదర్శి కె. సునీత, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపీబీ ఆమోదం పొందిన కంపెనీల వివరాలు..

- చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎలక్ట్రిక్ బస్సుల తయారీ పరిశ్రమను ఏర్పాటుచేయనున్న పెప్పర్ మోషన్ కంపెనీ. రూ.4,640 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా 8080 మందికి ఉద్యోగాలు రానున్నాయి.
- విజయనగరం జిల్లా ఎస్.కోటలో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం. దీనిద్వారా రూ.531 కోట్ల పెట్టుబడి, 35,750 మందికి ప్రత్యక్షంగానూ, 9,375 మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు లభిస్తాయి.
- శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో రూ.1,750 కోట్ల పెట్టుబడితో శ్రేయాస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమ ఏర్పాటు. ఇందులో 2,000 మందికి ప్రత్యక్షంగానూ, మరో 500 మందికి పరోక్షంగా ఉద్యోగాలు.
- అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో స్మైల్ (సబ్‌స్ట్రేట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఇండియా లిమిటెడ్ ఎంటర్‌ప్రైజెస్) కంపెనీ ఆధ్వర్యంలో రూ.166 కోట్ల పెట్టుబడితో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారీ యూనిట్ ఏర్పాటు. దీనిద్వారా దాదాపు 5 వేల మందికి ఉద్యోగాలు.
- నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద కోస్టల్ ఆంధ్రా పవర్ లిమిటెడ్ (రిలయెన్స్ పవర్) తన పారిశ్రామిక కార్యకలాపాన్ని మార్చుకునేందుకు ఎస్‌ఐపీబీ ఆమోదం. థర్మల్ పవర్ స్థానంలో రూ.6,174 కోట్ల పెట్టుబడితో కొత్త తరహా, సాంప్రదాయేతర పర్యావరణహిత గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ప్లాంటుకు ఆమోదం. దీనిద్వారా 600 మందికి ప్రత్యక్షంగానూ, 2,000 మందికి పరోక్షంగానూ ఉద్యోగావకాశాలు.
- తూర్పుగోదావరి జిల్లా కడియం వద్ద ఆంధ్ర పేపర్ లిమిటెడ్ రూ.4వేల కోట్ల పెట్టుబడితో సంస్థను విస్తరించనుంది. తద్వారా 3వేల మందికి ఉద్యోగాలు.
- విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో ఏటీసీ టైర్స్ లిమిటెడ్ కూడా రూ.679 కోట్ల పెట్టుబడితో విస్తరణ. తద్వారా 300 మందికి ఉద్యోగాలు.
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ సైతం రూ.933 కోట్ల పెట్టుబడి సంస్థను విస్తరించనుంది. 2,100 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఏలూరు జిల్లా కొమ్మూరు వద్ద రూ.114 కోట్ల పెట్టుబడి పెట్టనున్న శ్రీ వెంకటేశ్వర బయోటెక్ లిమిటెడ్‌కు ఎస్‌ఐపీబీ ఆమోదం. దీనిద్వారా 310 మందికి ఉద్యోగాలు.
- విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం మద్ది వద్ద రూ.50 కోట్ల పెట్టుబడి పెట్టనున్న ఓరిల్ ఫుడ్స్ లిమిటెడ్. దాదాపుగా 550 మందికి ఉద్యోగాలు వస్తాయి.

ఫిబ్రవరిలో అర్చకులకు రాత పరీక్ష

దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ



మాట్లాడుతున్న దేవదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో అర్చకులను నియమించేందుకు ఫిబ్రవరిలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ చెప్పారు. సోమవారం మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని సీతానగరంలో ఉన్న సీతా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్చక శిక్షణ అకాడమీ ఆధ్వర్యంలో దేవదాయ శాఖలో పురోహితులకు శిక్షణ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవదాయ శాఖ పరిధిలో పెద్ద సంఖ్యలో ఆలయాల నిర్మాణం జరుగుతోందని, వీటిలో నిష్ణాతులైన అర్చకులను నియమించనున్నామన్నారు. త్వరలో అర్చక పరీక్షలు నిర్వహించేందుకు ఆగమ సలహా మండలి సూచనలతో సిలబస్‌ను సిద్ధం చేయాలని ఆదేశించామని చెప్పారు. ఇప్పటికే నాలుగు ఆగమాలకు సంబంధించిన సిలబస్ సిద్ధంగా ఉందని, మిగిలిన సిలబస్ కూడా సిద్ధం చేసి ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిస్తామని అర్చక శిక్షణ అకాడమీ డైరెక్టర్ తనూజ్ విష్ణువర్ధన్ తెలిపారు.

ఈఎండీపీ ప్రాజెక్ట్ విజయవంతం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు రూపొందించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) విజయవంతమైందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టుతో అనేక సానుకూల ఫలితాలు రావడంతోపాటు అంతర్జాతీయ ఖ్యాతిని కూడా కైవసం చేసుకుందని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చడం కోసం ఈఎండీపీని రూపొందించిందని పేర్కొన్నారు.వారిలో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించడం, అవగాహన స్థాయిని పెంచడం లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్‌ను 2021లో రాష్ట్రంలోని 30 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారని తెలిపారు. వెయ్యి మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రస్తుతం 5,420 పాఠశాలల్లో 3.50 లక్షల మంది విద్యార్థులకు విస్తరించినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గ్లోబల్ స్థాయికి చేర్చేలా వారిలో నైపుణ్యాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అందుకు అనుగుణంగా ఈ ప్రోగ్రామ్ దోహదనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. నవంబర్ 1 నుంచి మూడురోజుల పాటు నెదర్లాండ్స్‌లో జరిగే గ్లోబల్ సోషల్ అండ్ ఫైనాన్షియల్ స్కిల్స్ కాన్ఫరెన్స్ జరగనుందని తెలిపారు. ఈ సదస్సులో ఈఎండీపీ ద్వారా ఏపీలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఫలితాలను వివరించనున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి చేయడం, సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనడం ఇందులో కీలక అంశాలని ఆయన తెలిపారు. ఈ విధానంలో శిక్షణ పొందిన విద్యార్థుల్లో అవగాహన స్థాయి 80 శాతం, స్వీయ సమర్థతా సామర్థ్యాలు 76 శాతం పెరిగినట్టు గుర్తించామని పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థుల్లో వచ్చిన ఈ మార్పుతో ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ)ను ఇతర తరగతులకు విస్తరించనున్నట్లు వివరించారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ శేషగిరిరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. మంగళగిరిలో గ్రంథాలయ పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శేషగిరిరావు మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు అన్ని గ్రంథాలయాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

'వర్సిటీ' పోస్టుల భర్తీలో దివ్యాంగులకు రిజర్వేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్ కచ్చితంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల శాఖ కమిషనర్ బి.రవిప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కమిషనర్, అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులు జారీచేశారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం నిర్దేశిత వైకల్యం ఉన్నవారికి నాలుగు శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. అంధత్వం, వినికిడి లోపం, మెదడుకు సంబంధించిన పక్షవాతం, కుష్టు వ్యాధి, మరుగుజ్జు, కండరాల బలహీనత, యాసిడ్ దాడి బాధితులు తదితర వైకల్యాలు ఉన్న వారికి రిజర్వేషన్ వర్తింపజేయాలని సూచించారు. పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌లో కూడా దివ్యాంగుల కోటా నాలుగు శాతం రిజర్వేషన్ అనే విషయాన్ని స్పష్టంగా ప్రస్తావించాలని, రిజర్వ్ చేసిన పోస్టులు ఏ వర్గానికి ఎన్ని అనేది కూడా సూచించాలని ఆదేశించారు.

ఫార్మసీ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని బీఫార్మసీ, ఫార్మ్–డి కోర్సుల ప్రవేశాల షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈఏపీసెట్ కన్వీనర్ చదలవాడ నాగరాణి సోమవారం విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ అభ్యర్థులు నవంబర్ 1వ తేదీ నుంచి 8వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని సూచించారు. ఎంపీసీ అభ్యర్థులకు నవంబర్ 8, 9 తేదీల్లో, బైపీసీ అభ్యర్థులకు 9, 10, 11 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఎంపీసీ అభ్యర్థులు 10 నుంచి 12వ తేదీలోపు ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వీరు15,16 తేదీల్లో కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. బైపీసీ అభ్యర్థులు 11 నుంచి 13వ తేదీ లోపు ఐచ్ఛికాలు నమోదు చేసుకోవాలని, 17వ తేదీన వీరికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వీరు నవంబర్ 18 నుంచి 21 తేదీల మధ్య కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు.



పది వేల సంవత్సరాలు బతకబోతున్నట్లుగా వ్యవహరించకండి.
మృత్యువు మీ మెడ మీద వేలాడుతుంటుంది. బతికి ఉన్నప్పుడే,
మీ చేతుల్లో ఉన్నప్పుడే మంచిగా ఉండండి.

– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 31 అక్టోబర్ 2023

నడుస్తున్న చరిత్ర!

పాత చరిత్రను కొత్తగా లిఖించే మరో ప్రయత్నం మొదలైంది. పిల్లల పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం ఉన్న 'ప్రాచీన చరిత్ర' స్థానంలో 'సంప్రదాయ (క్లాసికల్) చరిత్ర'ను ప్రవేశపెట్టనున్నారు. అంటే, ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక అంటూ బ్రిటీషు వారు చేసిన చరిత్ర విభజన ఇక చెరిగిపోనుంది. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎన్సీఈఆర్టీ) వేసిన ఉన్నత స్థాయి సంఘం చేసిన ఈ సిఫార్సు చర్చ రేపుతోంది. అలాగే, ఇకపై 'ఇండియా' స్థానంలో 'భారత్'ను తీసుకు రావాలని సైతం సదరు కమిటీ సిఫార్సు చేసిందన్న వార్త తేనెతుట్టెను కదిలించింది. భారతదేశపు గతానికి సంబంధించిన కథనాలను 'సరిచేసేందుకు' ఈ మార్పులు తీసుకు వస్తున్నామన్నది ఎన్సీఈఆర్టీ కమిటీ మాట. ఇండియా స్థానంలో భారత్ అనే సిఫార్సును అంగీకరించలేదని ఎన్సీఈఆర్టీ వివరణనిచ్చినా, కమిటీ చేసిన ఇతర ప్రతిపాదనలపైనా అనుమానాలు, చర్చోపచర్చలు ఇప్పుడప్పుడే ఆగేలా లేవు.

2020 నాటి జాతీయ విద్యా విధానంలో భాగంగా సాంఘిక శాస్త్రాల్లో మార్పులు చేర్పులు సూచించడం కోసం రిటైర్డ్ చరిత్ర ప్రొఫెసర్ అయిన సీఐ ఐజాక్ సారథ్యంలో ఓ ఉన్నత స్థాయి కమిటీని 2022లో ఎన్సీఈఆర్టీ నియమించింది. పాఠ్యప్రణాళికలో భాగంగా పిల్లలకు బోధించే అన్ని సబ్జెక్టుల్లోనూ 'భారతీయ విజ్ఞాన వ్యవస్థ' (ఐకేఎస్)ను ప్రవేశపెట్టాలని కూడా ఈ కమిటీ సిఫార్సు చేసింది. 'ప్రాచీన చరిత్ర' బదులు 'సంప్రదాయ చరిత్ర'ను పెట్టాలనే ప్రతిపాదనకు తనదైన సమర్థనను వినిపించింది. ప్రస్తుత పాఠ్యపుస్తకాల్లో మన వైఫల్యాలనే పేర్కొన్నారనీ, మొఘలులు, సుల్తానులపై మన విజయాలను చెప్పలేదనీ, కాబట్టి యుద్ధాలలో 'హిందూ విజయాల'పై దృష్టి పెడుతూ పాఠ్యపుస్తకాలు మార్చాలనీ ఐజాక్ బృందపు వాదన. చరిత్రను చరిత్రగా చెప్పాల్సిందే! అందులో లోటుపాట్లను సవరించడమూ తప్పు కాదు. కానీ, సాక్ష్యాధారాలతో సాగాల్సిన ఆ చరిత్ర రచనను మతప్రాతిపదికనో, మరో ప్రాతిపదికనో మార్చాలనుకోవడమే సమస్య.

'ఇండియా' అంటూ ప్రతిపక్ష కూటమి తమకు తాము నామకరణం చేసుకున్న తరువాత నుంచి ఈ 'ఇండియా' వర్సెస్ 'భారత్' రచ్చ నడుస్తూనే ఉంది. భారత రాజ్యాంగం 'ఇండియా... దటీజ్ భారత్' అని పేర్కొన్నప్పటికీ, ప్రభుత్వం కొన్నాళ్ళుగా ఈ 'భారత' నామంపై కొత్త ప్రేమ కనబరుస్తోంది. ఆ మధ్య జీ–20 వేళ రాష్ట్రపతి అధికారిక విందు ఆహ్వానంలో సైతం 'భారత్' అనే పదాన్నే వాడడం వివాదం రేపింది. అసలు 'ఇండియా' అనే పేరే వలసవాద ఆలోచనకు ప్రతీక అన్నది అధికార పక్షం వాదన. ఏడువేల ఏళ్ళ నాటి విష్ణుపురాణం తదితర ప్రాచీన గ్రంథాల్లో 'భారత్' అని ఉపయోగించినందున ఆ పేరును వాడాలనేది ఐజాక్ కమిటీ సూచన. అయితే, ఇన్నేళ్ళుగా 'ఇండియా', 'భారత్'లను పరస్పర పర్యాయపదాలుగానే వాడుతున్న దేశంలో 'ఇండియా' అని ఉన్నచోటల్లా పాఠ్యపుస్తకాల్లో 'భారత్' అని మార్చేయమని సిఫార్సు చేయడమే అర్థరహితం.

ప్రభుత్వం తమనేమీ ప్రభావితం చేయలేదని ప్రొఫెసర్ ఐజాక్ అంటున్నారు కానీ, హిందూత్వ భావజాలం వైపు ఆయన మొగ్గు జగమెరిగిన సత్యం. పాలక పక్షపు ప్రాపకం కోసం చేసే ఇలాంటి ప్రతిపాదనలు, సిఫార్సులు గాలిలో నుంచి వాటంతట అవి ఊడిపడతాయని అనుకోలేం. అలా అనుకుంటే అమాయకత్వమే. ఆ మాటకొస్తే, 2018లోనే ప్రాచీన చరిత్రను తిరగరాసేందుకు తోడ్పడే నివేదికను సమర్పించాల్సిందిగా కేఎస్ దీక్షిత్ సారథ్యంలోని కమిటీని కోరారు. దీక్షిత్ సాక్షాత్తూ ఇండియన్ ఆర్కియలాజికల్ సొసైటీకి ఛైర్మన్, భారత పురావస్తు సర్వేక్షణ సంస్థకు మాజీ జాయింట్ డైరెక్టర్ జనరల్. తాజా సిఫార్సులు వచ్చే విద్యా సంవత్సరానికల్లా అమలులోకి రావచ్చట. పిల్లల పాఠ్యపుస్తకాల్లోనే కాక, విద్యావిషయక పరిశోధనలోనూ ఈ కమిటీ సిఫార్సులు చోటుచేసుకుంటాయని 2018లో సంస్కృతీశాఖ మంత్రిగా చేసిన మహేశ్‌శర్మ తదితరులు ఆశాభావంతో ఉన్నారు.

అసలింతకీ కొత్తగా చేర్చదలచిన ఈ 'సంప్రదాయ చరిత్ర' అంటే ఏమిటన్నది ఇంకా తెలియాల్సి ఉంది. దేశాన్ని పాలించిన రాజవంశాలన్నిటికీ పాఠ్యగ్రంథాల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఐజాక్ కమిటీ ప్రతిపాదించింది. ఈ సమప్రాతినిధ్యం ప్రాంతాల ప్రాతిపదికన, చరిత్రలో ఆ వంశాల ప్రాధాన్యం ప్రాతిపదికనైతే ఫరవాలేదు. అలా జరుగుతుందా అన్నది ప్రశ్న. సంగీతం, సాహిత్యం, కళలు, వాస్తుశిల్పం, వాణిజ్యం, భక్తి ఉద్యమాల్లో ఎంతో భాగమున్న దక్షిణాది రాజవంశాలను ఎన్సీఈఆర్టీ పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. ఇంతకాలం ఉత్తర భారత దృక్కోణంలోనే నడుస్తున్న వారి పుస్తకాల్లో దక్షిణ భారత రాజవంశాలకూ తగినంత చోటిస్తారా? అది ఓ బేతాళప్రశ్న. అయితే, దేశంలో నిత్యం జరిగే చారిత్రక, పురావస్తు అధ్యయనాల్లో కొత్తగా బయటపడుతున్న అంశాలను సైతం పాఠ్యప్రణాళికలో చేర్చాలన్న కమిటీ సిఫార్సును తప్పక స్వాగతించాలి.

చరిత్ర జడపదార్థం కాదు. దొరికిన సరికొత్త సాక్ష్యాధారాలతో ఎప్పటికప్పుడు కొత్తగా నేర్చుకోవాలి. సమకాలీన అంశాలనూ చేర్చుకోవాలి. కానీ, కొత్త మార్పుల పేరిట పాలకపక్ష భావజాలానికి అనుకూలంగానో, అన్నీ పురాణాల్లోనే ఉన్నాయిష అనో చరిత్రను మార్చాలని చూడడమే దుస్సహనీయం. అసలు సిసలు భారత్‌కు తామే ప్రతినిధులమని పిల్లలకు పాఠాలతో ఎక్కించి, రాజకీయ లబ్ధి పొందాలనుకుంటే అంత కన్నా ఘోరం లేదు. చంద్రయాన్–3, నారీ శక్తి వందన్, కోవిడ్ నిర్వహణ లాంటి అంశాలకూ చోటిచ్చేలా ఎన్సీఈఆర్టీ ప్రణాళికా రచన చేసినట్టు విద్యాశాఖ చెబుతోంది. నిజానికి, పరిశోధన చేసి, పిల్లల వయసుకు తగిన పాఠాలతో ముందుకు రావడం ఎన్సీఈఆర్టీ పని. ఆ బాధ్యత వదిలేసి, అధికార పార్టీ రాజకీయ ఆలోచనలకు తగ్గట్టు, లేదా ఒక పక్షం విజయాలనే కీర్తిస్తున్నట్టు పాఠ్యాంశాలనే మార్చాలనుకుంటే అది సమగ్ర చరిత్ర కాదు. సమర్థనీయం కానే కాదు!

స్త్రీశక్తి వినిమయంతోనే అభివృద్ధి!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ కర్షకుల అసమానతల మీద పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది, పోరాటం కూడా జరుగుతోంది. నిజానికి అనాది కాలం నుంచి ప్రధానమైన అసంఘటిత శ్రామికులుగా స్త్రీలు ఉన్నారు. వారు కేవలం శ్రామికులే కాదు, ఉత్పత్తి శక్తులు కూడా! కానీ వారిని రానురాను పురుషాధిపత్యంతో అన్ని రంగాల్లోనూ తొక్కివేశారు. శ్రామిక స్త్రీ ప్రపంచానికి ఊపిరి. స్త్రీ శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోకుండా మనం అభివృద్ధి పథంలో పయనించలేం. కుల, మత, లింగ బేధాలు లేకుండా ఆత్మ గౌరవంతో ముందుకు వెళ్ళవలసిన సందర్భం ఇది.

నిజానికి మానవాళి చరిత్రలో జరిగిన మార్పులన్నీ స్త్రీలు ఉత్పత్తికి దగ్గరయ్యే క్రమంతోనే ముడిపడి వున్నాయి. పురుషులతోనూ, తన పిల్లలతోనూ, తల్లిదండ్రులతోనూ స్త్రీకుండే సంబంధ బాంధవ్యాలే మానవాళి చరిత్ర. స్త్రీలకూ, పురుషులకూ మధ్య వ్యక్తమయ్యే ఐక్యత, ఘర్షణల్లో సామాజిక సంబంధాలు నిర్ణయమయ్యాయి. ఒకసారి మనం చరిత్ర పూర్వ యుగానికి వెళితే, ఉత్పత్తిలో తనకు సహకరించే పురుషుణ్ణి స్త్రీయే ఎన్నుకునేది. ఈ విధమైన పద్ధతి భారత సమాజంలో ఆర్యులు రాకపూర్వం వుండేది. ఆర్యులు వచ్చాక ఉత్పత్తి రంగం నుండి వారిని తప్పించి బానిసత్వంలోకి నెట్టారు. ఆదిమ సమాజం నుండి స్త్రీ గణనాయికగా, సామాజిక శ్రామిక శక్తిగా, పంపిణీదారుగా వేలాది సంవత్సరాల పాటు సమసమాజ భావనతో సమాజాన్ని నడిపించింది. హెన్రీ మోర్గాన్ తన 'ప్రాచీన సమాజం'లో ఈ సమాజ పరిణామ క్రమాన్ని విశ్లేషించారు.

2018–19 పరిస్థితులతో 2022–23 పరిస్థితులను పీఎల్ఎఫ్ఎస్ (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) నివేదికతో సరిపోల్చితే పనిపరంగా స్త్రీల ముఖచిత్రం ఎలా మారిందో అర్థమవుతుంది. స్వీయ ఉపాధిపై ఆధారపడే మహిళలు 53 శాతం నుంచి 65 శాతానికి పెరిగితే, రెగ్యులర్ మహిళా ఉద్యోగులు 22 శాతం నుంచి 16 శాతానికి తగ్గారు. క్యాజువల్ ఉద్యోగులు 25 శాతం నుంచి 19 శాతానికి తగ్గిపోయారు. యజమానులుగా వుండే మహిళలు 23 శాతం నుంచి 28 శాతానికి పెరిగితే, జీతాలు లేని పనివారి వాటా 31 శాతం నుంచి 38 శాతానికి చేరుకుంది. అదే పురుషులలో ఈ శాతాలు కాస్త భిన్నంగా ఉన్నాయి. స్వీయ ఉపాధి పొందే పురుషులు ఈ ఐదేళ్లలో 52 శాతం నుంచి 54 శాతానికి పెరగగా, యజమానులు 44 శాతం నుంచి 44.3 శాతానికి, జీతాల్లేని సహాయకులు 7.6 శాతం నుంచి 9.3 శాతానికి పెరిగారు. వ్యవసాయంపై ఆధారపడే కార్మికుల వాటా 41 శాతం నుంచి 43 శాతానికి, నిర్మాణరంగ పనులను నమ్ముకునే వారి వాటా 12 శాతం నుంచి 13 శాతానికి పెరిగింది. స్త్రీ, పురుషుల మధ్య ఉపాధి, ఆదాయాలలో వ్యత్యాసాలకు సంబంధించిన 200 సంవత్సరాల రికార్డులను విశ్లేషించి... నోబెల్ బహుమతి గ్రహీతలు ఎంతో ఆసక్తికర



విషయాలను బయట పెట్టారు.

ప్రపంచ వ్యాప్తంగా ఇంకా సుమారు 120 కోట్ల మంది పేదవారున్నారు. వీరిలో భారతదేశం, పాకిస్తాన్‌తో కూడిన దక్షిణాసియా ప్రాంతంలో అత్యధికంగా వున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఆఫ్రికాలో 38 శాతం మంది పేదలు వున్నారు. అలాగే బహువిధ పేదరిక సూచీని నీతి ఆయోగ్ ఇటీవల వెలువరించింది. విద్య, వైద్యం, జీవన ప్రమాణాలు వంటి 12 అంశాల ఆధారంగా రూపొందే ఈ సూచీ ప్రకారం, 2015–16లో 25 శాతం వున్న బహువిధ పేదరికం 2019–21 నాటికి 15 శాతానికి తగ్గింది. ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశాలలో పేదరిక నిర్మూలనలో మంచి పురోగతి కనిపించింది. బిహార్‌లో 34 శాతం, జార్ఖండ్‌లో 28.8 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 23 శాతం, మధ్యప్రదేశ్‌లో 21 శాతం, అస్సామ్‌లో 19 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 16 శాతం మేర బహువిధ పేదరికం తగ్గింది. అయినప్పటికీ, ఈ రాష్ట్రాల్లో పేదరికం జాతీయ సగటు కన్నా ఎక్కువే. ప్రపంచంలో పనిచేసే జనాభాలో మూడింట రెండొంతుల మంది అసంఘటిత రంగంలోనే వున్నారన్నది అంతర్జాతీయ కార్మిక సంఘం అంచనా. వీరు లాటిన్ అమెరికా, సహారా ఎడారి దిగువ దేశాలు, దక్షిణాసియా దేశాల్లోనే ఎక్కువగా ఉన్నారు. అసంఘటిత కార్మికుల్లో 58 శాతం మహిళలే. పురుషులతో పోలిస్తే వారి వేతనాలు తక్కువ.

డిజిటల్ వేదికల ద్వారా ఉపాధి పొందేవారిని ప్లాట్‌ఫామ్ కార్మికులని అంటారు. అసంఘటిత రంగంలో వీరిని కొత్త వర్గంగా పరిగణిస్తున్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థలు వచ్చిన తర్వాత ఐటీ రంగంలో యువతులు ముమ్మరంగా ప్రవేశించారు. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, ఇంగ్లాండ్ దేశాల్లో ఈ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంస్థలు ఎక్కువగా ఉన్నాయి. వీటికి అనుగుణంగా ఢిల్లీ, బాంబే, హైదరాబాద్, మంగుళూరు, కొచ్చిన్‌లలో భారతీయ యువతులు రాత్రివేళల్లో పని చేస్తున్నారు. దీంతో అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారు.

స్మార్ట్‌ఫోన్ విప్లవం ద్వారా ఇప్పుడు పరిమిత కాల పనులు వచ్చాయి. భారత్‌లో ఈ తరహా గిగ్ వర్కర్ల సంఖ్య 80 లక్షలు. యువజనులు, వలస వచ్చిన వారు ఈ ఉద్యోగాలను ఆశ్రయిస్తున్నారు. వీరి పని పరిస్థితులు మెరుగుపడాలనీ, వీరికి ఆరోగ్య బీమా, పింఛన్ సౌకర్యాలు అందించాలనీ ఆర్థికవేత్తలు సిఫార్సు చేస్తున్నారు. గిగ్ వర్కర్లలో కేవలం 12.2 శాతానికే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా సౌకర్యం ఉంది. నాలుగు శాతం అటల్ పెన్షన్ పథకంలో చేరారు. సామాజిక భద్రత అంటే పింఛన్, ఆరోగ్య బీమా సదుపాయాలు రెండూ ఉండడం. దీన్ని ఎవరు కల్పించాలనేది ప్రశ్న. కేంద్ర ప్రభుత్వమా లేక డిజిటల్ ప్లాట్‌ఫామ్ కంపెనీలా? కంపెనీల నుంచి కొంత రుసుము వసూలు చేసి ప్రభుత్వ సంక్షేమ నిధిలో జమ చేయాలి. గిగ్ వర్కర్ల నైపుణ్య శిక్షణకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి ప్లాట్‌ఫామ్ కంపెనీలు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలసి సాగాలి.

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యాధిపత్యం, పెట్టుబడిదారీ వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థలు స్త్రీని ఇంకా బలహీనమైనదిగా చూస్తున్నాయి. ఈ ధోరణి అంతం కావాలంటే డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, మహాత్మా పూలే ఆలోచనలతో ముందుకు సాగాలి. రాజ్యాంగ స్ఫూర్తిని అందుకోవాలి. కుల, మత, లింగ భేదాలు లేకుండా ఆత్మ గౌరవంతో ముందుకు వెళ్ళవలసిన సందర్భం ఇది. సంకెళ్ళు తెంచుకోవాల్సింది స్త్రీలే, ఎవరో కాదు. స్త్రీలు ఆత్మగౌరవ పోరాట పతాకాన్ని ఎగరవేయాలి. శ్రామిక స్త్రీ ప్రపంచానికి ఊపిరి!

వ్యాసకర్త దళితోద్యమనేత । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నివాళి



ఏ సమయంలోనైనా ప్రపంచంలో ఎవరో ఒకరు 'ఫ్రెండ్స్' ఎపిసోడ్స్ చూస్తూ వుంటారు. (అమెరికన్ సిట్‌కామ్ 'ఫ్రెండ్స్' నటుడు మాథ్యూ పెర్రీ 54 ఏళ్ల వయసులో చనిపోయారు.)

– సుజయ్ ఘోష్, దర్శకుడు

ఎవరి ఆలోచన?



హరియాణాలో వివాహాల రిజిస్ట్రేషన్‌ను ఇప్పుడు 'విపత్తు నిర్వహణ శాఖ' కిందికి మార్చారట. ఇది నిజమే అయితే, హరియాణా ప్రభుత్వానికి బ్రహ్మాండమైన సెన్సాఫ్ హ్యూమర్ ఉన్నట్టు!

– అభిషేక్ సింఘ్వీ, ఎంపీ

వాస్తవిక పరిష్కారం



ఇజ్రాయిల్ – పాలస్తీనా సమస్య మీద మీ అభిప్రాయాన్ని ఏర్పరుచుకునేటప్పుడు మిమ్మల్ని మీరు ఇలా ప్రశ్నించుకోండి: నాకు న్యాయం కావాలా? శాంతి కావాలా? సంపూర్ణ న్యాయం కోరుకుంటే నువ్వెప్పటికీ శాంతిని సాధించలేవు. కానీ నువ్వు శాంతిని కోరుకుంటే, కనీసం కొంత న్యాయం దక్కుతుంది.

– అలీ ఎ. రిజ్వీ, రచయిత

సింపుల్ సూత్రం



మార్కెట్ వ్యవహారాల యాంకర్‌గా నాకున్న సుదీర్ఘ అనుభవంతో ప్రతిరోజూ ఆర్థికాంశాల సలహాలు ఇవ్వాలని అనుకుంటున్నాను. ప్రస్తుతానికి అది ఉచితం. మొదటి పాఠం – మీ ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలి? 1. స్నేహితుడి దగ్గర 20 వేలు అప్పు తీసుకోండి. 2. వాళ్లను మీ ఫోన్లో, సోషల్ మీడియా అంతటా బ్లాక్ చేయండి.

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

నమ్మవద్దు!



'ఐసీసీ' లేదా ఇంకో క్రికెట్ శాఖకు ఏ క్రికెట్ సభ్యుడికి జరిమానా విధించడం గురించో, ప్రతిఫలం ఇవ్వడం గురించో నేను సూచనలు ఇవ్వలేదు. నాకు ఏ రకంగానూ క్రికెట్‌తో సంబంధం లేదు. నా అధికారిక వేదిక నుంచి వచ్చినవి తప్ప, అలాంటి వాట్సాప్ ఫార్వర్డులు, వీడియోలు నమ్మకండి.

– రతన్ టాటా, పారిశ్రామికవేత్త

మాట్లాడాల్సిన అంశం



పదిహేడు లక్షల మంది అఫ్గాన్ శరణార్థులను పాకిస్తాన్ ప్రభుత్వం వెనక్కి పంపుతుండటం మానవత్వపు, మానవ హక్కుల సంక్షోభాన్ని రేపుతుంది. అది దారుణం, అమానవీయం, హ్రస్వదృష్టితో కూడినది. మానవత్వపు అంశ ఏ మాత్రం ఉన్నవాళ్లయినా దీనికి వ్యతిరేకంగా గళమెత్తాలి.

– నిదా కిర్మాణీ, ఫెమినిస్ట్ సోషియాలజిస్ట్

థాంక్యూ!



2022-23 సంవత్సరానికి భారత సాఫ్ట్‌వేర్ ఎగుమతులు: 320 బిలియన్ డాలర్లు. 2022-23 సంవత్సరానికి భారత ముడి చమురు దిగుమతుల విలువ: 158 బిలియన్ డాలర్లు. బెంగళూరు, హైదరాబాద్, పుణె, నోయిడా, చెన్నై, గురుగ్రామ్ లాంటి నగరాల్లోని సుమారు యాభై లక్షల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఇండియా ముడిచమురు మీద పెట్టే ఖర్చుకంటే రెట్టింపు సంపాదిస్తున్నారు. వారికి కృతజ్ఞతగా ఉండండి.

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

మేలిమి గుణాల కలయిక!

సందర్భం



డా॥ నాగసూరి వేణుగోపాల్

ఒక వైపు హాకీ వంటి ఆధునిక క్రీడలో నైపుణ్యం, మరో వైపు చదువులో చురుకుదనం, ఇంకోవైపు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాటం! ఇటువంటి అపురూపమైన మేలిమి గుణాల కలయిక ఎమ్వీ పాపన్న గుప్త మదనపల్లెలో 1905 జూన్ 12వ తేదీన జన్మించారు. బాల్యం నుంచే అనిబిసెంట్ సతి ప్రసంగాలు చాలా బాగా పనిచేయడంతో బ్రిటిష్ ప్రభుత్వం నడిపే కళాశాలలో చేరిన పాపన్న దాని నుండి వైదొలగి బిసెంట్ థియోసాఫికల్ వారి కళాశాలలో చేరారు. 1918లో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రావడాన్ని వ్యతిరేకిస్తూ మద్రాసులో జరిగిన నిరసన ఉద్యమంలో పాపన్న 'బాలభటోద్యమం' మిత్రులతో కలిసి పాల్గొన్నారు.

బిహార్ భూకంపం సమయంలో రాయలసీమ ప్రాంతాల్లో తిరిగి నిధులు సేకరించడం, అలాగే గుంతకల్లు పట్టణంలో 'ఇండియా ఇన్ చైన్స్' అనే పుస్తకాన్ని రక్షించేందుకు ప్రాణాలకు తెగించి ఎత్తైన మేడ నుంచి దూకి, దాన్ని మైసూర్‌కు విజయవంతంగా తరలించడం, రెండో ప్రపంచ యుద్ధం సమయంలో యుద్ధ సహాయ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాడటం, 1942లో జైలు పాలు కావడం వంటివి ఆయన సాహసిక జీవితంలో కొన్ని సంఘటనలు మాత్రమే. ఖద్దరు ప్రచారం, హిందీ వ్యాప్తి, గ్రంథాలయ ఉద్యమం వంటి కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. అంతకుమించి ఆయన ఆ ప్రాంతంలో 'పాల సేకరణ కేంద్రాలు' మొదలుపెట్టి ఎంతో ప్రగతి సాధించి చిత్తూరు జిల్లాలో పాడి పరిశ్రమకు పునాదులు వేశారు. అలాగే సహకార బ్యాంకులు కూడా ఆ జిల్లా ప్రాంతంలో రావడానికి చేసిన కృషి చేశారు. మదనపల్లెలో 'గంగ జాతర్ల'లో జంతుబలిని నిరసిస్తూ కార్యక్రమాలు చేసినప్పుడు వీరిని రాళ్లతో కొట్టారు. ఒక్క మదనపల్లె కాకుండా అనంతపురం జిల్లా ఉరవకొండలో కూడా ఇదే కృషి చేశారు.

వితంతు వివాహాలు జరిపిస్తున్నందుకు ఒకసారి సేలంలో వీరిని బంధించారు కూడా! రాయలసీమ ప్రాంతం వెనకబడినదనే ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రచారం చేశారు. ఒక దశలో భోగరాజు పట్టాభి సీతారామయ్యను సభాముఖంగా తన వాదనతో మెప్పించడం అనేది తర్వాత దశలో 'శ్రీబాగ్ ఒడంబడిక'కు పునాదిగా మారింది. పాపన్న 'ఆంధ్ర మహాసభ' సహాయ కార్యదర్శిగా కూడా సేవలు అందించారు. అలాగే హిందీ ప్రచార సభ'కు సంబంధించి కూడా చాలా బాధ్యతలు నిర్వహించారు.

పాపన్న చిరుప్రాయంలోనే సాహిత్యం అంటే ఎంతో మక్కువ కలిగి, చిలకమర్తి లక్ష్మీనరసింహం 'కర్పూర మంజరి' అసంపూర్ణ నవలను పూర్తి చేసి మంచి మన్ననలను పొందారు. అలాగే పద్యాలు, కథలు, వ్యాసాలు రాసిన వీరు సృజించిన సాంఘిక నవల 'భానుమతి' 1930లో అచ్చయింది. ఇది రాయలసీమ ప్రాంతపు తొలి నవలల్లో ఒకటి. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి 1986 నవంబర్ 1వ తేదీన కన్ను మూశారు.

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి । 94407 32392

(నవంబర్ 1న ఎమ్.వి. పాపన్న వర్ధంతి)

ఎక్కువ పనిగంటలు ప్రమాదకరం!

యువత వారానికి 70 గంటలు పనిచేయాలని ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి అన్న మాటలపై ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చోప చర్చలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అసలు భారత కార్మిక చట్టం, ఫ్యాక్టరీ చట్టం వంటివి ఏం చెబుతున్నాయి, రోజుకి 8 గంటలు పైబడి పని చేస్తే పర్యవసానాలు ఏమిటి వంటి అనేక విషయాలు చర్చించవలసిన అవసరం ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో 49 పని గంటల విధానం అమల్లో ఉంది. మన దేశంలో రోజువారి విశ్రాంతి సమయం, వార్షిక సెలవులు కలిపి వారానికి 48 పనిగంటలు మించకుండా ఉండేలా చట్టాలు ఉన్నాయి. మనిషికీ మనిషికీ పని గంటల్లో తేడా; అలాగే డబ్బు, ప్రాంతం, సంస్కృతి, జీవన విధానం వంటి అనేక అంశాలతో పాటు ముఖ్యంగా జీతాలు, లాభాలు ఆధారంగా కూడా ఈ పని గంటలు మారుతూ ఉంటాయి. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో వారి వారి అంగీకారాన్ని బట్టి కూడా పని గంటలు నిర్దిష్టంగా ఉంటాయి.

ప్రపంచవ్యాప్తంగా నియమిత పని గంటలు వారానికి 40 నుంచి 44గా అమలులో ఉన్నాయి. తాత్కాలిక, బదిలీ ఉద్యోగులకు ఒకలాగా; పర్మినెంట్ ఉద్యోగులకు ఒకలాగా, అలాగే రోజుకి ఇన్ని గంటలని వారానికి మొత్తంగా 48 గంటలు మించకుండా పనిగంటలు ఉండాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ చెబుతుంది. ప్రపంచ వ్యాప్తంగా తక్కువ పని గంటలు వున్న దేశం జర్మనీ. ఇక్కడ సంవత్సరానికి 1340 గంటలు పని గంటలుగా ఉంటాయి. మెక్సికో, కొలంబియా, కోస్టారికాలలో ఎక్కువ పనిగంటలు (1886) ఉన్నాయి.

భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు అప్పటి వైస్రాయ్ కౌన్సిల్లో లేబర్ మెంబర్‌గా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కార్మికులకూ, ఉద్యోగులకూ రోజుకు 8 పని గంటలు ఉండాలని 1942లో మొదటిసారి డిమాండ్ చేశారు. అనేక వాదోపవాదాలూ, తర్జనభర్జనల మధ్య వైస్రాయ్ కౌన్సిల్ 9 పనిగంటలు ఉండాలనీ, దీనిలో 30 నిమిషాలు రెండు దఫాలుగా విశ్రాంతి ఉండాలనీ నిర్ణయించారు. '1948 ఫ్యాక్టరీ చట్టం' సెక్షన్ 54 ప్రకారం ఈ తొమ్మిది గంటల పని, విశ్రాంతి సమయాన్ని అంబేద్కర్ కార్మికుల పక్షాన పోరాడి సాధించారు.



ఇటీవల మన దేశంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం 'కర్ణాటక ఫ్యాక్టరీస్ అమెండ్మెంట్ యాక్ట్ బిల్లు – 2023'ను ఆమోదించడం ద్వారా రోజుకు 12 పని గంటలు ఉండాలని నిర్ణయించింది (వారానికి 48 గంటలు మించకుండా). అలాగే భారత కార్మిక మంత్రిత్వ శాఖ రోజుకు12 పనిగంటలు ఉండాలని పార్లమెంట్‌లో చట్టం చేసినప్పటికీ... 'ఇండియన్ ఫ్యాక్టరీస్ యాక్ట్ –1948' ఓవర్ టైంతో కలిపి 50 నుంచి 60 పని గంటలు దాటకూడదనే నిబంధన కచ్చితంగా పాటించాలని చెప్పింది.

2016లో ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయనం, అంచనాల ప్రకారం ఎవరైతే వారానికి 55 గంటలు దాటి పని చేస్తారో వారిలో ప్రతి పది మందిలో ఒక కార్మికుడు గుండె పోటుతో మరణిస్తున్నట్లు తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 745,000 మంది కార్మికులు గుండెపోటుతో మరణించినట్లు నివేదిక తెలిపింది. దీనికి కారణం ఎక్కువ పని చేయడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థల సంయుక్త నివేదిక చెబుతున్నటువంటి సత్యం.

పైన ఉదాహరించిన ఎక్కువ గంటలు పని చేయడం వల్ల జరిగిన మరణాలను పరిశీలిస్తే, యువత వారానికి 70 గంటలు పని చేస్తే జరిగే నష్టం అంచనా వేయొచ్చు. స్వతంత్ర భారత దేశంలో ఎవరి అభిప్రాయాలు వారు స్వేచ్ఛగా చెప్పవచ్చు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఆయన రంగంలో ఆయన ఆదర్శప్రాయులు. వయస్సు రీత్యా కూడా పెద్దవారు. ఇప్పటికే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో యువత అనేక ఆరోగ్య, మానసిక, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు అనేక వార్తలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ఆయన తన అభిప్రాయాలు మెజారిటీ మనోభావాలు దెబ్బతినే విధంగానూ, అశాస్త్రీయంగానూ వ్యక్తపరిస్తే ఆ ప్రభావం సమాజం మీద కచ్చితంగా ఉంటుంది. యువత మానసిక స్థితి మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక దారుఢ్యం, కుటుంబ నేపథ్యం, పెరిగిన వాతావరణం వంటివాటిని బట్టి ఉంటుంది. కాబట్టి విధాన నేర్ణేతలు వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి.

– డా॥ గుబ్బల రాంబాబు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు, ఏపీ

నిమిత్తమాత్రులం

ఇంద్రభోగాలూ, స్వర్గ సుఖాలూ అంటాం. కానీ, మన పురాణ కథలలో, ఇంద్రుడికి ఎప్పుడూ పదవీచ్యుతి భయమే. వరాలూ, బల పరాక్రమాలూ ఉన్న రాక్షసులందరికీ ఆయన సింహాసనం మీదే కన్ను.

ఒకసారి ఒక రాక్షసుడు తన మీదికి యుద్ధానికి వస్తున్నాడని ఇంద్రుడికి తెలిసింది. వెంటనే బృహస్పతిని పిలిపించాడు. 'గురుదేవా! రాబోయే యుద్ధంలో నేను గెలిచే ఉపాయం చెప్పండి' అని ప్రార్థించాడు.

'నీ శక్తి వంచన లేకుండా యుద్ధం చెయ్యి. అదే ఉపాయం.'

'అలా చేస్తే గెలవడం ఖాయమా?'



జ్యోతిర్మయం

'కాదు! జయాపజయాలు దైవాధీనాలు. శరీరధారి అంటేనే దైవాధీనుడు, అస్వతంత్రుడు. కనక అతని ప్రయత్నాల సాఫల్యత కూడా దైవాధీనమే.'

'కానీ జయాపజయాల వల్ల కలిగే సుఖ దుఃఖాలు అనుభవించేది నేనే కదా? ఏం చేసేట్టు?'

'దేవేంద్రా! సుఖదుఃఖాలు మనసు ద్వారా అనుభవించేవి. కానీ ఆ మనసును సుఖ దుఃఖాలకు సమర్పించుకొని, వాటికి స్వాధీనం చేయకూడదు. నీ మనసు నీ సుఖ దుఃఖాలకు బానిసగా మారిపోతే, నీకు సంతోషం దూరమౌతుంది. సంతో షాత్ అపరం నాస్తి సుఖ స్థానం, శచీపతే!– శచీంద్రా! సంతోషాన్ని మించిన సుఖ స్థానం మరొకటి లేదు (దేవీ భాగవతం, 5–4–38).

'మనసు సుఖదుఃఖాల వశం కాకుండా ఉంచడం ఎలా?'

'దుఃఖే దుఃఖాదికాన్ పశ్యేత్ – దుఃఖం కలిగినప్పుడు, నీ కంటే ఎక్కువ దుఃఖంలో ఉన్నవాళ్ళను చూడాలి. అప్పుడు, లోకంలో ఇలాంటి దుఃఖం సామాన్యమేనని నీ మనసు గ్రహిస్తుంది కనక దుఃఖానికి వశమైపోకుండా సంయమనంతో ఉంటుంది. అలాగే, సుఖే పశ్యేత్ సుఖాధికాన్ – సుఖం కలిగినప్పుడు నీ కంటే సుఖంగా ఉన్న వాళ్ళను గమనించాలి. వాళ్ళను చూస్తే సుఖం వల్ల కలిగే ఉబ్బూ, తబ్బిబ్బూ, అహంకారం శమించి, నీ మనసు వాటి వశమైపోకుండా నీ వశంలోనే ఉంటుంది. మనసు సంయమనంతో ఉంటే, సంతోషం నిన్ను వీడదు' అన్నాడు బృహస్పతి. ఇంకొక్క మాట కూడా అన్నాడు: 'మమతా పరమం దుఃఖం, నిర్మమత్వం పరం సుఖమ్ – మనకు సంభవించిన సాఫల్య వైఫల్యాలూ, జయాపజయాలూ నావి, నేను సాధించినవి అన్న 'మమ'త్వభావన అన్నిటికంటే దుఃఖదాయకం. జయాపజయాలు రెండూ నావి కావు. నేను నిమిత్తమాత్రుడిని అని పనులు చేస్తే ఆ నిర్మమత్వమే పరమ సుఖదాయకం.'

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.తదియ రా.10.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** కృత్తిక ఉ.6.01 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.10.03 నుండి 11.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.19 నుండి 9.04 వరకు, తదుపరి రా.10.29 నుండి 11.18 వరకు, రా.2.54 నుండి 4.30 వరకు, అట్లతదియ ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.01, **సూర్యాస్తమయం:** 5.27.

హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ నరేందర్ ప్రమాణం

రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

- 30కి చేరిన హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య
- 4వ స్థానంలో కొనసాగనున్న జస్టిస్ నరేందర్



జస్టిస్ గుహనాథన్ నరేందర్‌తో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

సాక్షి,అమరావతి/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):: ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా గుహనాథన్ నరేందర్ సోమవారం ప్రమాణం చేశారు. ఆయన చేత రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ప్రమాణం అనంతరం జస్టిస్ నరేందర్‌ను గవర్నర్ అభినందించారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఈ కార్యక్రమ ప్రొసీడింగ్స్‌ను నిర్వహించారు. అనంతరం జస్టిస్ నరేందర్ నియామకానికి సంబంధించి రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు చదివి వినిపించారు. కాగా.. రాజ్‌భవన్‌లో జస్టిస్ నరేందర్‌ను అటు గవర్నర్, ఇటు ముఖ్యమంత్రికి జస్టిస్ ధీరజ్ సింగ్ పరిచయం చేశారు. కార్యక్రమం అనంతరం రాజ్‌భవన్ ఏర్పాటు చేసిన తేనీటి విందులో అందరూ పాల్గొన్నారు.

30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

జస్టిస్ నరేందర్ నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. జస్టిస్ నరేందర్ హైకోర్టులో నాలుగో స్థానంలో కొనసాగుతారు. మంగళవారం ఆయన జస్టిస్ దుర్గాప్రసాదరావుతో కలిసి కేసులను విచారిస్తారు. వాస్తవానికి ఈ కార్యక్రమంలో సీఎం జగన్ పాల్గొనాల్సి ఉంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్ కూడా ఖరారైంది. అయితే.. విజయనగరంలో జరిగిన రైలు ప్రమాద బాధితులను పరామర్శించేందుకు వెళ్లడం, తిరిగి రావడంలో జాప్యం జరగడంతో జస్టిస్ నరేందర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొనలేకపోయారు.

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ జి.నరేందర్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ సోమవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ ఏఈవో చంద్రశేఖర్ జస్టిస్ నరేందర్‌కు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు సమర్పించారు.

చంద్రబాబు మధ్యంతర బెయిల్‌పై ముగిసిన వాదనలు

ఆరోగ్య సమస్యల దృష్ట్యా బెయిల్ ఇవ్వాలన్న బాబు తరఫు న్యాయవాదులు

- బెయిల్ కోసమే ఆరోగ్య సమస్యల్ని సాకుగా చూపుతున్నారన్న సీఐడీ తరఫు న్యాయవాదులు
- చంద్రబాబు బరువు తగ్గారన్న వాదనలో వాస్తవం లేదని.. కేజీన్నర బరువు పెరిగారని స్పష్టీకరణ
- ఇప్పటికిప్పుడు కంటి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం లేదని వెల్లడి
- ఆయనకు ఎలాంటి పరీక్షలు నిర్వహించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న న్యాయవాదులు
- చంద్రబాబు ఆరోగ్య స్థితిపై వైద్యులిచ్చిన నివేదికలు కోర్టుకు సమర్పణ
- నేడు నిర్ణయం వెలువరించనున్న జస్టిస్ మల్లికార్జునరావు



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ అనుభవిస్తున్న చంద్రబాబు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో సోమవారం వాదనలు ముగిశాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తన నిర్ణయాన్ని మంగళవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం ఆధారంగా ప్రధాన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కంటి శస్త్ర చికిత్సను కారణంగా చూపుతూ తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు హైకోర్టులో ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ మల్లికార్జునరావు విచారణ జరిపారు.

‘ఆరోగ్య సమస్యల దృష్ట్యా బెయిలివ్వండి’

సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని.. అందువల్ల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని న్యాయమూర్తిని అభ్యర్థించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. అందుకు ఆయనపై పెడుతున్న వరుస కేసులే నిదర్శనమని తెలిపారు. గత 52 రోజులుగా చంద్రబాబు జైల్లో ఉన్నారని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కుట్రపూరితంగా అరెస్ట్ చేశారన్నారు. స్కిల్ కేసులో చంద్రబాబును సీఐడీ ప్రశ్నించడం పూర్తయిందని, అందువల్ల అతనిని జైలులో ఉంచాల్సిన అవసరం ఎంత మాత్రం లేదన్నారు. సీఐడీ రిమాండ్ రిపోర్టులో చంద్రబాబుపై నిర్దిష్ట ఆరోపణలేవీ లేవన్నారు. జైలులో చంద్రబాబు 5 కేజీల బరువు తగ్గారన్నారు. పలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కుడి కన్నుకు అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉందని, ఇదే విషయాన్ని వైద్యులు సైతం ధ్రువీకరించారని పేర్కొన్నారు. నచ్చిన వైద్యునితో చికిత్స చేయించుకునే ప్రాథమిక హక్కు పిటిషనర్‌కు ఉందన్నారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

‘ఆరోగ్య సమస్యల్ని సాకుగా చూపుతున్నారు’

సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ యడవల్లి నాగవివేకానంద, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శెట్టిపల్లి దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చంద్రబాబు జైలు నుంచి బయటకొచ్చేందుకు ఆరోగ్య సమస్యలను కారణంగా చూపుతున్నారని స్పష్టం చేశారు. ప్రధాన బెయిల్ పిటిషన్‌లో వాదనలు వినిపించేందుకు గడువు కావాలని సుధాకర్‌రెడ్డి కోర్టును కోరగా.. గడువు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని, ముందు మధ్యంతర బెయిల్‌పై వాదనలు వినిపించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. చంద్రబాబు బరువు తగ్గారన్న వాదనలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఒకటిన్నర కేజీ బరువు పెరిగారని సుధాకర్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఆరోగ్య స్థితిపై వైద్యుల నివేదికలను ఆయన కోర్టు ముందుంచారు. చంద్రబాబుకు జైల్లోనే అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కంటి శస్త్రచికిత్స అత్యవసరం ఎంతమాత్రం కాదన్నారు. వైద్యులు సైతం ఇదే చెప్పారన్నారు. చంద్రబాబుకున్న అనారోగ్య సమస్యలు వయోభారంతో బాధపడే వారికి ఉండేవేనన్నారు. అవేమీ అసాధారణ సమస్యలు కాదన్నారు. జైలు నుంచి బయటకు వచ్చేందుకు ఆరోగ్య సమస్యలను కారణంగా మాత్రమే చూపుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి వీల్లేదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు మధ్యంతర బెయిల్‌పై మంగళవారం నిర్ణయాన్ని వెల్లడిస్తానని స్పష్టం చేశారు.

కులవాదులూ.. గగ్గోలు ఏల?

1,128వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని లూటీ చేసిన అవినీతి తిమింగళం చంద్రబాబుకు వత్తాసు పలకడమే కాకుండా..‘అమరావతి’కి అన్యాయం జరిగిందంటూ ఎల్లో మీడియాలో కులవాదులు గగ్గోలు పెట్టడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఎద్దేవా చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,128వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. అవినీతి కేసుల్లో బాబు జైలు కెళితే.. రాముడు, కృష్ణుడు తదితర దేవుళ్లతో పోల్చుతూ.. ఓ సామాజిక వర్గానికి చెందిన బలిసిన వాళ్లంతా పక్క రాష్ట్రంలో చేరి గోల చేయడం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు హయాం కంటే ముందే.. నేదురుమల్లి జనార్దనరెడ్డి చొరవతో హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ నిలదొక్కుకుందని తెలిపారు. అనంతరం వచ్చిన చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి, కేసీఆర్ తదితరుల ప్రోత్సాహ ఫలితంగా ఐటీ పరిశ్రమ మరింత ఉన్నతస్థాయికి చేరిందన్న విషయాన్ని మరువకూడదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి ముసుగులో ఏపీలో లిక్కర్ మాఫియాపై మాట్లాడిన దగ్గుబాటి పురందేశ్వరి.. ఆ మద్యం డిస్టిలరీలకు అక్రమంగా అనుమతులిచ్చిన మరిది బాగోతం కూడా బయటపెడితే బాగుంటుందన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గ ఉపసంఘం, సిట్‌పై విచారణ వాయిదా

నవంబర్ 16కి వాయిదా వేసిన జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

సాక్షి, అమరావతి: అమరావతి భూ కుంభకోణం, ఏపీ ఫైబర్ నెట్ కుంభకోణాలతోపాటు గత ప్రభుత్వం తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, చేపట్టిన ప్రాజెక్టులు తదితరాలపై సమీక్ష జరిపేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 1411, మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదిక ఆధారంగా అప్పటి అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 344పై దాఖలైన వ్యాజ్యాలపై విచారణ వాయిదా పడింది. ఈ అంశాలన్నిటినీ సవాల్ చేస్తూ టీడీపీ నేతలు వర్ల రామయ్య, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం విదితమే. కౌంటర్ దాఖలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత గడువు కోరడంతో హైకోర్టు తదుపరి విచారణను నవంబర్ 16వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌కు తిరుగు సమాధానం (రిప్లై) ఇవ్వాలని టీడీపీ నేతలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా...

రాజకీయ పొత్తులను నియంత్రించలేం: ఈసీ

న్యూఢిల్లీ: రాజకీయ పొత్తులను నియంత్రించేందుకు చట్టపరంగా తమకు ఎలాంటి అధికారమూ లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుపుతున్న ఢిల్లీ హైకోర్టుకు ఈసీ సోమవారం ఈ మేరకు తన స్పందన తెలియజేసింది.''మాకు పార్టీల నమోదుకు, ఎన్నికల నిర్వహణకు మాత్రమే అధికారముంది. అంతే తప్ప రాజ్యాంగంలోని ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం రాజకీయ పొత్తులకు నియంత్రిత కూటములుగా గుర్తింపునిచ్చే అధికారం కూడా లేదు. పైగా కేరళ హైకోర్టు గత తీర్పు మేరకు ఈ కూటములను చట్టబద్ధమైన సంస్థలుగా కూడా పరిగణించలేం'' అని వివరించింది. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టుకోవడం తాలూకు చట్టబద్ధత తమ పరిధిలోని అంశం కాదని వివరించింది. విపక్ష కూటమికి ఇండియాగా పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ గిరీశ్‌భరద్వాజ్ అనే వ్యక్తి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

సమాచార కమిషన్‌లలో ఖాళీలు భర్తీచేయండి

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ), రాష్ట్ర సమాచార కమిషన్(ఎస్‌ఐసీ)లలో పోస్టులను భర్తీచేయకపోవడంపై సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. తెలంగాణ, త్రిపుర, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో సేవలు అందించడానికి ఎలాంటి సమాచార కమిషనర్లు అందుబాటులో లేరంటూ సమాచారహక్కు(ఆర్టీఐ)చట్టం కార్యకర్త అంజలీ భరద్వాజ్ వేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ' పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయండి. లేదంటే ఆర్టీఐ చట్టం నిర్వీర్యమైపోతుంది' అంటూ కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలను ఆదేశించింది. ' రాష్ట్ర సమాచార కమిషన్‌లలో అనుమతించిన పోస్టులు ఎన్ని? ఖాళీలెన్ని? పెండింగ్‌లో ఉన్న కేసులెన్ని? అనే వివరాలను నివేదించండి' అని సిబ్బంది, శిక్షణ శాఖను ఆదేశించింది.

ఓటింగ్‌కు దూరం సరికాదు

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–హమాస్ పోరుపై ఐక్యరాజ్యసమితి తీర్మానానికి భారత్ దూరంగా ఉండటాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ చెప్పారు. ''హమాస్ దాడులను కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోంది. కానీ ప్రతీకారం పేరుతో నిస్సహాయులైన ప్రజలపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు వినాశనానికే దారి తీస్తున్నాయి. పాలస్తీనా ఒక స్వతంత్ర దేశంగా శాంతియుతంగా సహజీవనం చేసేలా నేరుగా ద్వైపాక్షిక చర్చలు జరగాలన్నదే ఈ సమస్యపై కాంగ్రెస్ వైఖరి అని సోనియా గుర్తు చేశారు. సోమవారం ఓ ఆంగ్ల పత్రికకు రాసిన వ్యాసంలో ఆమె ఈ మేరకు పేర్కొన్నారు. గాజాను అన్నివైపుల నుంచీ ఇజ్రాయెల్ చెరబట్టిన తీరు ఆ ప్రాంతాన్ని ఓపెన్ జైలుగా మార్చేసిందని ఆవేదన వెలిబుచ్చారు.

నేవీ మాజీ అధికారుల విడుదలకు కృషి: జైశంకర్

న్యూఢిల్లీ: ఖతార్ కోర్టు మరణ శిక్ష విధించిన భారత నేవీ మాజీ అధికారులను జైలు నుంచి విడిపించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వెల్లడించారు. 'ఖతార్‌లో నిర్బంధంలో ఉన్న 8 మంది బాధితుల కుటుంబాలను ఉదయం కలుసుకున్నాను. ఈ కేసును భారత ప్రభుత్వం అత్యంత ముఖ్యమైందిగా భావిస్తోందని, ఆవేదన చెందుతోందని వారికి తెలిపాను'అని ఆయన పేర్కొన్నారు. వారికి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలను కొనసాగిస్తుందని చెప్పారు. ఈ విషయంలో పురోగతిని ఎప్పటికప్పుడు బాధిత కుటుంబాలతో చర్చిస్తామని వెల్లడించారు.

ఉగ్ర కాల్పుల్లో యూపీ వలస కార్మికుడు మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఆదివారం క్రికెట్ ఆడుతున్న పోలీసు అధికారిపై కాల్పులకు తెగబడిన ఉగ్రమూకలు సోమవారం మరోసారి రెచ్చిపోయారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముకేశ్ అనే నేత కార్మికుడిని కాల్చి చంపారు. పుల్వామాలోని తుమ్మి నాపొరలో ముకేశ్ కూరగాయల మార్కెట్‌కు రాగా ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఆదివారం ముష్కరుల కాల్పుల్లో గాయపడిన ఇన్‌స్పెక్టర్ మస్రూర్ అహ్మద్ వనీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

'ఇండియా' కూటమిలో లుకలుకలు నిజమే: ఒమర్

శ్రీనగర్: ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో పరిస్థితి ఏమీ బాగా లేదని, లుకలుకలు మొదలయ్యాయని జమ్మూకశ్మీర్ నేత, నేషనల్ కాన్ఫరెన్స్ సీనియర్‌నాయకుడు ఒమర్ అబ్దుల్లా చెప్పారు. ఆయన సోమవారం కుప్వారాలో మాట్లాడారు. కూటమిలో కీలక కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య కీచులాటలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న కొన్ని రాష్ట్రాల్లో ఆ రెండు పార్టీలు పరస్పర పోటీకి దిగుతున్నాయన్నారు.

కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

- నవంబర్ 2న విచారణకు పిలుపు
- ఢిల్లీ మద్యం విధానం కేసులో కీలక మలుపు
- మోదీ సర్కారు కక్షసాధింపు: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ (55)కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం నోటీసులిచ్చింది. నవంబర్ 2న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఆయనకు నోటీసులు జారీ అయ్యాయి. ఇదే కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టేసిన కొద్ది గంటలకే ఈ పరిణామం చెటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి దాఖలు చేసిన చార్జిషీట్లలో కేజ్రీవాల్ పేరును ఈడీ ఇప్పటికే పలుసార్లు పేర్కొనడం తెలిసిందే. ఈ కేసు నిందితులంతా ఢిల్లీ మద్యం విధానం 2021–22 తయారీ, అమలుకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ కేజ్రీవాల్‌తో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉన్నట్టు అందులో చెప్పుకొచ్చింది. నవంబర్ 2న కేజ్రీవాల్ స్టేట్‌మెంట్‌ను ఈడీ నమోదు చేయనుందని సమాచారం. మద్యం కుంభకోణానికి సంబంధించి అవినీతి, నేరపూరిత కుట్ర అభియోగాల్లో కేజ్రీవాల్‌ను సీబీఐ ఏప్రిల్ 16న కూడా 9 గంటలపాటు ప్రశ్నించింది.

మండిపడ్డ ఆప్

కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లపై ఆప్ మండిపడింది. తమ పార్టీని ఎలాగైనా అంతం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు కుట్రలు పన్నుతోందని ఆరోపించింది. అందులో భాగంగానే ఈ తప్పుడు కేసులో తమ అధినేతను ఎలాగైనా ఇరికించేందుకు నరేంద్ర మోదీ సర్కారు ఎప్పట్నుంచో ప్రయత్నిస్తోందని ఆప్ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆరోపించారు. మరోవైపు, ఈ కేసులో సిసోడియా అవినీతికి సంబంధించి చాలినన్ని రుజువులున్నాయని సుప్రీం బెయిల్ నిరాకరణతో తేలిపోయిందని బీజేపీ పేర్కొంది. కనుక నైతిక బాధ్యత వహిస్తూ కేజ్రీవాల్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ కేసులో అవినీతి జరిగినట్లు ఎలాంటి రుజువులూ లేవని కేజ్రీవాల్‌తో పాటు ఆప్ నేతలంతా ఇప్పటిదాకా చెప్తూ వచ్చిందంతా పచ్చి అబద్ధమని రుజువైందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ అన్నారు.



ఆది నుంచీ వివాదాలే

ఢిల్లీ మద్యం విధానాన్ని 2021లో కేజ్రీవాల్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మద్యం లైసెన్సుదారులకు నిబంధనలకు విరుద్ధంగా అనేక విధాలుగా కేజ్రీవాల్ సర్కారు లబ్ధి చేకూర్చిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో దీనిపై విచారణ జరపాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని నాటి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశించారు. మద్యం విధానం తప్పుల తడక అని, ఎక్సైజ్ మంత్రిగా సిసోడియా తీసుకున్న నిర్ణయాల వల్ల ఖజానాకు కనీసం భారీ నష్టం జరిగిందని, ఆప్ నేతలు తదితరులు లైసెన్సుదారుల నుంచి పలు మార్గాల్లో లబ్ధి పొందారని సీఎస్ నివేదించారు. ఈ వివాదాలు, ఆరోపణల నేపథ్యంలో చివరికి 2022 జూలై 31న నూతన మద్యం విధానాన్ని కేజ్రీవాల్ సర్కారు రద్దు చేసింది. ఇందులో తీవ్ర అవకతవకలు జరిగాయంటూ 2022 ఆగస్టు 17న సీబీఐ కేసు నమోదు చేసింది. సిసోడియాతో పాటు 15 మందిని నిందితులుగా చేర్చింది.

సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరణ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అవినీతి, మనీ ల్యాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉప ముఖ్య మంత్రి మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. రూ.338 కోట్ల బదిలీకి సంబంధించి సందేహాలున్నందునే బెయిల్ నిరాకరిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ లావాదేవీలపై ఈడీ కొన్ని ఆధారాలు సమర్పించిందని, ఇప్పటికే విచారణ మొదలైనందున బెయిలివ్వడం సాధ్యం కాదని పేర్కొంది. మనీశ్ సిసోడియా బెయిల్ దరఖాస్తును విచారించి జూలైలో రిజర్వు చేసిన తీర్పును జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టిల ధర్మాసనం సోమవారం వెలువరించింది. విచారణలో భాగంగా ట్రయల్ ఆలస్యం అవుతున్న విషయాన్ని గుర్తించామని వేగవంతం చేయాలని దర్యాప్తు సంస్థ ఈడీని ఆదేశించింది. ఆరు నుంచి ఎనిమిది నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని నిర్దేశించింది. దర్యాప్తు మందకొడిగా సాగితే మూడు నెలల్లో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం సిసోడియాకు సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్ వేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలిపింది.



ఇజ్రాయెల్ దాడులతో భీతిల్లి సోమవారం గాజా నగరం వదిలి వలస వెళ్లిపోతున్న పాలస్తీనియన్లు

గాజాలో మరణ మృదంగం

దాడులు మరింత ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం

- గత 24 గంటల్లో 304 మంది మృత్యువాత
- గాజాలో 8,306కి చేరిన మృతుల సంఖ్య

ఖాన్ యూనిస్/జెరూసలేం: హమాస్ మిలిటెంట్ల సొరంగాలు, రహస్య స్థావరాలను నేలమట్టం చేయడమే ధ్యేయంగా ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడులు ఉధృతం చేస్తుండడం గాజాలో సాధారణ పాలస్తీనియన్లకు ప్రాణసంకటంగా మారింది. సోమవారం మరిన్ని దళాలు ఇజ్రాయెల్ భూభాగం నుంచి గాజాలోకి అడుగుపెట్టాయి. ఇజ్రాయెల్ సేనలు గాజాలోకి మరింత ముందుకు చొచ్చుకొస్తున్నాయి. గాజాలో 24 గంటల్లో 600 హమాస్ స్థావరాలపై దాడులు చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మిలిటెంట్ల ఆచూకీ కోసం అణువణువూ గాలిస్తున్నాయి. గాజాలో క్యాన్సర్ బాధితులకు చికిత్స అందిస్తున్న ఏకైక ఆసుపత్రి అయిన 'టర్కిష్ ఫ్రెండ్‌షిప్ హాస్పిటల్' సమీపంలోనే ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం రాత్రి వైమానిక దాడులు చేసింది. ఈ ఘటనలో ఆసుపత్రి స్వల్పంగా ధ్వంసమయ్యింది. ఉత్తర, దక్షిణ గాజాను అనుసంధానించే ప్రధాన జాతీయ రహదారిని ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు, బుల్డోజర్లు దిగ్బంధించాయి. ఈ రహదారిపై వాహనాల రాకపోకలను ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటోంది. ఇందుకు కారణం ఏమిటన్నది బయటపెట్టడం లేదు. ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు వెళ్లలేకపోతున్నారు. ఉత్తర గాజాలకు భూతల దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యాన్ని గట్టిగా ప్రతిఘటిస్తున్నామని హమాస్ వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల్లో 304 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. ఇప్పటిదాకా 8,306 మంది పాలస్తీనియన్లు మరణించారని, 21,048 మంది గాయపడ్డారు. ఇంకా 1,950 మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని వివరించింది. ఇజ్రాయెల్‌లో 1,400మందికిపైగా మృత్యువాత పడ్డారు.

అరకొర సాయమే

ప్రపంచ దేశాలు, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న మానవతా సాయం ఇప్పుడిప్పుడే గాజాకు చేరుకుంటోంది. ఆహారం, నిత్యావసరాలు, ఔషధాలు, దుస్తులు, నీటి శుద్ధి యంత్రాలు వంటివి అందుతున్నాయి. 75 వాహనాలతో కూడిన భారీ కాన్వాయ్ తాజాగా ఈజిప్టు నుంచి దక్షిణ గాజాలోకి అడుగుపెట్టింది. ఈ వాహనాలు టన్నుల కొద్దీ ఆహారం, తాగు నీరు, పలు రకాల కీలక ఔషధాలను చేరవేశాయి. గాజాలోని 23 లక్షల జనాభాకు ఈ సాయం ఏమాత్రం చాలదని అక్కడి స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. దక్షిణ గాజాలో రెండు నీటి సరఫరా పైపులైన్లను పునరుద్ధరించామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

యూదుల కోసం విమానంలో గాలింపు

ఇజ్రాయెల్ నుంచి వచ్చిన విమానంలో యూదుల కోసం రష్యాలోని ముస్లింలు గాలించడం సంచలనాత్మకంగా మారింది. ఆదివారం టెల్ అవీవ్ నుంచి విమానం రష్యాలో ముస్లిం ప్రాబల్య ప్రాంతమైన మాఖాచ్‌కలాలోని దగెస్తాన్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఈ విమానంలో యూదులు ఉన్నారన్న అనుమానంతో వందలాది మంది ముస్లింలు ఎయిర్‌పోర్టును దిగ్బంధించారు. పాలస్తీనా జెండాలను చేబూని, ఎయిర్‌పోర్టులోకి లోపలికి ప్రవేశించి అలజడి సృష్టించారు. యూదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారిని చంపేయాలంటూ నినదించారు. కొందరు రన్‌వే పైకి దూసుకెళ్లారు. ఇజ్రాయెల్ విమానాన్ని చుట్టుముట్టారు. గాజాపై ఇజ్రాయెల్ దాడుల పట్ల వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూదులపై దాడి చేయడానికే ఎయిర్‌పోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది. అడ్డుకొనేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపైనా తిరగబడ్డారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణలో పలువురు పోలీసులు సహా 20 మంది గాయపడ్డారు. పోలీసులు ఎట్టకేలకు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దాదాపు 60 మందిని అరెస్టు చేశారు. ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు.

అపహరించిన షానీ లౌక్‌ను హత్య చేశారు



23 ఏళ్ల యువతి షానీ లౌక్ ఈ నెల 7న ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్‌లో ఓ సంగీత వేడుకలో ఉండగా హమాస్ మిలిటెంట్లు హఠాత్తుగా దాడి చేశారు. కొందరిని కాల్చిచంపారు. షానీ లౌక్‌తో పాటు మరికొందరిని అపహరించారు. బందీలుగా బలవంతంగా గాజాకు లాక్కెళ్లారు. అయితే, మిలిటెంట్ల చెరలో షానీ లౌక్ క్షేమంగా ఉండొచ్చని ఆమె తల్లి, సోదరి భావించారు. త్వరలోనే ప్రాణాలతో తిరిగివస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే దుర్వార్త తెలిసింది. గాజాలో మిలిటెంట్లు ఓ యువతి మృతదేహాన్ని వాహనంలో ఉంచి, 'అల్లాహో అక్బర్' అని అరుస్తూ గాజా వీధుల్లో ఊరేగిస్తున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. శవంగా మారిన ఆ యువతి షానీ లౌక్ అని తల్లి రికార్డా లౌక్, సోదరి అడీ లౌక్ గుర్తించారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇజ్రాయెలీ–జర్మన్ జాతీయురాలైన షానీ లౌక్‌ను మిలిటెంట్లు హత్య చేయడం దారుణమని, ఈ ఘటన తమను కలచివేసిందని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ పేర్కొంది.

పార్టీల విరాళాల వివరాలు.. తెల్సుకునే హక్కు పౌరులకు లేదు

సుప్రీంకోర్టులో వాదించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు పొందిన విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయి అనే వివరాలను తెల్సుకునే హక్కు దేశ పౌరులకు లేదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో వాదించింది. ఈ మేరకు అఫిడవిట్ సమర్పించింది. 'సహేతుకమైన కారణాలు లేకుండా ఏదంటే అది, ప్రతీదీ తెల్సుకునే హక్కు సాధారణ ప్రజానీకానికి లేదు' అని కేంద్రం తరఫున లిఖితపూర్వక అఫిడవిట్ సమర్పించిన సందర్భంగా అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి వాదించారు. రాజకీయ పార్టీలకు విరాళాలు అందించేందుకు ఉద్దేశించిన ఎలక్టోరల్ బాండ్ల పథకం చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను నేటి నుంచి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వాదనలు ఆలకించనున్న నేపథ్యంలో కేంద్రం అఫిడవిట్ సమర్పించింది. ఈ సందర్భంగా ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని అటార్నీ సమర్థించారు. ' పార్టీలు స్వచ్ఛమైన నగదును విరాళంగా పొందేందుకు మోదీ సర్కార్ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తెచ్చింది. దాత సంబంధిత వివరాల గోప్యత కీలకం. ఎలక్టోరల్ బాండ్ల పథకం..పన్ను చెల్లింపులకు లోబడే ఉంది. రాజకీయ పార్టీలకు విరాళం అనేది ప్రజాస్వామ్యయుతమే. దీనిపై రాజకీయ చర్చ అభిలషణీయమూ. ఎలాంటి ప్రభావాలకు లోనుకాని ప్రభుత్వ జవాబుదారీతనాన్ని కోరుకోవడం మంచిదే. అంతమాత్రాన ఇలాంటి అంశాల్లో రాజ్యాంగాన్ని అతిక్రమిస్తూ న్యాయసమీక్షకు కోర్టులు ప్రయత్నించకూడదు. పౌరుల హక్కుల ఉల్లంఘన జరిగినపుడే న్యాయసమీక్ష జరగాలి. ప్రభుత్వ నిర్ణయాలను స్కాన్ చేసేందుకు కోర్టులు తమ న్యాయసమీక్ష అధికారాన్ని వినియోగించకూడదు. వివరాలు అడిగే హక్కు పౌరులకు లేదు' అని అటార్నీ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ని ఈ బెంచ్‌లో జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ గవాయ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

డిసెంబర్ 31కల్లా నిర్ణయం చెప్పండి

షిండే, శివసేన ఉద్ధవ్ వర్గ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: శివసేనలో చీలిక వర్గం ఏక్‌నాథ్ షిండే, ఉద్ధవ్ ఠాక్రే వర్గాలు స్పీకర్‌కు సమర్పించిన అనర్హత పిటిషన్ల అంశం మరోసారి సర్వోన్నత న్యాయస్థానం ముందుకొచ్చింది. ఈ అనర్హత పిటిషన్ల అంశంలో డిసెంబర్ 31వ తేదీలోగా మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ తుది నిర్ణయం తీసుకోవాలని సోమవారం సర్వోన్నత న్యాయస్థానం ఆయనను ఆదేశించింది. తుది నిర్ణయాన్ని మరింత ఆలస్యం చేసే వైఖరిని అనుమతించేది లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా మహారాష్ట్ర ప్రభుత్వంలో చేరిన అజిత్‌పవార్ వర్గ తొమ్మిది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్సీపీ దాఖలుచేసిన అనర్హత పిటిషన్‌పై వచ్చే ఏడాది జనవరి 31కల్లా తుది నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. ' రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ గౌరవాన్ని మనందరం కాపాడాల్సిందే. లేదంటే ఆ షెడ్యూల్‌లోని నిబంధనలను గాలికొదిలేసినట్లే అవుతుంది' అని కోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

బెంగళూరు బస్ గ్యారేజ్‌లో మంటలు

బనశంకరి: బెంగళూరులోని వీరభద్రనగరలో ఓ బస్ బాడీ బిల్డింగ్ గ్యారేజ్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన 18 ప్రైవేట్ బస్సులు పూర్తిగాను, మరో 10 బస్సులు పాక్షికంగా దహనమయ్యాయి. పెద్ద సంఖ్యలో ఫైరింజన్లు చేరుకుని మంటలను ఆర్పివేశాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఘటనతో దాదాపు రూ.20 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు గ్యారేజ్ యజమాని తెలిపారు.

పంజాబ్‌లో ట్రాక్టర్లతో విన్యాసాలపై నిషేధం

చండీగఢ్: ట్రాక్టర్‌తో విన్యాసాలు చేయిస్తూ 29 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించిన ఘటనను పంజాబ్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై ఇలాంటి ట్రాక్టర్లతో చేసే విన్యాసాలను నిషేధిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోమవారం ప్రకటించారు. రాష్ట్రంలోని గుర్‌దాస్‌పూర్ జిల్లాలో గ్రామీణ క్రీడా కార్యక్రమాల్లో 29 ఏళ్ల స్టంట్‌మ్యాన్ సుఖ్‌మన్‌దీప్ సింగ్ మరణించిన విషయం తెల్సిందే. శనివారం సర్చూర్ గ్రామంలో జరిగిన క్రీడల్లో ట్రాక్టర్ ముందు చక్రాలు గాల్లోకి లేచేలా చేసి వెనక చక్రాల మీదుగా ట్రాక్టర్ సీటుపై కూర్చునేందుకు సుఖ్‌మన్‌దీప్ ప్రయత్నించాడు. అనుకోకుండా కాలు బురదలో ఇరుక్కుని ట్రాక్టర్ వెనక చక్రాల కింద సుఖ్‌మన్‌దీప్ నలిగిపోయిన ఉదంతం చర్చనీయాంశమవడంతో ఆప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

లోక్‌సభ ఎన్నికల కోసమే 'ఇండియా' కూటమి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ: 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా, కలిసికట్టుగా పోటీ చేయడానికి విపక్షాలతో 'ఇండియా' కూటమి ఏర్పాటైందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సోమవారం చెప్పారు. ప్రస్తుత ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కూటమి పక్షాలు పరస్పరం అవగాహనతో పని చేయాలని సూచించారు. రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో తమ పార్టీ అభ్యర్థుల జాబితాకు కేంద్ర కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపామని, తెలంగాణ విషయంలో చర్చలు కొనసాగుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలోనే కాదు, రాష్ట్రాల స్థాయిలోనూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

మరాఠాల ఆందోళన హింసాత్మకం

- ఎన్సీపీ ఎమ్మెల్యేల ఇళ్లపై నిరసనకారుల దాడి
- బీజేపీ ఎమ్మెల్యే ఆఫీస్‌లో విధ్వంసం

ముంబై: మహారాష్ట్రలో ప్రత్యేక కోటా డిమాండ్‌తో మరాఠాలు చేపట్టిన ఆందోళన మళ్లీ హింసాత్మక రూపం దాల్చింది. ఆందోళనకారులు సోమవారం బీడ్ జిల్లా మజల్‌గావ్‌లోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎమ్మెల్యేలు ప్రకాశ్ సోలంకె, సందీప్ క్షీరసాగర్ ఇళ్లకు నిప్పు పెట్టారు. మజల్‌గావ్ మున్సిపల్ కౌన్సిల్ భవనంలోని మొదటి అంతస్తులో ఫర్నిచర్‌కు నిప్పుపెట్టి, విధ్వంసం సృష్టించారు. ఛత్రపతి శంభాజీ జిల్లా గంగాపూర్‌లో నిరసనకారులు బీజేపీ ఎమ్మెల్యే ప్రశాంత్ బంబ్ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. కిటికీలు, ఫర్నిచర్ పగులగొట్టారు. పలు చోట్ల రహదారులపై బైటాయించారు. మరాఠాలకు ప్రత్యేక కోటా డిమాండ్‌కు మద్దతుగా సీఎం ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన నాశిక్, హింగోలి ఎంపీలు హేమంత్ గాడ్సే, హేమంత్ పాటిల్‌లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'మరాఠాలకు రిజర్వేషన్లు అక్టోబర్ 24 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 40 రోజుల డెడ్‌లైన్ పెట్టిన వారు ఈ వ్యవహారం చిన్న పిల్లల ఆట అనుకుంటున్నారు'అంటూ ఎమ్మెల్యే సోలంకె చేసిన వ్యాఖ్యల ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. మరాఠాలకు రిజర్వేషన్ల డిమాండ్‌తో మనోజ్ జరంగె అనే వ్యక్తి అక్టోబర్ 25 నుంచి జల్నా జిల్లాలోని అంతర్వలి సరటి గ్రామంలో నిరశన దీక్షకు సాగిస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే సోలంకె..కనీసం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూడా పోటీ చేయని వ్యక్తి, ఇప్పుడు నాయకుడా..అంటూ వ్యాఖ్యానిస్తున్నట్లుగా ఆ ఆడియోలో ఉంది. దీంతో మరాఠా సంఘాలు భగ్గుమన్నాయి. సోమవారం స్థానికంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. కొందరు ఆందోళనకారులు సోమవారం మధ్యాహ్నం మజల్‌గావ్‌లోని ఎమ్మెల్యే ఇంటిని చుట్టుముట్టారు. ఆయన నివాసానికి, కారుకు నిప్పుపెట్టారు, రాళ్లు రువ్వారు. ఘటన సమయంలో ఆ ఇంట్లోనే ఉన్నట్లు ఎమ్మెల్యే సోలంకె ఆ తర్వాత తెలిపారు. బీడ్ నగరంలో మరో ఎన్సీపీ ఎమ్మెల్యే సందీప్ క్షీరసాగర్ నివాసం, ఆఫీసుకు కూడా నిప్పు పెట్టారు. పోలీసులు అక్కడికి చేరుకున్న గుంపును చెదరగొట్టారు. బీడ్‌లోని ఒక హోటల్‌కు మరాఠా నిరసనకారులు అగ్నికి ఆహుతి చేశారు. జల్నా వద్ద ముంబైకి వెళ్లే సమృద్ధి ఎక్స్‌ప్రెస్ వేపై బైటాయించారు. షోలాపూర్–అక్కల్‌కోట్ హైవేపై మండుతున్న టైర్లను వేసి వాహనాలను అడ్డుకున్నారు. కొందరు నిరసనకారులు కర్రలు పట్టుకుని గంగాపూర్‌లోని ఎమ్మెల్యే ప్రశాంత్ కార్యాలయంపై దాడి చేశారు. యావత్మాల్‌లో తనను ఆందోళనకారులు అడ్డగించి, రిజర్వేషన్ అంశంపై నిలదీశారని హింగోలి ఎంపీ హేమంత్ పాటిల్ తెలిపారు. దీంతో, రాజీనామా పత్రం రాశానన్నారు. తన రాజీనామా లేఖ అందినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి రసీదు వచ్చిందని చెప్పారు. రిజర్వేషన్లపై వైఖరి తెలపాలంటూ నాశిక్ ఎంపీ గాడ్సేను కొందరు నిలదీయడంతో ఆయన రాజీనామా చేసి లేఖను సీఎంకు పంపించారు.



ఎమ్మెల్యే సోలంకె ఇంటికి నిప్పుపెట్టిన దృశ్యం

సుస్థిర ప్రభుత్వం వల్లే

దేశ ప్రగతి, ప్రపంచ కితాబు: మోదీ

మెహసానా: దేశమంతటా ప్రస్తుతం కనిపిస్తున్న శరవేగమైన ప్రగతి, ప్రపంచవ్యాప్తంగా కురుస్తున్న ప్రశంసలకు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండటమే కారణమని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. సోమవారం గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఖేరాలు వద్ద రూ.5,950 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ జన సమూహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు ఓపెన్ టాప్‌కార్‌లో రోడ్ షో చేశారు. తర్వాత మాట్లాడారు. సుదీర్ఘ కాలం పాటు ఒకే పార్టీ అధికారంలో ఉంటే ఎన్నెన్ని అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవచ్చో, ఎంతటి ప్రగతి సాధించవచ్చో చెప్పేందుకు గుజరాతే ఉదాహరణ అన్నారు. ''మీ నరేంద్ర భాయ్ ఎలాంటివారో మీకు బాగా తెలుసు. మీరు నన్ను ప్రధానిగా కాకుండా మీ సొంత నరేంద్ర భాయ్‌గా చూస్తారు. నేనేదైనా వాగ్దానం చేస్తే దాన్ని నెరవేర్చి తీరతానని కూడా మీకు తెలుసు'' అన్నారు.

ఉద్యోగం పేరిట ఘరానా మోసం

తాడికొండ: మలేషియాలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మొహం చాటేసిన ఓ ఘరానా మోసగాడిని చెన్నైలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మేడికొండూరు మండలం డోగిపర్రు గ్రామానికి చెందిన బ్రహ్మానందం అలియాస్ ఆసీఫ్ మలేషియాలో ఉంటూ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన యువత నుంచి భారీగా డబ్బులు వసూలు చేశాడు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామానికి చెందిన ఓ బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల క్రితం మలేషియా నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు రాగా, ఎయిర్‌పోర్టు అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని.. తాడికొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాడికొండ పోలీసులు నిందితుడిని తీసుకొచ్చి విచారిస్తున్నారు.

ఏపీ సర్కారు పనితీరుపై కేంద్రం ప్రశంస



రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, కాకాని గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- గతేడాది కన్నా మెరుగ్గా రుణ ప్రణాళిక లక్ష్య సాధన
- ఎంఎస్‌ఎంఈలకు విరివిగా రుణాలు
- పీఎం ముద్ర, స్టాండప్ ఇండియాపై ప్రత్యేక దృష్టి
- అర్హులైన పేదలు సులభంగా రుణాలు పొందేలా చొరవ
- వ్యవసాయ యాంత్రీకరణ, కౌలు రైతులకు రుణాలు
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరును కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడంలో మెరుగ్గా ఉందనే విషయాన్ని గుర్తించిన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కృష్ణారావ్ కరాడ్ ఏపీ సర్కారు తీరును మెచ్చుకున్నారని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి బుగ్గన అధ్యక్షతన 224వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బుగ్గన మాట్లడుతూ.. రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.1.68 లక్షల కోట్ల రుణ లక్ష్యాన్ని సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ప్రత్యేకంగా బుగ్గన అభినందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రుణ ప్రణాళిక లక్ష్యం గతేడాది (రూ.1.40 లక్షల కోట్లు) కన్నా 20 శాతం ఎక్కువగా అంటే.. రూ.1.68 లక్షల కోట్లు నమోదు చేయడం శుభపరిణామమన్నారు. ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్‌ఎంఈలకు విరివిగా రుణాలివ్వాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. పీఎం ముద్ర, స్టాండప్ ఇండియా తదితర పథకాలకు రుణాలు ఇవ్వడంపై బ్యాంకర్లు మరింత దృష్టి సారించాలని కోరారు.

వీధి, చిరు వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వండి

ప్రధానమంత్రి స్వానిధి పథకం కింద వీధి వ్యాపారులకు, ఆత్మనిర్భర్ నిధి, పీఎం ఎఫ్‌ఎంఈ పథకాల ద్వారా చిరు వ్యాపారులకు రుణాలిచ్చేందుకు మరింత ప్రాధాన్యతనివ్వాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విజ్ఞప్తి చేశారు. ఆయా పథకాల అమలులో ఎక్కువ జాప్యం లేకుండా దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ పథకానికి 8వ తరగతి అర్హత, ఒక జిల్లా ఒక వస్తువు వంటివి తొలగించడం వంటి అంశాలను సరళతరం చేసిన నేపథ్యంలో 18 ఏళ్లు నిండిన వారందరికీ రుణ సదుపాయం కల్పించడంలో వేగం పెంచాలన్నారు. ప్రైవేట్ బ్యాంకులు కూడా ఇందులో పాలుపంచుకోవాలన్నారు.

మహిళా సంఘాల రుణాలపై వడ్డీ తగ్గించండి

స్వయం సహాయక సంఘాలకు ఇప్పటివరకూ రూ.4,286 కోట్లను రుణాలుగా ఇచ్చినట్టు మంత్రి బుగ్గన చెప్పారు. దీనిని మరింత పెంచాలని కోరారు. రూ.3 లక్షల వరకూ డ్వాక్రా సంఘాలు తీసుకునే రుణాలపై వడ్డీ తగ్గించే అంశంపై నిర్ణయం తీసుకోవాలని బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ వడ్డీ లేని రుణాలు, పావలా వడ్డీ కార్యక్రమాల ద్వారా పేద మహిళలకు వడ్డీ భారం తగ్గించే అంశంపైనా చొరవ చూపాలన్నారు.

కౌలు రైతులకు మరింత సహకారం

జూన్ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని 67,422 మంది కౌలు రైతులకు రూ.517.86 కోట్ల ఆర్థిక సాయం అందించినట్టు మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగనన్న నగర్‌లలో గృహ నిర్మాణం చేసుకునే వారికి రుణ సదుపాయం కల్పించే లక్ష్యం రూ.2,464.72 కోట్లు (60 శాతం) చేరామన్నారు. సిబిల్ స్కోర్, వయసు తదితర కారణాలతో ఎక్కువ దరఖాస్తులు పక్కన పెడుతున్నారని.. బ్యాంకర్లు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి ప్రభుత్వ లక్ష్యం చేరడంలో భాగస్వామ్యం కావాలని కోరారు.

రైతులకు మరిన్ని రుణాలివ్వాలి

వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులకు మరిన్ని రుణాలందించడం ద్వారా చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో పాడి రైతులకు తోడ్పాటు ఇవ్వాలన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ సుబ్రమణియన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులో ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మాట్లాడుతూ.. కౌలు రైతులు, స్వయం సహాయక సంఘాలకు మరింత తోడ్పాటును అందించేందుకు బ్యాంకులు మరింత సహకరించాలని కోరారు. జగనన్న గృహ నిర్మాణ కాలనీలకు రానున్న నాలుగైదు నెలల్లో నూరు శాతం రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ కన్వీనర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ఎం.రవీంద్రబాబు, చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, సెర్ప్ సీఈవో ఇంతియాజ్, ఆర్‌బీఐ జీఎం ఆర్కే మహానా, నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, యూబీఐ జీఎం గుణానంద్ గామి, ఏసీఎం రాజుబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు

డ్రైవర్ రామ్‌సింగ్‌ను పరామర్శించిన ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులమీద దాడి చేసిన వారిపై పోలీసులు చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారని ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి చెప్పారు. కావలిలో కొందరు రౌడీమూకలు దాడి చేయడంతో గాయపడి విజయవాడ విద్యాధరపురంలోని ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ బి.రామ్‌సింగ్‌ను ఆయన సోమవారం పరామర్శించారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో ప్రయాణికుల సేవలో నిమగ్నమైన ఆర్టీసీ ఉద్యోగిపై దాడి చేయడం దుర్మార్గమని, ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించారని, ఇప్పటికే ఏడుగురిని అరెస్ట్ చేశారని చెప్పారు. మల్లికార్జునరెడ్డి వెంట ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ఉన్నారు.

తక్షణం స్పందించిన ప్రభుత్వానికి అభినందనలు: ఈయూ

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి జరిగిన వెంటనే స్పందించిన ప్రభుత్వానికి, పోలీసులకు ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) అభినందనలు తెలిపింది. ఈ ఘటనకు సంబంధించిన పలు అంశాలపై డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి సోమవారం ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు,



డ్రైవర్ రామ్‌సింగ్‌ను పరామర్శిస్తున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యంరాజు, ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు లేఖ రాశారు. దాడికి పాల్పడిన మిగిలిన దుండగులను కూడా వెంటనే అరెస్టు చేయాలని, ఆర్టీసి డ్రైవర్‌పై దాడి కేసును విజయవాడ కోర్టుకు బదిలీచేయాలని డీజీపీని కోరారు. కేసు కావలి కోర్టులో ఉంటే విచారణ సమయంలో బాధితుడికి నిందితుల వల్ల ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

నిందితులకు బెయిల్ రాకుండా చూడాలి: ఏపీఎన్జీవో, మజ్దూర్ యూనిటీ అసోసియేషన్

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి దారుణమని, ఈ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో, ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. విజయవాడలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో సోమవారం ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో నిందితులకు రిమాండ్

కావలి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి మండలం మద్దూరుపాడు సమీపంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన కేసులో అరెస్టయిన ఏడుగురికి న్యాయస్థానం నవంబర్ 10వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ఈ విషయాన్ని కావలి డీఎస్పీ వెంకటరమణ సోమవారం తెలిపారు. కారు అడ్డుగా ఉండటంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్ హారన్ మోగించడంపై ఆగ్రహించిన నిందితులు విచక్షణారహితంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. మిగిలిన నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

- రాష్ట్రంలో సీపీఎం జాతాలు (బస్సుయాత్ర)లను ఆ పార్టీ జాతీయ నేతలు సోమవారం ప్రారంభించారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కర్నూలు జిల్లా ఆదోనిలో అశోక్ ధావలే ప్రారంభించారు. ఆయా సభల్లో బీవీ రాఘవులు, అశోక్ ధావలే, కె.సుబ్బరావమ్మ, వి.శ్రీనివాసరావు, ఎంఏ గఫూర్ మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం. 203 to 223/2023-24, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 27.10.2023
గుంటూరు, కాకినాడ, కృష్ణా, శ్రీకాకుళం, YSR కడప, అనంతపురం మరియు చిత్తూరు జిల్లాలలో JJM ప్రోగ్రామ్ క్రింద రూ. 105.73 కోట్ల మొత్తం అంచనా వ్యయంతో జగనన్న హౌసింగ్ కాలనీ లే అవుట్స్‌లో శాశ్వత నీటి సరఫరా మరియు FHTC's ఏర్పాటు చేయు 21 పనుల కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లను 28.10.2023 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అంటే www.tenders.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్ & PD, APDWSC, RWS&S శాఖ, విజయవాడ
DIPR RO No.11417/CL/Advt/1/1/2021-22, Dt: 30.10.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ

నెం. 08/2023-24, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీస్** తేది: 27.10.2023
ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం చిన్న మల్లవరం దగ్గర గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు స్పిల్ వే గేట్లు 12 నెంబర్లకు మరమ్మతులు మరియు ఇతర పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. పని విలువ : రూ.759.31 లక్షలు. షెడ్యూల్ డౌన్‌లోడ్ చివరి తేది : 13.11.2023 మ.3 గం. వరకు. ఇతర వివరాలను www.tender.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ 9490165319.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, కన్‌స్ట్రక్షన్ సర్కిల్, ఒంగోలు
DIPR RO No.11427/CL/Advt/1/1/2021-22, Dt: 30.10.2023

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం. 100-129/2023-24, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీస్** తేది: 25.10.2023
గ్రా.నీ.స & పారిశుద్ధ్య శాఖ వలయము నెల్లూరు పరిధిలో జల జీవన్ మిషన్ గ్రాంట్ క్రింద మంజూరైన 30 పనులకు అంచనా విలువ : రూ.1900.90 లక్షలతో టెండరు కోరడమైనది. టెండరు షెడ్యూల్ ప్రారంభ తేది: 30.10.2023 సా.4 గం.ల తరువాత. వివరాలు : http://tender.apeprocurement.gov.in లో అప్‌లోడ్ చేయబడును.
సం/- పర్యవేక్షక ఇంజినీర్, గ్రా.నీ.స & పా., వలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
DIPR RO No.11423/CL/Advt/1/1/2021-22, Dt: 30.10.2023

Andhra Pradesh State Co-operative Marketing Federation Limited
56-2-11 to 4th and 5th Floors, AP Markfed Corporate Office Building, APIIC Colony, Jawahar Auto Nagar, Vijayawada, Andhra Pradesh.
e-TENDER NOTIFICATION
Applications are invited for the work of Providing foundations to install DAL MILL Machinery, Removal and modifications to the existing sheds at Feed mixing plant, Nandyal, Nandyal Dist. E- Procurement Date of Tender start : 01.11.2023 from 4.00 PM. Last Date of Submission of Tender : 14.11.2023 upto 4.30 PM. Date of Tender Opening : 15.11.2023. Tender can be downloaded from AP e-procurement portal tenders for details contact : 9652087655, 6309009808.
Sd/- MANAGING DIRECTOR

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
కమిషనర్, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ వారి కార్యాలయము
తాడేపల్లి, గుంటూరు - 522 501
టెండరు నోటీస్
గ్రామ/వార్డ్ సచివాలయ సిబ్బంది నియామక పరీక్షలు 2019 & 2020 సంవత్సరములలో ఉపయోగించబడిన OMR షీట్స్ మరియు పరీక్షలకు సంబంధించిన ఇతర పత్రాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు నుండి ష్రెడ్డింగ్ అనంతరం తరలించు పద్ధతిపై కొనుగోలు చేయుటకు ఏజెన్సీల నుండి కొటేషన్స్ ఆహ్వానించడమైనది. ఆసక్తి గల ఏజెన్సీలు తేది: 10.11.2023 సా. 5.30 గంటల లోపు కమిషనర్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ వారి కార్యాలయము, తాడేపల్లి నందు సీల్డ్ కొటేషన్స్ సమర్పించవలెను. మరిన్ని వివరములకు Room No.107, మొదటి అంతస్తు, కమిషనర్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, తాడేపల్లి, గుంటూరు వారి కార్యాలయం నందు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
ఇ-వేలం నోటిఫికేషన్ టెండరు
TTD ప్రెస్‌లో ప్రెస్ జెల్లీ అమ్మకం కోసం ఇ-వేలం. టెండరు ప్రకటన & వివరాల కోసం, Auction Id: 23253.Roc.No.P2/36/Press/2014 చూడండి. వెబ్‌సైట్ http://www.tirumala.org & https://konugolu.ap.gov.in కు లాగాన్ కావలెను. తదుపరి వివరాల కోసం సంప్రదించండి: 0877-2264355, (లేదా)0877-2264292.
Roc No.PR4/13959/Adv.No.238/PRO/2023, Dt: 30.10.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ

నెం. 438 to 502/ఎస్ఈ/23-24, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీస్** తేది: 26.10.2023
కృష్ణా జిల్లా పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీలకు & వివిధ ఆవాసములలో త్రాగు నీటి సౌకర్యాల కల్పన & ఇంటింటికి కుళాయిల నిర్మాణము, 65 పనులకు అంచనా విలువ : రూ.5050.18 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరడమైనది. టెండరు డాక్యుమెంట్లు తేది : 1.11.2023 ఉ. 11గం. అందుబాటులో ఉండును. వివరాలు : https://tender.apeprocurement.gov.in. ఫోన్ 9494949955
సం/- పర్యవేక్షక ఇంజినీర్, గ్రా.నీ.స సర్కిల్, విజయవాడ, ఎన్.టి.ఆర్. జిల్లా
DIPR RO No.11419/CL/Advt/1/1/2021-22, Dt: 30.10.2023

DEPARTMENT OF TECHNICAL EDUCATION
(On behalf of APSCHE)
APEAPCET-2023 ADMISSIONS
(M.P.C & Bi.P.C STREAMS)
NOTIFICATION
CERTIFICATE VERIFICATION & OPTION EXERCISING FOR WEB BASED COUNSELLING
M.P.C STREAM : The qualified candidates of APEAPCET-2023 (M.P.C Stream) for admission into B.Pharmacy / Pharm-D Courses are informed to attend the web based counselling from **01-11-2023 to 12-11-2023.** For details visit website **https://cets.apsche.ap.gov.in**
Bi.P.C STREAM : The qualified candidates of APEAPCET-2023 (Bi.P.C Stream) for admission into B.E / B.Tech/ B.Pharmacy / Pharm-D Courses are informed to attend the web based counselling for first phase from **01-11-2023 to 14-11-2023.** For details refer the website: **https://cets.apsche.ap.gov.in**
Date : 30-10-2023 Sd/- C. Nagarani, I.A.S.,
Place : Mangalagiri Convenor & DTE

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థ)
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు ప్రకటన నం. 13, 14, 15/CE(S)/APIIC/2023-24, తేది: 26.10.2023
TN. No.13: IALA 2022-23 క్రింద నెల్లూరు జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్కు వద్ద అంతర్గత రోడ్ల స్థాయి పెంపుదల (2వ పిలుపు) ECV: రూ.53,76,763.00
TN. No.14: 2022-23 సంవత్సరానికి IALA క్రింద SPSR నెల్లూరు జిల్లాలోని ఆటో కాంప్లెక్స్ - నెల్లూరు వద్ద అంతర్గత రోడ్ల స్థాయి పెంపుదల మరియు వరదనీటి డ్రైన్ల నిర్మాణం (2వ పిలుపు) - రూ.92,40,303.00
TN. No.15: అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం వద్దగల ఫేజ్-II లోని క్లస్టర్‌లో జంగిల్ క్లియరెన్స్, సరిహద్దు రాళ్ళు ఏర్పాటుచేయుట మరియు బిగించుట (2వ పిలుపు) ECV: రూ.96,09,187.00
ప్రచురణ తేది: 26.10.2023 రా.08.00 గం. బిడ్ల దాఖలుకు చివరి తేది: 10.11.2023 మ.3.00 గం.
సం/- చీఫ్ ఇంజినీర్(S)
టెండరు ప్రకటన వివరాలను మరియు బిడ్ డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్ www.apeprocurement.gov.in (లేదా) https://tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
DIPR RO No.2447PP/CL/Advt/1/1/2021-22, Dt: 30.10.2023

REGIONAL OFFICE : ANDHRA PRADESH
EMPLOYEES' STATE INSURANCE CORPORATION
PANCHDEEP BHAWAN, ESIC ROAD, GUNADALA, VIJAYAWADA- 520004
Tel. No. 0866-2453498. Fax No.0866 - 2453490. Website: www.esic.nic.in.
E-mail:rd-andhrapradesh@esic.nic.in

NOTICE INVITING EXPRESSION OF INTEREST (EOI) FOR HIRING OF PREMISES FOR ESI DISPENSARIES AT VARIOUS LOCATIONS IN THE STATE OF ANDHRA PRADESH

The Deputy Director (I/c), ESI Corporation, Regional Office, Andhra Pradesh invites Expression of Interest (EOI) from **Public Health Centre (PHC) /Government /PSU Organizations** for hiring of accommodation on rental basis for **"ESI Dispensaries" at various places in the state of Andhra Pradesh preferably in Ground Floor only.**

Nature of work	Required Carpet Area of the Premises	Geographical location /site in which accommodation is required	No Doctors Dispensary	Period of Contract
Hiring of Accommodation for ESI Dispensary	1600 Sq.Ft (Upper Ceiling Limit)	Naidupeta	2 Doctor	Initially for a period of 03 years which can be extendable on mutual consent for further period.
	1600 Sq.Ft (Upper Ceiling Limit)	Puthalapattu	2 Doctor	
	4300 Sq.Ft (Upper Ceiling Limit)	Paravada	5 Doctor	
	2150 Sq.Ft (Upper Ceiling Limit)	Mudinepalli	3 Doctor	

Preference will be given to PHC. The last date for receipt of EOI is 30.11.2023.
For further information regarding accommodation of the dispensary may be viewed at **www.esic.gov.in**
Sd/-
DEPUTY DIRECTOR
Date : 30.10.2023 REGIONAL OFFICE. ANDHRA PRADESH

కలెక్టర్ వారి కార్యాలయము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
ఆర్.సి.నెం.జి2/1131/2023 తేది: 30.10.2023
(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్25, సబ్ రూల్ -1 ననుసరించి
రూఢీ ప్రకటన
ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములకు మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనములకై అనగా రామాయపట్నం నాన్-మేజర్ పోర్టు నిర్మాణం కొరకు, ఆవులవారిపాలెం, మొండివారిపాలెం మరియు సాలిపేట యస్‌టి కాలనీ నిర్వాసితులైన కుటుంబముల వారికి స్మశాన వాటికకు భూమి అవసరమై వున్నదని భావించి ఉలవపాడు మండలము రామాయపట్నం గ్రామములోని య.2.39 సెంట్లు భూములు కొంత మేరకు అవసరమైవున్నదని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఏపి మారిటైమ్ బోర్డు కాకినాడ వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను సమకూర్చినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.
రూఢీ ప్రకటన
శ్రీ జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖల భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను య.2.39 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా రామాయపట్నం నాన్ - మేజర్ పోర్టు నిర్మాణం నిమిత్తం అవసరమైఉన్నవని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.
షెడ్యూల్
జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలం: ఉలవపాడు | గ్రామము : రామాయపట్నం

క్ర. నెం	సర్వే నెం./ సబ్‌డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం	భూమి రకం	సేకరించు విస్తీర్ణం (ఎకరాలు)	సంబంధిత ఆసామి/పట్టాదారు పేరు చిరునామా - మరియు అనుభవదారు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు,కట్టడాలు మరియు ఇతర వివరములు
1	244	2.39	పట్టా మెట్ట	1.19	సయ్యద్ హిదాయత్ అలీ తండ్రి అహ్మద్	245	220	రావూరు గ్రామం	229	రేకులషెడ్-1 కోళ్ళఫారంషెడ్లు-2 వేప-1, టేకు-3 కొబ్బరిచెట్లు-6 ట్రాన్స్‌ఫార్మర్-1
2				1.20	సయ్యద్ అజ్మల్ హుస్సేన్ తండ్రి రహీమ్					
	మొత్తం	2.39		2.39						

ఈ భూముల ప్లానులు శ్రీయుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టరు, నెల్లూరు వారి కార్యాలయము, మరియు శ్రీయుత సబ్-కలెక్టరు, కందుకూరు వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు అయిన వారు ఎవరు లేరు. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూములలో గాని, లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో చెరువు మరియు కాలువ నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గాని తొలగించుట గాని చేయవలెను.
సం/- హరినారాయణన్.యం., కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

పైడితల్లి సిరిమానోత్సవానికి వేళాయె

- విజయనగరంలో నేడు సిరిమాను తిరువీధి ఆరంభం
- ఉత్సవానికి 50 అడుగుల సిరిమాను సిద్ధం
- హాజరుకానున్న నాలుగున్నర లక్షల మంది భక్తులు


పైడితల్లిని దర్శించుకుంటున్న విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

సాక్షిప్రతినిధి, విజయనగరం/విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి సిరిమానోత్సవానికి ముహూర్తం ఆసన్నమైంది. మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు సిరిమాను తిరువీధి ఆరంభం కానుంది. ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు ఈ ఏడాది ఏడోసారి సిరిమానును అధిరోహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. సుమారు నాలుగున్నర లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా. సిరిమానోత్సవంలో 50 అడుగుల పొడవున్న సిరిమాను ఉపరితలంలో బిగించే ఇరుసుపై ఏర్పాటు చేసిన పీటపై ప్రధాన పూజారి విసనకర్ర చేతపట్టి ఆశీనులవుతారు. రెండో చివరన రథంపై అమర్చిన ఇరుసును మానుకు అమర్చుతారు. దాని ఆధారంగానే మాను పైకిలేస్తుంది. గజపతిరాజ వంశీయుల్లో ఒకరు తాడు లాగడంతో సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్దన ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి మొదలై రాజా బజారు మీదుగా కోట వరకూ మూడు సార్లు తిరుగుతుంది. ఊరేగింపు ఆద్యంతం విసనకర్ర విసురుతూ కనిపించే సిరిమాను పూజారిని భక్తులు అరటిపండ్లతో కొలుస్తారు. తొలుత సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు హుకుంపేటలో మధ్యాహ్నం 12 గంటలకు కాలినడకన వీధుల్లోంచి బయలుదేరి వేలాది మంది భక్తుల సందడితో ఊరేగింపుగా వస్తారు. నిర్ణయించిన ముహూర్తానికి సిరిమానును అధిరోహిస్తారు. సిరిమానోత్సవానికి పోలీస్‌శాఖ 2,015 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు.

సంప్రదాయబద్ధంగా తొలేళ్ల సంబరాలు

పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరాలు సోమవారం సంప్రదాయబద్ధంగా జరిగాయి. అమ్మవారి ఘటాలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కోట నుంచి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పూజారి అమ్మవారి చరిత్రను వివరించి రైతన్నలకు విత్తనాలు పంపిణీ చేశారు. అంతకుముందు అమ్మవారిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తదితరులు దర్శించుకున్నారు. కాగా, అమ్మవారి పండుగకు అనుబంధంగా నిర్వహించే విజయనగర ఉత్సవాలు రెండోరోజు సోమవారం వేడుకగా సాగాయి.

రేపు 'వైఎస్సార్' పురస్కారాల ప్రదానం

- 27 మంది విశిష్ట సేవకులు, సంస్థలకు సత్కారం
- 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, 4 సాఫల్య పురస్కారాలు
- పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ జీవిత సాఫల్య, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, విశిష్ట అతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. వరుసగా మూడో ఏడాది వివిధ రంగాల్లో సామాజిక అభ్యున్నతి కోసం అసామాన్య కృషి చేసిన 27 మంది విశిష్ట వ్యక్తులు, సంస్థలను అవార్డులతో సత్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, కళలు-సంస్కృతి, తెలుగు భాష-సాహిత్యం, క్రీడలు, వైద్యం, మీడియా, సమాజసేవ వంటి 7 విభాగాల్లో 23 వైఎస్సార్ జీవిత సాఫల్య, 4 వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను అందజేయనున్నట్లు వివరించారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం కింద రూ.10 లక్షల నగదు, సాఫల్య పురస్కారం కింద రూ.5 లక్షల నగదుతో పాటు మెమొంటో, మెడల్, ప్రశంసాపత్రం బహూకరిస్తారన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టండి

గనుల శాఖ సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అక్రమ మైనింగ్ జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని సచివాలయంలో సోమవారం గనుల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్రమ మైనింగ్ జరుగుతుందన్న ఆరోపణలున్న ప్రాంతాల్లో వెంటనే తనిఖీలు జరిపి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు జిల్లాలో క్వార్ట్జ్ మైనింగ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే తనిఖీల కోసం 3 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, వారంలో నివేదికలు సమర్పిస్తాయని, వాటి ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు మైనింగ్ నిలిపివేయాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలో లైమ్‌స్టోన్, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి అధికారులు దృష్టి సారించాలని సూచించారు. పోలవరం కాలువ గట్లపై ఉన్న గ్రావెల్, కొండ ప్రాంతాల్లోని గ్రావెల్ నిల్వలను అనధికారికంగా తరలిస్తున్నారనే ఫిర్యాదులొస్తున్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ మైనింగ్ ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లో విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, గనుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, అదనపు డైరెక్టర్ డబ్ల్యూబీ చంద్రశేఖర్, జేడీ రాజబాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుమల తరహాలో తిరుచానూరు బ్రహ్మోత్సవాలు

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- నవంబర్ 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహణ
- వాహన సేవల బుక్ లెట్ ఆవిష్కరణ


వాహన సేవల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. నవంబర్ 10 నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని తెలిపారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం ఎదుట సోమవారం అమ్మవారి బ్రహ్మోత్సవాల వాహన సేవల బుక్ లెట్‌ను చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కరుణాకరరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నవంబర్ 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 9న లక్ష కుంకుమార్చన, అంకురార్పణ నిర్వహిస్తారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 10న ధ్వజారోహణం, 14న గజ వాహనం, 15న స్వర్ణరథం, గరుడ వాహనం, 17న రథోత్సవం, 18న పంచమితీర్థం, 19న పుష్పయాగం ఉంటుందని చెప్పారు. ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు, రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు వాహన సేవలు జరుగనున్నాయన్నారు. పంచమి తీర్థం నాడు లక్షలాది మంది భక్తులు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరిస్తారన్నారు. ఇందుకోసం పెద్ద ఎత్తున భద్రతా ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నామని వివరించారు. సుమారు రూ.9 కోట్ల వ్యయంతో అమ్మవారి పుష్కరిణి ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, త్వరలో నీటిని నింపి పుష్కరిణి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయ సమితి
విద్యా మంత్రిత్వ శాఖ,
పాఠశాల విద్య మరియు అక్షరాస్యత విభాగం,
భారత ప్రభుత్వం పరిధిలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ
తేదీ పొడిగింపు కోసం ప్రకటన
2024-25 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయాలలో లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ ద్వారా IX & XI తరగతులలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలుకు చివరి తేది 07 నవంబర్ 2023 వరకు పొడిగించబడిందని సంబంధితులందరి దృష్టికి తేవడమైనది.
అభ్యర్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్‌ను దర్శించి ఉచితంగా దరఖాస్తు చేసుకోగలరు.
నవోదయ విద్యాలయ సమితిచే జారీ చేయబడింది

● ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన అమరవీరులకు నివాళి అర్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన 'నా భూమి-నా దేశం' కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది మంది హాజరయ్యారు. ఆగస్టు 9న ప్రారంభమైన ఈ కార్యక్రమం మంగళవారం ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరై ప్రసంగించనున్నారు. శని, ఆదివారాల్లో ఏపీ నుంచి వేలాది మంది ఢిల్లీకి చేరుకున్నారు.

AMARAVATI SMART AND SUSTAINABLE CITY CORPORATION LIMITED
Lenin Center, Governorpet, Vijayawada - 520002 (A.P.)
NIT No. ASSCCL/CITIIS/Phase-I & II Dated: 28.10.2023
E-PROCUREMENT SHORT TENDER NOTICE
Name of Work: "Establishment of Anganwadi Centres, Holistic Development of Schools, Establishment of E-Health Centres & Primary Health Centre benefiting 16 villages of Tadikonda Constituency under CITIIS (City Investments to Innovate, Integrate and Sustain) Challenge Project"- Total number of works: 7 Nos. Estimate Amount :13.66 Crs. The bids can be downloaded on AP e-procurement portal from 31.10.2023 to 08.11.2023 up to 15:00 Hrs. Due date for submission of Bid 08.11.2023 up to 15.30 Hrs. Technical bid opening 08.11.2023 @ 16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.asscl.ap.gov.in or www.crda.ap.gov.in
Sd/- MD & CEO
ASSCCL, Vijayawada

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన NIT NO.19/ENG/2023-24
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు CONSTRUCTION OF POOJA MANDAPAMS IN THE PREMISES OF SRI DURGA MALLESWARA SWAMY VARLA DEVASTHANAM (Rs.417.20 Lakhs) పని చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తికలవారు https://tender.apeprocurement.gov.in లో Endowments Department వర్క్స్ నందు దర్శించవచ్చును. టెండర్లు డౌన్ లోడు ది.31-10-2023 ఉ. గం.11.00 నుండి ది.14-11-2023 ఉ. గం.11.00 ల వరకు. టెండరు దాఖలు చేయు చివరి తేది.14-11-2023 మ. గం.12.00 ల వరకు. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో లేదా ఫోన్ నెం.0866-2423600 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ, పరోక్ష సేవ మరియు వివరముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
కర్నాటి రాంబాబు, ఛైర్మన్, ధర్మకర్తల మండలి | ఎం. కే.ఎస్. రామారావు, డిప్యూటీ కలెక్టర్ మరియు కార్యనిర్వహణాధికారి

కలెక్టర్ వారి కార్యాలయము, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా
ఆర్.సి.నెం.జి2/1122/2023 తేది: 30.10.2023
(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్25, సబ్ రూల్ -1 ననుసరించి
రూఢీ ప్రకటన
ఈ దిగువ షెడ్యూల్ నిర్దిష్టపరచిన భూములకు మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనములకై అనగా ఎ.3.05 సెంట్లు భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామము నందు రామాయపట్నం నాన్ - మేజర్ పోర్టు స్థాపించుట కొరకు కర్లపాలెం గ్రామములో నిర్వాసితులైన కుటుంబముల వారికి పునరావాసము, పునఃస్థాపనకు కొరకు గుడ్లూరు మండలము, మోచెర్ల గ్రామములోని భూమి కొంత మేరకు అవసరమైవున్నదని శ్రీయుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఏపి మారిటైమ్ బోర్డు కాకినాడ వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరముల విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను సమకూర్చినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.
రూఢీ ప్రకటన
శ్రీ జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూమి ఎ.3.05 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామము నందు రామాయపట్నం నాన్ - మేజర్ పోర్టు స్థాపించుట కొరకు కర్లపాలెం గ్రామములో నిర్వాసితులైన కుటుంబముల వారికి పునరావాసము, పునఃస్థాపనకు కొరకు గుడ్లూరు మండలము, మోచెర్ల గ్రామము భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.
షెడ్యూల్
ప్రాజెక్టు పేరు : ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామములో రామాయపట్నం నాన్ మేజర్ పోర్టు స్థాపించుటకు
జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలం: గుడ్లూరు | గ్రామము : మోచెర్ల

క్ర. నెం	సర్వే నెం./ సబ్‌డివిజన్ నెం.	పూర్తి విస్తీర్ణం	భూమి రకం	సేకరించు విస్తీర్ణం (ఎకరాలు)	సంబంధిత ఆసామి/పట్టాదారు పేరు చిరునామా (పట్టాదారు/ అనుభవదారు)	సరిహద్దులు ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	చెట్లు,కట్టడాలు మరియు ఇతర వివరములు
1	660-2	2.88	పట్టా మెట్ట	2.88	గద్దం శ్రీనివాసరావు తండ్రి వీరరాఘవయ్య	659,658	657	672	661	మామిడిచెట్లు
2	646-2	0.17	పట్టా మెట్ట	0.17	అన్‌క్లెయిమ్	645	656	665	667	
	మొత్తం			3.05						

ఈ భూమి ప్లాను శ్రీయుత సబ్‌కలెక్టర్, కందుకూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును. బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గానీ తొలగించుట గానీ చేయవలెను.
సం/- హరినారాయణన్.యం., కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

శ్రీయుత ప్రత్యేక కలెక్టర్(భూ.సే), తెలుగుగంగ ప్రాజెక్టు, నెల్లూరు వారి కార్యవర్తనములు
ప్రస్తుతము : శ్రీ బి.చిన్నఓబులేసు, యం.ఎ., బి.యడ్.
ఫారం నెం. VI (ఎ)
ఆర్.సి.డి1/189/2023 తేది: 20.10.2023
(2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునః స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 19, సబ్‌రూల్ (1) ననుసరించి)
ప్రాథమిక ప్రకటన
ఈ దిగువ నుదహరించిన షెడ్యూల్ దాఖలా ఎ.4.36 సెంట్లు భూమికు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలము, గుండవోలు గ్రామము నందు ప్రజాహిత ఉపయోగార్థం అనగా పోర్షోర్ సబ్ మర్జెన్ ఆఫ్ కండలేరు జలాశయము అండర్ తెలుగు గంగ ప్రాజెక్టు నిర్మాణము కొరకు భూమి కావలయునని శ్రీ ప్రత్యేక కలెక్టర్, తెలుగుగంగ ప్రాజెక్ట్, నెల్లూరు వారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందు, 2013 సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునః స్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) నిబంధనలననుసరించి ఇందుకు సంబంధించిన యావన్మందికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.
ఈ భూసేకరణ వలన నిర్వాసితులైన కుటుంబాలు ఏమియూ లేవు.
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్. నెల్లూరు వారు పైన పేర్కొనిన చట్టంలో సెక్షన్/12 (3ఏ) క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ) తెలుగు గంగ ప్రాజెక్ట్, రాపూరు ఎట్ నెల్లూరు వారికి, వారి సిబ్బందికి మరియు పనివారలకు ఆ భూముల భూ సేకరణకై పై సెక్షన్ క్రింద ఇవ్వబడిన అధికారములను వినియోగించుటకు అధికారము ఇవ్వబడినది.
పై చట్టంలోని సెక్షన్ 11 (4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేది నుండి శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు / ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగుగంగ ప్రాజెక్ట్, రాపూరు ఎట్ నెల్లూరు వారి ముందస్తు అనుమతి లేనిదే, ఏ వ్యక్తి ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం / కొనుగోలు (క్రయ విక్రయములు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.
పై చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినముల లోగా శ్రీ ప్రత్యేక కలెక్టర్ (భూ సేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, యస్.పి.యస్.ఆర్.నెల్లూరు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూసేకరణ), తెలుగు గంగ ప్రాజెక్ట్, రాపూరు ఎట్ నెల్లూరు వారి యెదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.
షెడ్యూల్
జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలము : రాపూరు | గ్రామము : గుండవోలు

క్రమ సం	సర్వే నెం./ సబ్ డివిజన్.	మొత్తం విస్తీర్ణం (ఎ.సెం)	భూసేకరణ క్రింద విస్తీర్ణం	తరగతి	సంబంధిత ఆసామి పేరు - చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు, పంట వివరములు
1	474-1ఎ		0.58	పట్టా మెట్ట	నల్లపరెడ్డి లక్ష్మీ నారాయణరెడ్డి తండ్రి మల్లారెడ్డి	485/2	473	474/2	479/బి	
	475-2		1.60			475/2	474	474/1	479/బి	
2	474-1బి		2.18	పట్టా మెట్ట	ఆల్లూరు శ్రీనివాసమ్మ భర్త పెంచలస్వామి	485/2	473	474/2	479/బి	సిమెంట్ రాళ్ళతో కూడిన ఇల్లు కూలిపోయున్నది
	మొత్తము		4.36							

సం/- బి.చిన్నఓబులేసు, యం.ఎ., బి.యడ్., ప్రత్యేక కలెక్టర్ (భూ.సే), తెలుగు గంగ ప్రాజెక్ట్, నెల్లూరు

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము,
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా
ఆర్.సి.నెం.జి2/1122/2023 తేది: 30.10.2023
(2013 వ సంవత్సరము 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 19 (1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్25, సబ్ రూల్ -1 ననుసరించి)
రూఢీ ప్రకటన
ఈ దిగువ షెడ్యూల్ నిర్దిష్టపరచిన భూములకు మరియు వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనములకై అనగా ఎ.20.89 సెంట్లు భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామము నందు రామాయపట్నం నాన్ - మేజర్ పోర్టు స్థాపించుట కొరకు కర్లపాలెం గ్రామములో నిర్వాసితులైన కుటుంబముల వారికి పునరావాసము, పునఃస్థాపనకు కొరకు గుడ్లూరు మండలము, మోచెర్ల గ్రామములోని భూమి కొంత మేరకు అవసరమైవున్నదని శ్రీయుత చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఏపి మారిటైమ్ బోర్డు కాకినాడ వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలో 15వ విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి వచ్చిన అభ్యంతరముల విచారణ జరిపిన పిమ్మట శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూమి ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ నిధులను సమకూర్చినారు. ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి చేయబడినది.
రూఢీ ప్రకటన
శ్రీ జిల్లా కలెక్టరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వారు 2013 సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలు భూమి ఎ.20.89 సెంట్లు ప్రజా ప్రయోజనములకై అనగా భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు, కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామము నందు రామాయపట్నం నాన్ - మేజర్ పోర్టు స్థాపించుట కొరకు కర్లపాలెం గ్రామములో నిర్వాసితులైన కుటుంబముల వారికి పునరావాసము, పునఃస్థాపనకు కొరకు గుడ్లూరు మండలము, మోచెర్ల గ్రామము భూమి అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.
షెడ్యూల్
ప్రాజెక్టు పేరు : ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు కాకినాడ వారు గుడ్లూరు మండలము రావూరు గ్రామములో రామాయపట్నం నాన్ మేజర్ పోర్టు స్థాపించుటకు
జిల్లా : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు | మండలం: గుడ్లూరు | గ్రామము : మోచెర్ల

క్ర. నెం	సర్వే నెం.	పూర్తి విస్తీర్ణం	భూమి రకం	సేకరించు విస్తీర్ణం (ఎకరాలు)	సంబంధిత ఆసామి/పట్టాదారు పేరు చిరునామా - మరియు అనుభవదారు	సరిహద్దులు(సర్వేనెం.) ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	చెట్లు,కట్టడాలు మరియు ఇతర వివరములు
1	555-2	13.62	పట్టా మెట్ట	3.00	షేక్ షకీలా భర్త రషీద్	555-పి	561	556,557	646	మామిడి చెట్లు
2	556	1.11	పట్టా మెట్ట	0.75	షేక్ షకీలా భర్త రషీద్	555	557	659	646	
3			పట్టా మెట్ట	0.36	సయ్యద్ ఫాతిమా భర్త మహబూబ్					
4	557	4.60	పట్టా మెట్ట	2.90	సయ్యద్ ఫాతిమా భర్త మహబూబ్	555	561	558	556	పశువుల షెడ్
5			పట్టా మెట్ట	1.70	అప్పసబోయిన నరసింహరావు తండ్రి వెంకటసుబ్బయ్య					
6	558	1.17	పట్టా మెట్ట	1.17	అప్పసబోయిన నరసింహరావు తండ్రి వెంకటసుబ్బయ్య	557	559	659	659	
7	659	7.46	పట్టా మెట్ట	1.47	సయ్యద్ ఫాతిమా భర్త మహబూబ్	658, 657, 656	559, 658	661, 660	663	
8			పట్టా మెట్ట	5.99	అప్పసబోయిన నరసింహరావు తండ్రి వెంకటసుబ్బయ్య					
9	661	3.55	పట్టా మెట్ట	3.55	అప్పసబోయిన నరసింహరావు తండ్రి వెంకటసుబ్బయ్య	659	660	672	662	
	మొత్తం			20.89						

ఈ భూమి ప్లాను శ్రీయుత సబ్‌కలెక్టర్, కందుకూరు వారి కార్యాలయంలో ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైనా తనిఖీ చేసుకొనవచ్చును.
బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గానీ లేదా ఒక ప్రత్యేక భాగములో గానీ ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగమును మాత్రమే త్రవ్వట గానీ తొలగించుట గానీ చేయవలెను.
సం/- హరినారాయణన్.యం., కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

నన్ను చంపడానికే దాడి చేశారు

దీన్ని చిన్నదిగా చూడొద్దు

- దాడి వెనుక పెద్ద కుట్ర ఉంది
- నన్ను లేకుండా చేస్తే కులోన్మాదులు రూ.50 లక్షలు ఇస్తామన్నారు
- పవన్ పీకే కాదు.. కిరాయి కోటిగాడు
- మంత్రి అంబటి రాంబాబు



నగరంపాలెం (గుంటూరు వెస్ట్): ఇటీవల ఖమ్మంలో తనను చంపడానికే దాడి చేశారని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ దాడిని చిన్నదిగా చూడొద్దన్నారు. దీని వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు. గతంలో జరిగిన చంద్రబాబు కులోన్మాదుల వనభోజనాల్లోనే తనను చంపితే రూ.50 లక్షలు ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. గుంటూరు విద్యానగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం మంత్రి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఖమ్మంలో తనపై దాడి చేసిన తొమ్మిది మందిని పోలీసులు గుర్తించారని.. వారిలో ఆరుగురిని అరెస్టు చేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారంతా ఒక సామాజికవర్గానికి చెందిన వారేనని ఆరోపించారు. కమ్మవారిలో కొందరు ఉగ్రవాదులు ఉన్నారని.. వారు టీడీపీని నాశనం చేయబోతున్నారన్నారు. తాను ప్రత్యర్థి పార్టీల నేతలను ఘాటుగా విమర్శిస్తాను తప్ప బూతులు తిట్టనని వెల్లడించారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని వారి సామాజికవర్గం వారే తిట్టి శాసనసభలో తాను తిట్టినట్టు బురద జల్లారన్నారు. అప్పటి నుంచే తనను చంపడానికి కుట్రలు మొదలు పెట్టారని ఆరోపించారు. ఈ మేరకు ఏబీఎన్ రాధాకృష్ణ కుట్రలు చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు తాను ముందుకు వెళ్తానని.. ఎవరూ తనను ఏమీ చేయలేరని తెలిపారు. పక్కాగా దొరకడం వల్లే చంద్రబాబుకు బెయిల్ మంజూరు కాలేదన్నారు. పవన్ కళ్యాణ్ పీకే కాదని కిరాయి కోటిగాడు (కేకే) అని మండిపడ్డారు. గత చంద్రబాబు ప్రభుత్వం ముద్రగడ పద్మనాభంను అతి దారుణంగా హింసించి జైల్లో ఉంచినప్పుడు పవన్ ఎక్కడున్నాడని ప్రశ్నించారు. ఖమ్మం ఘటనలో తాను గన్‌మెన్‌లతో దాడి చేయించానని 'ఈనాడు'లో రాయడంపై మండిపడ్డారు. ఈ వయసులో రామోజీరావుకి ఏం పోయే కాలం వచ్చిందని అవాస్తవాలు రాస్తున్నారని ధ్వజమెత్తారు.

బాబును అరెస్టు చేస్తే పవన్ రోడ్డుపై పడుకోవడం ఏంటి?: ఉమ్మారెడ్డి



శాసనమండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారా భువనేశ్వరి తన భర్త సత్యహరిశ్చంద్రుడని చెబుతున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్టీఆర్‌ను అధికారం నుంచి బయటకు నెట్టినప్పుడు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్ట్ అక్రమమని పురందేశ్వరి మాట్లాడుతున్నారు తప్ప మిగతా బీజేపీ నేతలు దీనిపై స్పందించడం లేదని గుర్తు చేశారు. చంద్రబాబును అరెస్టు చేస్తే పవన్ కళ్యాణ్ రోడ్డుపై పడుకోవడం ఏంటన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఉత్తర అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్, మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

1988 నుంచి కాపులపై హత్యాకాండలు, దాడులు

- మంత్రి అంబటిని భౌతికంగా లేకుండా చేస్తే.. రూ.50 లక్షలు ఇస్తారట
- నాడు వంగవీటి మోహనరంగానూ మట్టుబెట్టారు..
- కాపులపై ఒక సామాజికవర్గం దుశ్చర్యలు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

నగరంపాలెం(గుంటూరువెస్ట్): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఇది కాపు సామాజికవర్గంపై దాడిగా పరిగణిస్తున్నట్టు చెప్పారు. అంబటి రాంబాబుకు అండగా, తోడుగా, మద్దతుగా మాట్లాడేందుకు గుంటూరులోని ఆయన క్యాంప్ కార్యాలయానికి వచ్చినట్టు చెప్పారు. అంబటిపై జరిగిన దాడిని యావత్తు ఏపీ ప్రజలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనపై ఏపీ అంతటా కులాలకతీతంగా నిరసన కార్యక్రమాలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. అంబటిని భౌతికంగా లేకుండా చేస్తే రూ.50 లక్షలు డొనేట్ చేస్తామంటూ అనేక వేదికలపై మాట్లాడటాన్ని చూస్తే.. ఆ సామాజిక వర్గానికి ఎంత కండకావరమో అర్థమవుతోందన్నారు. 1988లో వంగవీటి మోహన్‌రంగాను చంపిన సందర్భం నుంచి కాపులపై జరుగుతున్న దాడులపై ఆయన మండిపడ్డారు. గతంలో కాపుల అభివృద్ధి, సంక్షేమం కోసం పోరాడిన ముద్రగడ పద్మనాభంను చంపాలని చూశారని, వారిని వారి కుటుంబ సభ్యులను నిర్బంధించి, వ్యక్తిగతంగా దాడులకు తెగబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.



కాపులపై దాడులు జరుగుతుంటే పవన్ ఎందుకు మాట్లాడరు?

అంబటిపై దాడి చేసినప్పుడు, ముద్రగడ కుటుంబాన్ని హింసించినప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రూ.350 కోట్లు స్కాం చేసి అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబును పరామర్శించేందుకు పవన్ వెళ్లారని, ముద్రగడ పద్మనాభం కుటుంబంపై దాడిపై పవన్ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. చివరికి చిరంజీవి, దాసరి నారాయణరావులు ముద్రగడను పరామర్శించినా పవన్‌లో కదలికలేదన్నారు. కాపు సామాజిక వర్గంలో 70 శాతం మంది వైఎస్సార్‌సీపీలోనే ఉన్నారని తెలిపారు. మంత్రివర్గంలో ఐదుగురు, జెడ్పీ చైర్మన్లు, మేయర్లు ఇతరత్రా పదవుల్లో అనేక మంది కాపులున్నట్టు చెప్పారు. కాపులకు రాజ్యాధికారం ఇచ్చింది.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కాపు కార్పొరేషన్ అధ్యక్షుడు అడపా శేషు, మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ఉమ్మడి జిల్లాలోని కాపు నాయకులు మంత్రి అంబటికి మద్దగా నిలిచారు.

టీడీపీ తీరుతో నివ్వెరపోతున్న జనం

సాధారణ మరణాలూ చంద్రబాబు అరెస్టు ఖాతాలోకే..

ఏర్పేడు(తిరుపతి జిల్లా): సాధారణ మరణాలను సైతం చంద్రబాబు అరెస్టు ఖాతాలోకి జమ చేస్తుండటంతో ప్రజలు నివ్వెర పోతున్నారు. తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని గుండ్లకండ్రిగ గ్రామానికి చెందిన సుబ్బుకృష్ణయ్య (60) ఆస్తమాతో బాధపడుతూ 15 రోజుల కిందట తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అనారోగ్యంతోపాటు చంద్రబాబు నాయుడు అరెస్ట్ కారణంగా ఆవేదనకు గురికావడం వల్ల 4 రోజుల కిందట గుండెపోటుకుగురై తిరుపతిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బుకృష్ణయ్య మరణించినట్లు సోమవారం ఈనాడులో కథనం ప్రచురితమైంది. అలాగే అక్టోబర్ 15న మునగలపాళెం గ్రామానికి చెందిన వసంతమ్మ వికృతమాల డిక్షన్ కర్మాగారంలో విధులు ముగించుకుని వస్తుండగా దారిలో గుండె పోటుతో మరణించింది. ఆమె కూడా చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో మృతిచెందినట్లు కథనం ప్రచురితమైంది.

10,110 కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల్లో వెలుగులు

- కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి సీఎం జగన్ ఆనందం నింపారు
- సామాజిక సాధికార యాత్రలో నేతలతో ముఖాముఖిలో కాంట్రాక్టు కార్మికుల హర్షం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగాల్లో మగ్గిపోతున్న 10,110 కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెలుగులు నింపారని కాంట్రాక్టు ఉద్యోగుల ప్రతినిధి, ఏలూరు జిల్లా పెదవేగి పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ కె.రామకృష్ణ చెప్పారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా ఏలూరు విచ్చేసిన పలువురు ప్రజా ప్రతినిధులు ఇటీవల రెగ్యులర్ అయిన కాంట్రాక్టు ఉద్యోగులు, కొల్లేరు ప్రజల ప్రతినిధులతో సోమవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 2003లో చంద్రబాబు ప్రభుత్వ ఉద్యోగాల్లో కాంట్రాక్టు అనే పదాన్ని తెచ్చి పేదవాడి బతుకు ఛిద్రం చేశారన్నారు. అర్హత ఉన్నా కాంట్రాక్టు ఉద్యోగులుగా అరకొర జీతాలతో, విలువ లేని జీవితాలతో 20 ఏళ్ల పాటు ఊడిగం చేయించుకున్నారని తెలిపారు. ఆ పాపాలు ఎక్కడికీ పోలేదని చంద్రబాబు నుద్దేశించి అన్నారు. తమ ఆవేదనను అర్థం చేసుకున్న సీఎం వైఎస్ జగన్ తమను రెగ్యులర్ చేశారన్నారు. ఈ రోజు తాము కూడా ప్రభుత్వ ఉద్యోగులమేనని కాలర్ ఎగరేసుకుని తిరుగుతున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ప్రకటించినవే కాక ప్రకటించని నవరత్నాలు లెక్కలేనన్ని అమలు చేస్తున్నారని గోపన్నపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.మహేష్‌బాబు చెప్పారు. కోవిడ్ సమయంలో సీఎంగా జగన్ లేకపోతే ఎంతమంది చనిపోయేవారో, ఎన్ని కుటుంబాలు నిరాశ్రయులయ్యేవో తలచుకుంటేనే భయం వేస్తోందన్నారు.



కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రులు కారుమూరి, మేరుగ, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు


గోపన్నపాలెంలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రులు విశ్వరూప్, కారుమూరి, ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

రాష్ట్రంలో సామాజిక న్యాయం

వెల్లివిరుస్తోంది

ఇది సీఎం జగన్ ఘనత • బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం

పేదవారిని ప్రజాప్రతినిధులుగా మారుస్తున్నారు

విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారు

దెందులూరు సామాజిక సాధికార సభలో మంత్రి రజిని


ఏలూరు జిల్లా గోపన్నపాలెంలో బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రాష్ట్రంలో సామాజిక న్యాయం వెల్లివిరుస్తోందని, ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళల సాధికారత సీఎం జగన్ ఘనతేనని తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా సోమవారం ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలో జరిగిన సభలో మంత్రి రజిని మాట్లాడారు. సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. పేదవారిని ప్రజాప్రతినిధులుగా మారుస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం సహా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని చేరువ చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నారని, ఏలూరులోనూ రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో వార్డు మెంబరు కావాలంటే పెత్తందారుల వద్ద ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, ఆ స్థితి నుంచి సీఎం జగన్ బయటకు తీసుకువచ్చి చట్ట సభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అందలం ఎక్కిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చెప్పారు. రాష్ట్రంలో 25 మంది మంత్రులు ఉంటే వారిలో 17 మంది ఈ వర్గాలకు చెందిన వారే ఉన్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, మహిళలంతా కలిసి వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగనన్నకు విజయం చేకూర్చాలని కోరారు. సీఎం జగన్ బయటకు రాకపోయినా ఆయన కటౌట్‌ను చూసి 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్రకు జనం తరలివస్తున్నారని చెప్పారు.

■ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ గతంలో సామాజిక న్యాయం కోసం అనేక మంది ఉద్యమాలు చేశారని, వారి ఆశయాలను ఇప్పుడు సీఎం జగన్ నెరవేర్చారని చెప్పారు. దళిత కులంలో పుట్టాలనుకుంటారా.. అనే మాటలు గతంలో ఓ సీఎం నుంచి విన్నామని, కానీ ప్రస్తుతం వెనుకబడిన వర్గాలకు, దళితులకు, మైనార్టీలను అందలం ఎక్కిస్తున్న సీఎంను చూస్తున్నామని తెలిపారు. సీఎం జగన్ వల్ల దళిత, బలహీన వర్గాలకు ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ వంటి చదువులు అందుతున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేని పేకాటరాయుడు, అవినీతిపరుడు, దళిత ద్రోహి అని ఆయన ధ్వజమెత్తారు.

■ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సాధికారత సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. 2014లో చంద్రబాబు ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో కేవలం ఆయనకు చెందిన వారికి మాత్రమే పనులు చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మాత్రం కులం, మతం, పార్టీ చూడటంలేదని, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినవారికి, వేయనివారికి కూడా న్యాయం చేస్తున్నారని, కలెక్టర్ల సమావేశంలో కూడా ఇవే ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జగన్ పాదయాత్రలో చెప్పిన పనులు, చెప్పని పనులు కూడా చేశారన్నారు. నాలుగున్నరేళ్లలో దెందులూరులో రూ.2,800 కోట్లతో అభివృద్ధి జరిగిందన్నారు. నిన్న హైదరాబాద్‌లో ఒక సామాజికవర్గ సమావేశం జరిగిందని, దానిలో ఎస్సీ, బీసీలు ఎవరూ పాల్గొనలేదని చెప్పారు.

■ గతంలో పేదలపై పెత్తనం జరిగేదని, ఇప్పుడు అదే పేదలకు పదవులు వస్తున్నాయని ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. సీఎం జగన్ వల్ల పేద వర్గాలు చట్టసభల్లో అడుగుపెడుతున్నాయని, ఇందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. అక్రమ కేసులతో దళితులను జైళ్లలో పెట్టిన చరిత్ర చంద్రబాబుదన్నారు. దళితులు, బీసీలు, మైనార్టీలు జైళ్ళలో కాదు చట్టసభల్లో ఉండాలని భావించిన వ్యక్తి వైఎస్ జగన్ అని తెలిపారు.

> “ విజయవాడలో ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం చూస్తుంటే అందరికీ ఒక విషయం అర్థం అవుతుంది. సీఎం వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి పరుస్తూ సామాజిక సాధికారత సాధిస్తున్నారు. అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలను నిజం చేస్తున్నారు. అందుకే.. తన ఆలోచనలు, ఆశయాలు కలిగిన వ్యక్తి తాడేపల్లిలో ఉన్నారని అంబేడ్కర్ వేలు ఆ వైపు చూపిస్తున్నారు.
>
> – నందిగం సురేష్, ఎంపీ

■ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో 11 వేల మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చామని, దెందులూరు గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డాగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాల్, ఎమ్మెల్సీలు పోతుల సునీత, కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకట రమణ, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్, మేకా వెంకట ప్రతాప అప్పారావు, దూలం నాగేశ్వరరావు, పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, ఎలీజా, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల గుండె చప్పుడు

సీఎం జగన్

నిరంతరం వారి అభ్యున్నతి కోసమే పాటు పడుతున్నారు

- బాక్సైట్ తవ్వకాల జీవో రద్దు చేసి మాట నిలబెట్టుకొన్నారు
- గిరిజనులకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారు
- డోలీ బాధల్లేకుండా గిరిజన ప్రాంతంలోనే మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు
- అంబేడ్కర్ ఆశయాలను సీఎం జగన్ ఆచరణలో చూపిస్తున్నారు
- చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గిరిజనుడికి డిప్యూటీ సీఎం పదవిచ్చారు
- పాడేరు సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సామాజిక సాధికార సభలో విల్లంబులు చేతబూనిన డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు కె.భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: నిరంతరం గిరిజనుల కోసం ఆలోచిస్తూ.. వారి అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల గుండె చప్పుడని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చెప్పారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో స్థానిక ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా సతకంపట్టు సెంటర్లో బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో గిరిజన ప్రాంతాలకు ఎవరు మేలు చేశారో బేరీజు వేసుకోవాలని రాజన్న దొర కోరారు. గిరిజన జాతిని అంతమొందించాలని, బాక్సైట్ ఖనిజాన్ని దోచుకోవాలన్న ఎత్తుగడతో గత చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమంగా బాక్సైట్ తవ్వకాలు చేపట్టారని తెలిపారు. ఈ కుట్రను గమనించిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఈ తవ్వకాల జీవో రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన వెంటనే మాట నిలబెట్టుకొన్నారని చెప్పారు. ఆ జీవో రద్దు ద్వారా గిరిజనులను కాపాడారని, అంతేకాకుండా ఈ ప్రాంతం, గిరిజనుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. గిరిజనులకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అనారోగ్యం పాలైన గిరిజనులను డోలీలో మోసుకొని వెళ్లాల్సిన దుస్థితి లేకుండా గిరిజన ప్రాంతంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్ ఆచరణలో చూపిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు గిరిజనులకు ఒక్క మంత్రి పదవైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. అంతేకాకుండా టీడీపీ హయాంలో గిరిజన సహకార సంస్థ, ఎస్టీ కార్పొరేషన్‌లే లేవన్నారు. వాటి కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము పోరాటాలు చేశామని, న్యాయస్థానాలను ఆశ్రయించామని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజనుల కోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలోనే దాదాపు రూ. 20 వేల కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు చెప్పారు. త్వరలో పాడేరులో వైద్య కళాశాల, అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభమవుతాయని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. గిరిజనుల అభ్యున్నతి కోసం పాటుపడిన సీఎం వైఎస్ జగన్‌ను ఎప్పటికీ మరువలేమని ఎంపీ గొడ్డేటి మాధవి చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కుంభా రవిబాబు, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కంబాల జోగులు, నవరత్నాల కమిటీ చైర్మన్ ఎ.నారాయణమూర్తి, మాజీ మంత్రి బాలరాజు, పాడేరు నియోజకవర్గ పరిశీలకుడు ఐ.హెచ్ ఫారూఖీ, జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో బహిరంగ సభకు హాజరైన జనవాహినిలో ఓ భాగం

రూ.20 వేల కోట్లతో గిరిజన సంక్షేమం

సీఎం జగనన్న తండ్రి వైఎస్సార్‌ని మించిన సంక్షేమ పాలన అందిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి చెప్పారు. ‘ఈ నాలుగున్నరేళ్లలో దాదాపు రూ. 20 వేల కోట్లు గిరిజనులు, గిరిజన ప్రాంతాల సంక్షేమానికి అందించారు. అత్యాధునిక వైద్యాన్ని గిరిజనులకు చేరువ చేయడానికి ఇక్కడ రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. 1.30 లక్షల మంది గిరిజనులకు పట్టాలిచ్చారు. ఎన్ఆర్‌జీఎస్ పథకంలో రూ. 650 కోట్లతో రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. గిరి బతుకులకు ఉన్నత స్థితి కల్పించారు. డొనూరులో రూ. 4 కోట్లతో వాణిజ్య పంటలైన రాజ్‌మా, పసుపు, పిప్పళ్లు, కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇలా గిరిజనుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు’ అని చెప్పారు.

– భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి సామాజిక సాధికార బహిరంగ సభకు హాజరైన జన సందోహంలో ఓ భాగం

సామాజిక న్యాయాన్ని

ఇప్పుడే చూస్తున్నాం

అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి

అంబేడ్కర్ అసలైన వారసుడు సీఎం జగన్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం కల్పించారు..

స్థానిక సంస్థల నుంచి పెద్దల సభ వరకు పెద్ద పీట వేశారు

ఉదయగిరి సామాజిక సాధికార సభలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

అంటరానివారు నేడు తలెత్తుకొని తిరుగుతున్నారు: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి

సాక్షి ప్రతినిధి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు: సామాజిక న్యాయాన్ని ఇప్పుడే చూస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నారని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళల సాధికారతకు కృషి చేసిన అసలైన అంబేడ్కర్ వారసుడిగా నిలిచారని తెలిపారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య చరిత్రలో అన్ని పార్టీల నాయకులు ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నారని, ఈ వర్గాలకు నిజమైన రాజ్యాధికారం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. స్థానిక సంస్థల నుంచి పెద్దల సభ వరకు అన్ని స్థాయిల్లోనూ ఈ వర్గాలకు పెద్దపీట వేశారని తెలిపారు. మరో డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ అంటరానివారుగా అనేక కాలాల పాటు అవమానాలు ఎదుర్కొన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నేడు సగర్వంగా తలెత్తుకొని తిరుగుతున్నారంటే అది సీఎం జగన్ పాటించిన సామాజిక న్యాయమని తెలిపారు. భావితరాలకు, బడుగు, బలహీనవర్గాలకు జగన్ దేవుడులాంటి వారన్నారు.

సామాజిక న్యాయం చేసిన ఏకైక నేత సీఎం జగన్ : ఎంపీ మస్తాన్‌రావు

దేశంలో సామాజిక న్యాయం చేసిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అని రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్‌రావు చెప్పారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితంలో బీసీలకు ఉన్నత పదవులు ఇవ్వలేకపోయారని, 4 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. అంబేడ్కర్ ప్రవచించిన రాజ్యాంగ విలువలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి ఎంతో కృషి : మేకపాటి

నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి నియోజకర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ఉదయగిరి ప్రాంతంలో విద్యాభివృద్ధికి ఇంజినీరింగ్ కళాశాల, డిగ్రీ కాలేజీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. మారుమూల ప్రాంతాల రవాణా కోసం తారురోడ్లను వేశారన్నారు. రూ.9 కోట్లతో ఉదయగిరి ట్యాంక్‌బండ్ ఆధునీకరణ జరుగుతోందని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌కు రూ.250 కోట్లు మంజూరు చేశారని, ప్రస్తుతం నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. మేకపాటి కుటుంబం 40 ఎకరాల సొంత స్థలం ఇచ్చి నవోదయ కాలేజీ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిందని అన్నారు. దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి పేరుతో ప్రభుత్వ వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రూ.250 కోట్ల విలువ చేసే ఆస్తులను ప్రభుత్వానికి అప్పగించామని తెలిపారు.

మనం, మన సీఎం ఓ వైపు.. వెన్నుపోటు దారులు మరో వైపు: ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సామాజిక న్యాయానికి జగన్ ప్రభుత్వం పేటెంట్ హక్కులు కలిగి ఉందని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. 2024 ఎన్నికల కురుక్షేత్రంలో మనం, మన సీఎం ఒకవైపు, దుష్ట చతుష్టయం, వెన్నుపోటుదారులు ఇంకోవైపు పోరాడాల్సి వస్తుందన్నారు. నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ, నా మైనార్టీ అంటూ అన్ని సామాజికవర్గాలకు, పేదలకు అండగా నిలిచిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ప్రభుత్వం ఇళ్లు కట్టిస్తే అందులో 20 లక్షల మంది బడుగు, బలహీనవర్గాల వర్గాలేనని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉండగా బీసీలు, ఎస్సీలు తీర్పులివ్వడానికి పనికిరారని చంద్రబాబు లేఖలు రాశాడన్నారు. 16 నెలలు అన్యాయంగా జగన్‌మోహన్‌రెడ్డి జైలులో ఉంటే లాయర్లను దేవతలు, దేవుళ్లుగా పొగిడినవారు 13 సంతకాలతో అడ్డంగా దొరికి చంద్రబాబు జైలుకెళ్లగానే వారిని దెయ్యాలుగా పోల్చి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మేయర్ పొట్లూరు స్రవంతి, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

వర్సిటీల్లో ఖాళీల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎస్సీ, ఎస్టీ, పీబీడీలు (పర్సన్ బెంచ్ మార్క్ విత్ డిజేబిలిటీ) రూ.2 వేలు, ప్రవాస భారతీయులైతే 50 డాలర్లు/రూ.4.200 ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పాటు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ ఒకటి కంటే ఎక్కువ విభాగాల్లో టెస్టులు రాయాలనుకుంటే మాత్రం విడివిడిగా ఫీజులు చెల్లించాలి. ఇక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు అన్ని కేటగిరీల అభ్యర్థులు రూ.3 వేలు, ప్రవాస భారతీయులైతే ప్రొఫెసర్ పోస్టుకు రూ.150 డాలర్లు/రూ.12,600, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు 100 డాలర్లు/రూ.8,400 దరఖాస్తు రుసుము చెల్లించాలి. అభ్యర్థుల దరఖాస్తు కోసం http://recruitments.universities.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది. వర్సిటీల వారీగా అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకురానుంది. ఆయా పోస్టులకు స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తేదీలను దరఖాస్తు పరిశీలన అనంతరం వెల్లడించనుంది.

10 మార్కులు వెయిటేజీ ఇలా..

విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కుల వెయిటేజీ కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. అయితే.. కాంట్రాక్ట్ అధ్యాపకుల్లో ఎక్కువ మంది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్స్ కింద పని చేస్తున్నారు. ప్రస్తుతం చేపట్టే పోస్టుల భర్తీ ప్రక్రియలోకి వీరు రావట్లేదు. ఫలితంగా వారి విధులకు ఎటువంటి ఆటకం ఉండదు. మిగిలిన అభ్యర్థులు ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే వారి అనుభవాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది.

బాబు భర్తీ చేసింది ‘సున్నా’

చంద్రబాబు అధికారంలో ఉన్న మొదటి తొమ్మిదేళ్లు అంటే 1995 నుంచి 2004 వరకు.. రాష్ట్రం విడిపోయాక 2014 నుంచి 2019 వరకూ విశ్వవిద్యాలయాల్లో ఒక్క పోస్టును కూడా భర్తీ చేయలేదు. ఫలితంగా విశ్వవిద్యాలయాల్లో 71 శాతం అధ్యాపక పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండిపోయాయి. గత ఎన్నికలకు ముందు అప్పటి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల పాలక మండళ్ల తీర్మానంతో పోస్టుల భర్తీ చేపట్టినా నోటిఫికేషన్ ప్రక్రియ గందరగోళాన్ని సృష్టించింది. రోస్టర్ విధానం, హేతుబద్ధీకరణ, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ విషయంలో తమకు నష్టం జరుగుతోందంటూ అనేక మంది అభ్యర్థులు కోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలు చేయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కనీసం కోర్టు కేసులను కూడా పరిష్కరించాలనే ఆలోచన కూడా చంద్రబాబు ప్రభుత్వం చేయకపోవడం గమనార్హం. ఇక్కడ యూజీసీ నిబంధనలను గాలికొదిలేసి, అనుయాయులకు మేలు చేసేలా అశాస్త్రీయ పద్ధతిలో హేతుబద్ధీకరణ చేశారు. వర్సిటీలను సంప్రదించకుండా.. వాటి అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా పోస్టులను ఇష్టం వచ్చినట్టు మార్చేశారు. కొన్నిచోట్ల అవసరానికి మించి ఎక్కువ పోస్టులు చూపించారు. కొందరికి లబ్ధి చేకూర్చేందుకు పోస్టుల స్థాయి తగ్గించేశారు. యూనివర్సిటీ యూనిట్‌గా కాకుండా సబ్జెక్టుల వారీగా పోస్టులను హేతుబద్ధీకరించడంతో చాలామంది నష్టపోయారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పూర్తిగా విస్మరించారు.

బోధనేతర పోస్టులకూ ప్రాధాన్యం

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత యూనివర్సిటీల పునరుజ్జీవానికి చర్యలు చేపట్టారు. కోర్టు కేసులను ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ యుద్ధప్రాతిపదికన పెద్దఎత్తున శాశ్వత పోస్టుల భర్తీని చేపట్టారు. యూనివర్సిటీల్లో పని భారం, కేడర్ నిష్పత్తికి అనుగుణంగా ఫ్యాకల్టీని ప్రభుత్వం హేతుబద్ధీకరించింది. యూనివర్సిటీలతో సంప్రదింపులు జరిపిన అనంతరం విభాగాల వారీగా పోస్టుల హేతుబద్ధీకరణ చేసింది. ఫలితంగా మొత్తం 18 యూనివర్సిటీల్లో 4,330 పోస్టులొచ్చాయి. వీటిల్లో ఇప్పటికే పని చేస్తున్న అధ్యాపకులు కాకుండా తాజాగా 3,200 మందిని నియమిస్తోంది. ఇక బోధన పోస్టులతోపాటు ప్రతి యూనివర్సిటీలో అకడమిక్ నాన్ వెకేషన్ పోస్టులు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసిస్టెంట్ డైరెక్టర్/డిప్యూటీ డైరెక్టర్/ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ డైరెక్టర్, అసిస్టెంట్ లైబ్రేరియన్/డిప్యూటీ లైబ్రేరియన్/వర్సిటీ లైబ్రేరియన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్, నాక్ గుర్తింపులో కీలక భూమిక పోషించే ఐక్యూఏసీ డైరెక్టర్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పోస్టులను తప్పనిసరి చేసింది.

దరఖాస్తులకు గడువు ఇలా..

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు, ఫీజు చెల్లింపునకు తుది గడువు: 20.11.2023
- పోస్టు ద్వారా దరఖాస్తు కాపీ, ఇతర పత్రాల సమర్పణ గడువు: 27.11.2023
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు నిర్వహించే స్క్రీనింగ్ టెస్ట్‌కు అర్హులు, అనర్హుల ప్రాథమిక జాబితా ప్రదర్శన: 30.11.2023
- అభ్యంతరాల స్వీకరణ: 07.12.2023
- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్ స్క్రీనింగ్ టెస్టుకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన: 08.12.2023

వర్సిటీల్లో కొత్తగా రెగ్యులర్+బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ఇలా..

వర్సిటీ	అసిస్టెంట్ ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	ప్రొఫెసర్	మొత్తం
ఆదికవి నన్నయ	57+3	20+5	14	99
అబ్దుల్ హక్ ఉర్దూ	36	18	9	63
విక్రమ సింహపురి	46+5	28+8	19	106
ఏయూ	294+5	130+9	85	523
ఎస్వీ	156+2	50+13	44	265
ఆర్జీయూకేటీ	195+66	84+37	58	660 (220 లెక్చరర్ పోస్టులతో కలిపి)
వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్	81	36	16	133
నాన్ టీచింగ్	2	2	1	5
కృష్ణా	45+3	23+4	9	84
నాన్ టీచింగ్	2	0	0	2
బీఆర్ అంబేడ్కర్	59+2	22+2	13	98
నాన్‌టీచింగ్	1	0	0	1
రాయలసీమ	62	28	11	101
నాన్ టీచింగ్	2	0	0	2
పద్మావతి మహిళా	48+1	32+5	17	103
శ్రీకృష్ణదేవరాయ	107+18	58+4	32	219
ద్రవిడియన్	7	4+5	7	23
నాన్ టీచింగ్	0	0	1	1
ఆచార్య నాగార్జున	91+1	57	26	175
యోగి వేమన	24+19	22+24	26	115
నాన్‌టీచింగ్	0	2	1	3
జేఎన్‌టీయూ గురజాడ	99+4	14+6	11	134
నాన్ టీచింగ్	4	0	0	4
జేఎన్‌టీయూ కాకినాడ	67+3	12+5	11	98
జేఎన్‌టీయూ అనంతపురం	157+3	16+16	7	199
నాన్ టీచింగ్	1+3	0	0	4

జగనన్న ఆరోగ్య సురక్ష

జగనన్న ఆరోగ్య సురక్ష

22 వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు	12,709
నమోదైన ఓపీలు	55,70,705
నిర్వహించిన వైద్య పరీక్షలు	6,37,83,851
మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య	81,816



చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్



ప్రకాశం జిల్లా దర్శి 4వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు



పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వీరవెంకటేష్

కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కాటూరులో చిన్నారికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు వెలివెల రాజేశ్వరి





శ్రీకాకుళం జిల్లా మందస మండలం హరిపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న బుడంబో పీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్‌దొర

అవినీతి మహమ్మారిని తరిమేద్దాం..

హైకోర్టు జడ్జి జస్టిస్ దుర్గాప్రసాద్



తిరుపతి సిటీ: అవినీతి మహమ్మారిని కలసికట్టుగా తరిమికొట్టాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం సంస్కృత విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2023 సదస్సును ఆయన ప్రారంభించారు. నవంబర్ 5వ తేదీ వరకు కొనసాగనున్న కార్యక్రమంలో జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. జడ్జిగా తాను విచారించిన అవినీతి కేసులు.. పడిన శిక్షలను ఉదహరించారు. అవినీతి నిరోధక చట్టం 1947కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ జీఎస్సార్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. కార్యక్రమాలు విజయవంతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. న్యాయవాదులు కే అజయ్‌కుమార్, పసల పొన్నారావు, విశ్వవిద్యాలయ డీన్ రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషమని, ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టిందని ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ హారన్ కొట్టినందుకు ప్రభుత్వ ఉద్యోగి రామ్‌సింగ్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీరియస్ అయ్యారని, దాడి చేసినవారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారని, మిగిలినవారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడిగా ఉన్న సుధీర్ గతంలో అక్కడి ఎమ్మెల్యే కారుపైనా దాడి చేశారని తెలిపారు. ఇలాంటి నేరస్తులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఉద్యోగులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సీఎం జగన్ ఎప్పుడూ సానుకూలంగా స్పందిస్తారని చెప్పారు. ఏపీ ఎన్జీవో మహాసభల్లో ప్రకటించిన విధంగా ఒక డీఏ విడుదల చేశారని, పీఆర్సీ కూడా అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం ద్వారా తాను ఉద్యోగుల పక్షపాతినని సీఎం రుజువు చేసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం విజయవాడలోని విద్యాధరపురం ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ రామ్‌సింగ్‌ను ఎన్జీవో సంఘం నేతలు బండి శ్రీనివాసరావు, శివారెడ్డి తదితరులతో కలిసి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించి ధైర్యం చెప్పారు.

జైల్లో బాబు.. ఉత్సవాల్లో నేతలు

- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ఎద్దేవా
- జైల్లో 50 రోజులు పూర్తి సందర్భంగా టీడీపీ నేతల డ్రామాలు
- గచ్చిబౌలి మ్యూజికల్ ఈవెంట్ స్టేజీపై బాగా నటించారు
- టీడీపీకి బలముంటే తెలంగాణలో ఎందుకు పోటీచేయడంలేదు?



సాక్షి, అమరావతి: స్కిల్ స్కాంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ఏసీబీ కోర్టు రాజమండ్రి కేంద్ర కారాగారానికి రిమాండ్‌పై పంపినప్పటి నుంచి టీడీపీ నేతలు పండగలు, ఉత్సవాలు చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. రిమాండ్‌పై జైల్లో చంద్రబాబు 50 రోజులు పూర్తిచేసుకోవడంతో ఆదివారం టీడీపీ నేతల డ్రామాలు పరాకాష్టకు చేరుకున్నాయని.. అర్ధశతదినోత్సవం చేసుకున్నారంటూ వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అర్ధశతదినోత్సవంలో భాగంగా చంద్రబాబుకు మద్దతు తెలుపుతూ హైదరాబాద్‌లో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన సభ ద్వారా టీడీపీ అంటే దోపిడీదారుల పార్టీ అని ఆపార్టీ నేతలే చాటిచెప్పారంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు. మ్యూజికల్ ఈవెంట్‌కు ముందే రిహార్సల్స్ చేసిన వారిలా స్టేజీపై బాగా నటించారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తెలంగాణలో టీడీపీకి అంత బలమే ఉంటే.. అక్కడ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి.. దేశ చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లోకి రూ. 2.38 లక్షల కోట్లను జమచేయడమే కాదు.. సామాజిక న్యాయం నినాదం కాదు తమ విధానమని సీఎం జగన్ చాటిచెప్పారన్నారు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, అగ్రవర్ణ పేదల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఆదరణ నానాటికీ పెరుగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్రకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు నీరాజనం పలుకుతుండటమే అందుకు నిదర్శనమన్నారు. మీడియాతో మాట్లాడుతూ సజ్జల రామకృష్ణారెడ్డి ఇంకా ఏమన్నారంటే...

చంద్రబాబును రక్షించుకోవడం కోసమేనా టీడీపీ..

స్కిల్ స్కాంకు చంద్రబాబు పాల్పడ్డారని బలమైన సాక్ష్యాధారాలు తేల్చాకనే సీఐడీ ఆయన్ను అరెస్టు చేసింది. కేసు విచారణకు అడ్డంకులు కల్పించకుండా చంద్రబాబును ఏసీబీ కోర్టు రిమాండ్‌కు పంపింది. ఆర్థిక నేరానికి చంద్రబాబు పాల్పడకపోతే.. న్యాయస్థానాల్లో నిరూపించుకోవాలి. కానీ.. సాంకేతిక కారణాలనుచూపి కేసునుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజల తరఫున నిలబడి సేవచేసి, వారి మన్ననలుపొంది, అధికారంలోకి రావడం రాజకీయపార్టీ లక్షణం. కానీ బాబును కాపాడుకోవడానికే టీడీపీ నేతలు యత్నిస్తున్నారు.

అవినీతే చంద్రబాబు నీతి..

అవినీతే చంద్రబాబు నీతి. వంచనకు మరో పేరు చంద్రబాబు.. అబద్ధానికి చిరునామా చంద్రబాబు.. వ్యవస్థల్లోకి వైరస్‌లా దూరి మేనేజ్ చేయడంలో దిట్ట. చంద్రబాబు పాలుపోసి పెంచి పోషించిన విషసర్పాలు వ్యవస్థల నుంచి బయటకు వెళ్లిపోవడంతో మేనేజ్‌మెంట్‌కు తెరపడింది. అందువల్లే చంద్రబాబు రిమాండ్‌పై జైల్లో ఉన్నారు. చంద్రబాబు జైల్లో ఉండటంతో టీడీపీకి ఎవరు నాయకత్వం వహిస్తున్నారో ఆపార్టీ నేతలకే అర్థం కావడం లేదు. కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై రౌడీలు దాడి చేస్తే.. వైఎస్సార్‌సీపీ నేతలు దాడి చేశారని టీడీపీ నేతలు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రచారం చేశారు. దాడి చేసిన వారిని తక్షణమే పోలీసులు అరెస్టు చేశారు. వారంతా టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారులే. ఆ రౌడీలే కావలి ఎమ్మెల్యే కారుపై దాడి చేశారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు ఉన్నత వైద్యం

మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొప్ప కార్యక్రమాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ఒకటని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యాన్ని చేరువ చేయగలిగామని చెప్పారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ఒక్కో వైద్యశిబిరానికి సగటున 372 చొప్పున ఓపీ సేవలు నమోదవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అవసరమైన ప్రతి ఒక్కరు సక్రమంగా వినియోగించుకోవాలన్నదే సీఎం జగన్ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు, ఏఎన్‌ఎంలు వెళ్లి ఆరోగ్యశ్రీపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి ఇంటి వద్దే ప్రతి నెలా మందులు పంపిణీ చేసే ప్రక్రియపై సీఎం జగన్ ఆలోచిస్తున్నారని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ఇప్పటివరకు 1.4 లక్షల మధుమేహం కేసులు కొత్తగా వెలుగులోకి వచ్చాయని, వీరందరికీ పూర్తిస్థాయిలో షుగర్ నిర్ధారణ కోసం హెచ్‌బీఏ1సీ టెస్టులు చేయాలని సూచించారు. 2.25 లక్షల బీపీ కేసుల్ని కొత్తగా గుర్తించినట్లు చెప్పారు. వీరందరికీ ముందస్తుగానే వైద్యం అందించడం ద్వారా ఇతర వ్యాధుల బారినపడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంధిరప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి, డీఎంఈ నర్సింహం, డీహెచ్ రామిరెడ్డి పాల్గొన్నారు.

3వ తేదీకి కేబినెట్ భేటీ వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర కేబినెట్ సమావేశం నవంబర్ 3వ తేదీకి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే విజయనగరం జిల్లా రైలు ప్రమాద సహాయక చర్యల్లో కొందరు మంత్రులు నిమగ్నమై ఉన్నందున ఈ సమావేశాన్ని నవంబర్ 3వ తేదీకి ప్రభుత్వం వాయిదా వేసింది. 3వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్ కేబినెట్ సమావేశ మందిరంలో సమావేశం జరుగనుంది.

మేమొస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్

- 200 యూనిట్ల ఉచిత కరెంట్
- స్వయంసహాయక బృందాలకు రుణ మాఫీ
- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారసభలో ప్రియాంకా గాంధీ హామీ



జల్‌బంధా: ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్తగా మహతారీ న్యాయ్ యోజన పథకం ప్రారంభించి మహిళలకు రూ.500కే వంటగ్యాస్ అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంకా గాంధీ వాద్రా హామీ ఇచ్చారు. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జల్‌బంధాలో ఆమె ర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. ' మేం మళ్లీ అధికారంలోకి వస్తే దాదాపు 6,000 ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక, ఉన్నత పాఠశాలలను స్వామి ఆత్మానంద్ ఇంగ్లిష్, హిందీ మీడియం స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తాం. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తాం. స్వయం సహాయక బృందాలు, సాక్ష్యమ్ యోజన కింద రుణాల పొందిన వారి రుణాలను మాఫీ చేస్తాం. కొత్తగా 700 గ్రామీణ పారిశ్రామిక పార్కులను నెలకొల్పుతాం. దీంతో వీటి సంఖ్య ఏకంగా 1,000కి చేరుతుంది. తివారా రకం పప్పు ధాన్యాన్ని రైతుల నుంచి కనీస మద్దతు ధరకే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుచేయనుంది' అని ప్రియాంక పలు హామీ ప్రకటించారు. ' 2018 ఏడాది వరకు రాష్ట్రంలోని రవాణా రంగంతో సంబంధం ఉన్న 6,600 మందికిపైగా వాహన యజమానుల వాహన పన్నును మాఫీ చేస్తాం' అని ప్రకటించారు. వంట గ్యాస్‌పై మహిళలకు ఇచ్చే రూ.500 సబ్సిడీని నేరుగా వారి బ్యాంక్ ఖాతాలోనే జమచేస్తామని ర్యాలీ తర్వాత ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ పోస్ట్‌చేశారు.

పంచతంత్రం

మహిళలను తెలివితక్కువ వాళ్లుగా లెక్కగట్టారు

ర్యాలీ సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రభుత్వంపైనా ప్రియాంక నిప్పులు చెరిగారు. ' మధ్యప్రదేశ్‌లో 18 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. అయినా అక్కడ మహిళలకు దక్కిన హక్కులు, రక్షణ శూన్యం. హింస పెరిగింది. ఆ రాష్ట్రంలో రోజూ సగటున 17 అత్యాచారాలు నమోదవడం సిగ్గుచేటు. ఇన్నాళ్లూ మహిళలను గాలికొదిలేసిన చౌహాన్ సర్కార్ రెండు నెలల క్రితం లాడ్లీ బెహనా పథకం మొదలుపెట్టి మహిళల ఖాతాలోకి కొంత మొత్తం జమచేయడం షురూ చేసింది. ప్రభుత్వం అకస్మాత్తుగా మహిళలపై ప్రేమ ఒలకబోస్తోంది. ఎన్నికల వేళ ఆమాత్రం తెలుసుకోలేనంత తెలివితక్కువ వారిగా మహిళలను లెక్కగట్టింది' అని ప్రియాంక ఆరోపించారు.

మిజోరంలో జెడ్‌పీఎం జోరు!

కాంగ్రెస్, ఎంఎన్‌ఎఫ్‌లకు గుబులు • ఆసక్తికరంగా మారిన ఎన్నికల పోరు

ఈశాన్యాన బుల్లి రాష్ట్రం మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల పోరు ఈసారి ఆసక్తికరంగా మారింది. ప్రతి రెండు ఎన్నికలకు ఓసారి అధికార పార్టీని సాగనంపడం ఇక్కడి ప్రజలకు అలవాటు. అలా కాంగ్రెస్, మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్) వంతులవారీగా అధికారంలోకి వస్తూ ఉన్నాయి. కానీ ఈసారి జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) జోరుతో పోరు ఆసక్తికరంగా మారింది. దానికి తోడు గత రెండు దశాబ్దాలుగా ఇద్దరిని మాత్రమే సీఎంలుగా చూసిన రాష్ట్రానికి ఈసారి కొత్త ముఖాన్ని ఆ పాత్రలో చూసే అవకాశం దక్కుతుందా అన్నది కూడా ఆసక్తికరమే...


ప్రత్యేక రాష్ట్రం కోసం ఎంఎన్‌ఎఫ్ చేసిన పోరాటం ఫలించి 1987లో మిజోరం రాష్ట్రంగా ఏర్పడి నాటి నుంచి ఎంఎన్‌ఎఫ్, కాంగ్రెస్ మధ్యే అధికారం చేతులు మారుతూ వస్తోంది. ఈసారి పాలక ఎంఎన్‌ఎఫ్‌కే మొగ్గుందని భావిస్తున్నా కొత్తగా తెరపైకి వచ్చిన జెడ్‌పీఎం కాంగ్రెస్‌ను తోసిరాజని రెండో ప్రధాన పక్షంగా ఆవిర్భవించే దిశగా దూసుకెళ్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పలు పార్టీల కూటమిగా తెరపైకి వచ్చిన జెడ్‌పీఎం ఇప్పుడు ఒకే పార్టీగా రూపుదిద్దుకుంది. పార్టీగా ఈసీ గుర్తింపు రాకపోవడంతో స్వతంత్రులుగా బరిలోకి దిగి ఏకంగా ఆరు స్థానాలు నెగ్గి కాంగ్రెస్‌ను మూడో స్థానంలోకి నెట్టేసింది! ఈ ఐదేళ్లలో పట్టణ ప్రాంతాల్లో పట్టు సాధించడమే గాక యువతను బాగా ఆకట్టుకుంటోంది. పార్టీ అధ్యక్షుడైన మాజీ ఐపీఎస్ అధికారి లాల్‌డుహోమా (73)కు రాష్ట్రవ్యాప్తంగా అభిమానులున్నారు. మణిపూర్ హింసాకాండలో బాధితులుగా మారి రాష్ట్రం వీడిన కుకీ గిరిజనులకు ఆశ్రయం కల్పించడం తనకు బాగా కలిసొస్తుందని ఎంఎన్‌ఎఫ్ చీఫ్, సీఎం జోరాం తంగా లెక్కలేసుకుంటున్నారు. కానీ ఇదొక్కటే ఆ పార్టీని గట్టెక్కిస్తుందని చెప్పలేమంటున్నారు పరిశీలకులు. ఆయన హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందన్న అసంతృప్తి ప్రజల్లో బాగా ఉంది. అంతేగాక ఉపాధి కల్పన, చెప్పుకోదగ్గ సంక్షేమ పథకాల వంటివేవీ లేకపోవడం కూడా బాగా మైనస్‌గా మారుతోంది. ఈ క్రమంలో ప్రజలు జెడ్‌పీఎం వైపు చూస్తున్నట్టు కన్పిస్తోంది.

కాంగ్రెస్ పొత్తు వ్యూహం

జెడ్‌పీఎం ముప్పును గమనించిన కాంగ్రెస్ కాస్త వ్యూహం మార్చింది. పీపుల్స్ కాన్ఫరెన్స్, జోరాం నేషనలిస్ట్ పార్టీలతో ఈసారి జట్టు కట్టింది. ఓటర్ల మనోగతాన్ని మలచడంలో కీలక పాత్ర వహించే చర్చి, మిజోరం పీపుల్స్ ఫోరం మద్దతు కోసం పార్టీలన్నీ ప్రయత్నాల్లో మునిగి తేలుతున్నాయి. మూడు పార్టీలూ మొత్తం 40 స్థానాల్లోనూ బరిలో దిగాయి.

మహిళలకు మొండిచేయి

మిజోరం జనాభాలో క్రైస్తవులే మెజారిటీ. రాష్ట్రంలో పురుషుల కంటే స్త్రీల జనాభా ఎక్కువ కావడం మరో విశేషం! కానీ టికెట్ల కేటాయింపులో మాత్రం మహిళలకు మొండిచేయే ఎదురవుతూ వస్తోంది. మూడు పార్టీలూ కలిపి కూడా ఈసారి కేవలం ఆరుగురు మహిళలే బరిలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



పార్టీ	2018	2013
ఎంఎన్‌ఎఫ్	26	5
కాంగ్రెస్	5	34
జెడ్‌పీఎం	8	-
బీజేపీ	1	0
ఇతరులు	0	1

\- సాక్షి, నేషనల్ డెస్క్

50 ఎకరాలున్నా దారిద్ర్య రేఖ దిగువనే!

- చౌహాన్ సర్కార్ లంచాల ఫలితమిది
- కమల్‌నాథ్ ఆరోపణ

ఇండోర్: మధ్యప్రదేశ్‌లో శివరాజ్ సింగ్ చౌహాన్ సర్కార్ లంచాలకు బాగా అలవాటు పడిందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్‌నాథ్ ఆరోపించారు. ఇండోర్ జిల్లాలో పార్టీ అభ్యర్థుల నామినేషన్ల పర్వంలో పాల్గొన్న సందర్భంగా కమల్‌నాథ్ ఇండోర్ జిల్లాలో సోమవారం మాట్లాడారు. ' సీఎం చౌహాన్ మోసగాళ్లలో మేటి. 18 ఏళ్లుగా రాష్ట్ర ప్రజల్ని మోసంచేస్తున్నారు. రాష్ట్రంలో ఒక అవినీతి విధానాన్ని సృష్టించారు. డబ్బులివ్వండి.. పని చేయించుకోండి. నిన్న రాయ్‌సేన్, విదిష ప్రాంతాల్లో సందర్శించి స్థానికుల సమస్యల్ని ఆలకించా. 50 ఎకరాల భూమి ఉన్న వ్యక్తులు సైతం అధికారులకు లంచమిచ్చి తమ పేరును దారిద్ర్యరేఖకు దిగువ(బీపీఎల్) జాబితాలో చేర్పించుకునేంతగా లంచాల బాగోతం నడుస్తోందని అక్కడి స్థానికులు నాతో చెప్పారు. ఇది రాష్ట్రంలో లంచాల పరిస్థితికి దర్పణం పడుతోంది. రాష్ట్రాన్ని బీజేపీ నాశనం చేస్తోంది. విద్య, ఆరోగ్యం, పెట్టుబడులు.. ఒకటేమిటి ప్రతీ రంగాన్ని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. దీంతో రాష్ట్రంలో ఒక కోటి మంది నిరుద్యోగ యువత సమస్య తలెత్తింది' అని కమల్‌నాథ్ ఆరోపించారు.



సొంతూళ్లో సీఎం చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాజస్తాన్‌లో నామినేషన్లకు నోటిఫికేషన్ జారీ

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన జరిగే ఎన్నికలకు సోమవారం నామినేషన్ల ప్రక్రియ అధికారికంగా మొదలైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. నామినేషన్ల దాఖలుకు నవంబర్ 6 ఆఖరు తేదీ. నవంబర్ 7 తేదీ కల్లా నామినేషన్ల పరిశీలన పూర్తవుతుంది. ఉపసంహరణకు నవంబర్ 9 చివరి తేదీ. రాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం 200 సీట్లకు నవంబర్ 25వ తేదీన ఈవీఎంల ద్వారా ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3వ తేదీన చేపడతారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అదే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్ చేస్తే సరిపోతుంది. నామినేషన్ వేసేటప్పుడు రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థి వెంట నలుగురు కంటే ఎక్కువ మంది వెళ్లరాదు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్ల పరిధిలో అభ్యర్థి కాన్వాయ్‌లో మూడు వాహనాలకు మించి ఉండరాదు. నామినేషన్ పత్రాలను ఉదయం 11 గంటలు–మధ్యాహ్నం 3 గంటలకు మధ్యలో స్వీకరిస్తారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలను తు.చ తప్పక అమలు చేయాలని సీఈవో ప్రవీణ్ గుప్తా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యే వరకు రిటర్నింగ్ అధికారులు సంబంధిత కార్యాలయాల్లోనే ఉండాలని, ప్రక్రియను సరిగ్గా వీడియోగ్రాఫ్ చేయాలని సూచించారు. ఏ అభ్యర్థి అయినా ఒకే నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలు చేయవచ్చు, గరిష్ఠంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయవచ్చు.

బుధ్నిలో నామినేషన్ వేసిన సీఎం చౌహాన్

భోపాల్: బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం తన సొంత నియోజకవర్గం బుధ్నిలో నామినేషన్ వేశారు. ఆయన అంతకుముందు భార్య సాధనతో కలిసి సొంతూరు జయిట్‌లోని సల్కన్‌పూర్ దేవి ఆలయంలో పూజలు చేశారు. నామినేషన్ దాఖలు సందర్భంగా బుధ్నిలో భారీ ర్యాలీలో పాల్గొన్నారు. తన ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను చూసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. 'ఇది నా పుట్టిన ఊరు, పవిత్ర భూమి, మాతృభూమి..'అంటూ ఆయన ఉద్విగ్నంగా ప్రసంగించారు. నియోజకవర్గం ప్రజలు, పెద్దల ఆశీర్వాదంతోనే నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. బుధ్నిలో చౌహాన్ ప్రత్యర్థిగా కాంగ్రెస్‌కు చెందిన విక్రమ్ మస్తల్ బరిలో ఉన్నారు. ఈయన 2008లో తీసిన రామాయణ్ టీవీ సీరియల్‌లో హనుమాన్ పాత్ర పోషించారు. సీఎం చౌహాన్ బుధ్ని నుంచి గతంలో 1990, 2005, 2008, 2013, 2018 ఎన్నికల్లో గెలుపొందారు. ఈయన ఎంపీగా ఎన్నికైన విదిశా పార్లమెంట్ స్థానం పరిధిలోనిదే బుధ్ని నియోజకవర్గం. కాగా, నామినేషన్ల దాఖలుకు సోమవారంతో గడువు ముగియగా, ఉపసంహరణకు నవంబర్ 6 చివరి తేదీ.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.




ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.







స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మధుశంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం:** 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లఖ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మనుల్లా గుర్బాజ్ (బి) మధుశంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మధుశంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం:** 1–0, 2–73, 3–131. **బౌలింగ్:** మధుశంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా

కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

అమ్మాడీ...


● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఈఎ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్


● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ


● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ


● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్


● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.


● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్


● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
31-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	330	64,113
నిఫ్టీ ▲	94	19,141

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,736	▲ 95
డోజోన్స్	32,817	▲ 400
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,327	▲ 36
డాక్స్	14,717	▲ 29
షాంఘై	3,022	▲ 4
నికాయ్	30,697	▽ 295

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో

ముంబై	
బంగారం (24 క్యారట్)	60,980
బంగారం (22 క్యారట్)	58,080
వెండి (కేజీ)	78,500

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.50	84.17
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.32	102.67
€	యూరో	ఒకటి	86.49	89.54
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.85	56.54
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.93	54.22
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.93	61.86
SAR	సౌదీ రియాల్	ఐదు	21.24	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఐదు	21.77	23.56
¥	చైనా యువాన్	ఐదు	10.26	12.33

అన్ని ప్రైవేట్ కంపెనీల షేర్లు డీమ్యాట్‌లోనే..

- 2024 సెప్టెంబర్ నుంచి అమలు
- చిన్న సంస్థలు, ప్రభుత్వ కంపెనీలకు మినహాయింపు



న్యూఢిల్లీ: ప్రైవేట్ కంపెనీల సెక్యూరిటీల విషయంలో పారదర్శకతను పెంచే దిశగా కార్పొరేట్ వ్యవహారాల శాఖ (ఎంసీఏ) కీలక ఆదేశాలిచ్చింది. 2024 సెప్టెంబర్ నుంచి ప్రైవేట్ కంపెనీలన్నీ డీమ్యాట్ (డిజిటల్) రూపంలోనే సెక్యూరిటీలను జారీ చేయాలని ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. చిన్న సంస్థలు, ప్రభుత్వ రంగ కంపెనీలకు దీన్నుంచి మినహాయింపునిచ్చింది. కొన్ని సంస్థలు భౌతిక ఫార్మాట్‌లో జారీ చేసే షేర్లకు సంబంధించి అవకతవకలు చోటుచేసుకునే అవకాశాలను కట్టడి చేసేందుకు ఈ ఆదేశాలు ఉపయోగపడనున్నాయి. కంపెనీల చట్టం కింద ప్రస్తుతం రిజిస్టరయిన 14 లక్షల పైచిలుకు ప్రైవేట్ సంస్థలపై దీని ప్రభావం పడవచ్చని న్యాయ సేవల సంస్థ సిరిల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ పార్ట్‌నర్ ఆనంద్ జయచంద్రన్ తెలిపారు.

సాధారణంగా షేర్ల జారీకి సంబంధించి కంపెనీల చట్టం 2013 కింద ప్రైవేట్ కంపెనీలకు కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిలో షేర్‌హోల్డర్ల సంఖ్య 200కు మించి ఉండకూడదు. నోటిఫికేషన్ ప్రకారం 2024 సెప్టెంబర్ తర్వాత నుంచి ప్రైవేట్ సంస్థలు షేర్ల జారీ, బైబ్యాక్, బోనస్ ఇష్యూ లేదా రైట్స్ ఆఫర్ మొదలైనవన్నీ డీమ్యాట్ రూపంలోనే జరగాలి. రూ. 4 కోట్ల వరకు పెయిడప్ షేర్ క్యాపిటల్, రూ. 40 కోట్ల వరకు టర్నోవరు ఉన్న చిన్న సంస్థలకు, కొన్ని పరిమితులకు లోబడి, మినహాయింపు ఉంటుంది. మరోవైపు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్స్ (ఎల్‌ఎల్‌పీ)ల నిబంధనలను కూడా ఎంసీఏ సవరించింది. వీటి ప్రకారం .. ఏర్పాటైన తేదీ నుంచి ప్రతి ఎల్‌ఎల్‌పీ తమ భాగస్వాముల చిరునామా, పాన్ నంబరు మొదలైన వివరాలతో ఒక రిజిస్టర్‌ను నిర్వహించాలి.

టాటా మోటార్స్‌కు.. రూ. 766 కోట్ల 'నానో' పరిహారం

- పశ్చిమ బెంగాల్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు ఎదురుదెబ్బ
- సింగూర్ ప్లాంట్ వ్యవహారంలో ఆర్బిట్రాల్ ట్రిబ్యునల్ కీలక రూలింగ్




న్యూఢిల్లీ: సింగూర్‌లోని తమ తయారీ కర్మాగారానికి సంబంధించి జరిగిన నష్టానికిగాను రూ.765.78 కోట్ల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (డబ్ల్యూబీఐడీసీ) ముగ్గురు సభ్యుల ఆర్బిట్రాల్ ట్రిబ్యునల్ ఆదేశించినట్లు టాటా మోటార్స్ ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ప్రకటన వివరాల్లోకి వెళితే, టాటా మోటార్స్ 2008 అక్టోబర్‌లో భూ వివాదం కారణంగా తన చిన్న కారు నానో ఉత్పత్తి ప్లాంట్‌ను పశ్చిమ బెంగాల్‌లోని సింగూర్ నుండి గుజరాత్‌లోని సనంద్‌కు మార్చవలసి వచ్చింది. టాటాలు అప్పటికే సింగూరులో రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టారు. ఈ అంశంపై ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్ తాజాగా రూలింగ్ ఇస్తూ ప్రతివాది డబ్ల్యూబీఐడీసీ నుంచి 2016 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 11 శాతం వార్షిక వడ్డీసహా రూ.765.78 కోట్లను టాటా మోటార్స్ రికవరీ చేసుకోవచ్చని రూలింగ్ ఇచ్చింది. ఈ న్యాయ వివాదం విషయంలో రూ. కోటి వ్యయాలను సైతం టాటా మోటార్స్‌కు చెల్లించాలని డబ్ల్యూబీఐడీసీకు ట్రిబ్యునల్ ఆదేశించింది.

వివాదం ఇదీ...

నానో కారును ఉత్పత్తి చేయడానికి జూన్ 2010లో సనంద్‌లో టాటా మోటార్స్ కొత్త ప్లాంట్‌ను ప్రారంభించింది. భూ వివాదాలు, తృణమూల్ కాంగ్రెస్ నుండి వ్యతిరేకత కారణంగా ప్లాంట్‌ను అంతక్రితం పశ్చిమ బెంగాల్, సింగూర్ నుండి గుజరాత్‌లోని సనంద్‌కు తరలించవలసి వచ్చింది. ఈ కారణంగా రెండేళ్ల ఆలస్యంగా ఈ ప్లాంట్ ప్రారంభమైంది. కేవలం రూ. లక్షతో కారును తయారు చేయాలనే రతన్ టాటా కల సాకారమైనప్పటికీ, సాంకేతికంగా, రాజకీయంగా ఈ ప్రాజెక్ట్ అనేక సవాళ్లను ఎదుర్కొంది. పలు ప్రతికూలతలతో టాటా మోటార్స్ 2020లో నానో విక్రయాలను నిలిపివేసింది.

రెండో రోజూ లాభాల జోరు

- రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల అండ
- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ 330 పాయింట్లు ప్లస్
- 19,100 పాయింట్ల పైకి నిఫ్టీ



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతో పాటు బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం అరశాతం లాభపడ్డాయి. ప్రోత్సాహకర కార్పొరేట్ ఆర్థిక ఫలితాలు వెల్లడి సెంటిమెంట్‌ను బలపరిచింది. అంతర్జాతీయ మార్కెట్ల రికవరీ, బ్రెంట్ క్రూడాయిల్ కనిష్టాల నుంచి దిగిరావడం ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయి. ఫలితంగా సూచీలు ఇంట్రాడే కనిష్టాల నుంచి కోలుకుని రెండో రోజూ లాభాలు ఆర్జించాయి. సెన్సెక్స్ 330 పాయింట్ల లాభంతో 64,113 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు పెరిగి 19,141 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం సూచీలు లాభాలతో మొదలైనప్పటికీ.. ప్రారంభంలో నెలకొన్న అమ్మకాలతో నష్టాల్లోకి జారుకున్నాయి. అయితే ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో సూచీలు క్రమంలో నష్టాలను భర్తీ చేసుకుంటూ లాభాల్లోకి మళ్లాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 754 పాయింట్ల పరిధిలో కదలాడి 64,185 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. నిఫ్టీ 19,159 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాలతో పాటు ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, టెలికం, రియల్టీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఆటో, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. కీలక స్థూల ఆర్థిక డేటా వెల్లడి, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య పాలసీ ప్రకటనకు ముందు ఆసియా, యూరప్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

బీమాలో కనీస సదుపాయాలు వెల్లడించాల్సిందే

జనవరి 1 నుంచి నూతన నిబంధనలు



న్యూఢిల్లీ: బీమా సంస్థలు పాలసీలోని కనీస సదుపాయాల గురించి పాలసీదారులకు తప్పకుండా తెలియజేయాలి. ఈ నూతన నిబంధన 2024, జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ), పాలసీలో వేటికి కవరేజీ ఉంటుంది, మినహాయింపులు, వెయిటింగ్ పీరియడ్, క్లెయిమ్ ఎలా చేయాలి తదితర వివరాలను తప్పకుండా వెల్లడించాలి. అలాగే, ఫిర్యాదుల ప్రక్రియ గురించీ చెప్పాలి. ఈ మేరకు కస్టమర్ సమాచార పత్రాన్ని (సీఐసీ) బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) సవరించింది. దీనివల్ల పాలసీదారులు నియమ నిబంధనలు, షరతుల గురించి సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. సవరించిన సీఐసీ జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ఐఆర్‌డీఏఐ ప్రకటించింది.

బ్లాక్‌స్టోన్ చేతికి కేర్ హాస్పిటల్స్

- 72.5 శాతం వాటాకు రూ. 5,827 కోట్లు
- కిమ్స్‌హెల్త్‌లోనూ వాటాలు





న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ తాజాగా హైదరాబాద్‌కు చెందిన కేర్ హాస్పిటల్స్‌లో మెజారిటీ వాటాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. టీపీజీ రైజ్‌ఫండ్స్‌లో భాగమైన ఎవర్‌కేర్ హెల్త్ ఫండ్ నుంచి 72.5 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు మొత్తం మీద 700 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 5,827 కోట్లు) వెచ్చిస్తున్నట్లు వివరించింది. ఈ లావాదేవీ కోసం కేర్ హాస్పిటల్స్ సంస్థ విలువను రూ. 6,600 కోట్లుగా లెక్కగట్టారు. మరోవైపు, కేరళకు చెందిన కిమ్స్‌హెల్త్ సంస్థలో కేర్ హాస్పిటల్స్, టీపీజీ 80 శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ డీల్ కింద బ్లాక్‌స్టోన్ 300 మిలియన్ డాలర్లు, టీపీజీ 100 మిలియన్ డాలర్లు వెచ్చించనున్నట్లు వివరించాయి. దీంతో బ్లాక్‌స్టోన్ దేశీయంగా ఆరోగ్య సేవల విభాగంలోకి ప్రవేశించినట్లవుతుంది. ఈ రెండు డీల్స్ ద్వారా మొత్తం 1 బిలియన్ డాలర్ల పైచిలుకు ఇన్వెస్ట్ చేసినట్లవుతుంది. సంయుక్త నెట్‌వర్క్‌లో టీపీజీ చెప్పుకోతగ్గ స్థాయిలో వాటాలున్న మైనారిటీ షేర్‌హోల్డరుగా ఉంటుంది. భారత హెల్త్‌కేర్ సర్వీసుల రంగంలో తొలిసారిగా పెట్టుబడులు పెట్టడం, దేశీయంగా అతి పెద్ద హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు టీపీజీతో జట్టు కట్టడం తమకు సంతోషకరమైన అంశాలని బ్లాక్‌స్టోన్ ఎండీ గణేష్ మణి తెలిపారు.

భారీ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో ఒకటిగా..

కేర్ హాస్పిటల్స్‌కు హైదరాబాద్, వైజాగ్‌తో పాటు ఔరంగాబాద్, నాగ్‌పూర్ తదితర నగరాల్లో ఆస్పత్రులు ఉన్నాయి. కిమ్స్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సంస్థ .. కేరళలోనే అతి పెద్ద ప్రైవేట్ హెల్త్‌కేర్ ప్రొవైడర్‌గా ఉంది. కిమ్స్‌హెల్త్ చేరికతో దేశీయంగా భారీ హాస్పిటల్స్ చెయిన్‌లో ఒకటిగా కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్ ఆవిర్భవించనుంది. ఈ సంయుక్త నెట్‌వర్క్‌కు 11 నగరాల్లో 23 ఆస్పత్రులు, 4,000 పైచిలుకు పడకలు ఉంటాయి. ప్రస్తుతం కిమ్స్‌హెల్త్‌కు నేతృత్వం వహిస్తున్న ఎంఐ సహాదుల్లా ఇకపైనా దాని సారథ్య బాధ్యతల్లో కొనసాగుతారు.

టీవీఎస్ మోటార్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 386 కోట్లు



న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్‌లో కన్సాలిడేటెడ్ నికర లాభం యథాతథంగా రూ. 386 కోట్లను తాకింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 386 కోట్లే ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 8,591 కోట్ల నుంచి రూ. 9,984 కోట్లకు ఎగసింది. కాగా.. స్టాండెలోన్ నికర లాభం రూ. 407 కోట్ల నుంచి రూ. 537 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో మొత్తం ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 5 శాతం పుంజుకుని 10.74 లక్షల యూనిట్లకు చేరాయి. మోటార్ సైకిళ్ల అమ్మకాలు 3 శాతం వృద్ధితో 4.93 లక్షల యూనిట్లను తాకగా.. స్కూటర్ విక్రయాలు 10 శాతం ఎగసి 4.2 లక్షల యూనిట్లకు చేరాయి. అయితే త్రిచక్ర వాహన అమ్మకాలు 51,000 యూనిట్ల నుంచి తగ్గి 43,000 యూనిట్లకు పరిమితమయ్యాయి. ద్విచక్ర వాహన ఎగుమతులు 2.52 లక్షల యూనిట్ల నుంచి 2.39 లక్షల యూనిట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో టీవీఎస్ షేరు బీఎస్‌ఈలో 1 శాతం బలపడి రూ. 1,610 వద్ద ముగిసింది.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌కు రూ.190 కోట్ల నష్టం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో రూ.190 కోట్ల నష్టం చవిచూసింది. అంత క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.197 కోట్ల నష్టం నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,747 కోట్ల నుంచి రూ.2,185 కోట్లకు ఎగసింది. ఎబిటా రూ.632 కోట్ల నుంచి రూ.848 కోట్లకు చేరింది. ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో సోమవారం 0.16 శాతం క్షీణించి రూ.54.75 వద్ద స్థిరపడింది.

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని రాజీనామా

- ఎన్నికల్లో పోటీ చేయనప్పుడు పార్టీ ఎందుకు: కాసాని జ్ఞానేశ్వర్
- కాంగ్రెస్‌కు ఓటేయాలని పార్టీలోని కమ్మ వాళ్లు ప్రచారం చేస్తున్నారు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకూడదని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 'తెలంగాణలో ఫైట్ చేయాలని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు పోటీ చేయకూడదనే నిర్ణయానికి ఎందుకు వచ్చిండో అర్థం కావట్లేదు. బాలకృష్ణ చిటికలేసి చెప్పిండు. తెలంగాణలో నేనుంట అన్నడు. తెలంగాణ మొత్తం తిరుగుత అన్నడు. తడాఖా చూపిస్త అన్నడు. ఏమైందో తెలియదు' అని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం తన నివాసంలో కాసాని మీడియాతో మాట్లాడారు. 'లోకేశ్ చిన్న పిల్లవాడో, పెద్దవాడో అర్థం కాని పరిస్థితి. ఆయన ఎవరికీ అందుబాటులో ఉండడు. సూర్యచంద్రులకు కూడా దొరకడు. కలుద్దామని 20 సార్లు ఫోన్ చేసిన. కాని ఫోన్ లేపలేదు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడైనా నన్ను పిలిచి మాట్లాడొచ్చు కదా? నాకు తెలంగాణతో సంబంధం లేదు. ఆంధ్రకే పరిమితం అన్నట్లుగా ఉన్నడు' అని వ్యాఖ్యానించారు. 'నేను పార్టీ నుంచి నయా పైసా తీసుకోలేదు. నేనే పార్టీకి డబ్బులు ఇచ్చిన. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడికి నెలకు రూ.50వేలు ఇస్తున్న. నేను పార్టీలోకి వచ్చిన కొత్తలో రూ.11 లక్షలు రామ్మోహన్‌రావుకు ఇచ్చిన. అందులో పార్లమెంటు అధ్యక్షులకు రూ. 50 వేల చొప్పున, మిగతా అటెండర్ల కోసం ఇవ్వమని చెప్పిన. కానీ రూ.లక్ష మాత్రమే అటెండర్లకు ఇచ్చిన్రు. మిగతా 10 లక్షలకు ఇప్పటికీ లెక్కలేదు. ఏమైందో తెలియదు' అని కాసాని చెప్పారు.

ఏపీలో ఒకలా.. ఇక్కడ ఇంకోలా..

'టీడీపీ ఇక్కడ పోటీ చేయొద్దనడం వెనుక ఎవరున్నరో గానీ, మన చౌదరీలే కాంగ్రెస్‌కు ఓటేయమని క్లియర్‌గా చెబుతున్నరు. బాబును మొన్న కలిసినప్పుడు మన కమ్మ వాళ్లే పోటీ చేయడం లేదని ప్రచారం చేస్తున్నరని క్లియర్‌గా చెప్పిన. టీడీపీ వాళ్లే కాంగ్రెస్‌కు ఓటేయమని చెబితే ఎట్ల. ఉప ఎన్నికల్లో పోటీ చేయకపోతే ఓ లెక్క. జనరల్ ఎన్నికల్లో చేయకపోతే ఎట్ల?' అని కాసాని ప్రశ్నించారు. 'ఆంధ్రలో బీజేపీ, జనసేనతో టీడీపీ పోటీ చేస్తదట. తెలంగాణలో బీజేపీ వద్దట. ఇదేం పద్ధతి. ఆంధ్రలో బీజేపీ, జనసేతో పోటీ చేసినప్పుడు ఇక్కడ కూడా చేయాలి కదా' అని వ్యాఖ్యానించారు.

20 గంటల్లోనే రైల్వేట్రాక్ రెడీ!

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు





బోగీని క్రేన్ ద్వారా తొలగిస్తున్న సిబ్బంది, అప్‌లైన్‌లో ప్రయాణం సాగిస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

సాక్షి, విశాఖపట్నం: విజయనగరం జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాద ఘటనలో రైల్వే యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ప్రమాదం జరిగిన గంట వ్యవధిలోనే సహాయక చర్యలతో పాటు పునరుద్ధరణ పనులు ప్రారంభించింది. కేవలం 20 గంటల వ్యవధిలోనే రెండు ట్రాక్‌లలో రైళ్ల రాకపోకల్ని అధికారులు ప్రారంభించారు. వేలాది మంది రైల్వే సిబ్బంది, కార్మికుల సాయంతో అర్ధరాత్రి మొదలుకుని.. సోమవారం రాత్రి వరకూ పనుల్ని నిర్వహించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ ఘటనా స్థలికి 45 నిమిషాల్లోనే చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. అప్పటికే విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు, ఏపీ పోలీసులు.. స్థానికుల సహకారంతో క్షతగాత్రుల్ని వెలికితీసి ఆస్పత్రులకు తరలించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. మరోవైపు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఓడీఆర్‌ఏఎఫ్ బృందాలు ప్రమాద స్థలికి చేరుకున్నాయి. అర్ధరాత్రి 2.30 గంటలకల్లా.. మృతదేహాల్ని, క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలించే ప్రక్రియ పూర్తి చేశారు. ఓ వైపు సహాయక చర్యలు జరుగుతుండగానే.. మరోవైపు నుంచి వాల్తేరు అధికారులు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. డీఆర్‌ఎం, సీనియర్ అధికారులు, జిల్లా అధికార యంత్రాంగం విపత్తు నిర్వహణ బృందాలు, ఏజెన్సీల సమన్వయ కృషితో రెస్టొరేషన్ పనుల్ని వేగంగా పూర్తి చేశారు. దెబ్బతిన్న కోచ్‌లను తొలగించడంతో పాటు, పక్కనే ఉన్న ట్రాక్‌లలో ఉన్న గూడ్స్ ట్యాంకర్లను వేరు చేసే ప్రక్రియను తెల్లవారు జామునకల్లా పూర్తి చేశారు.

భారీ క్రేన్లు.. వెయ్యి మంది కార్మికులు

ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ, సీనియర్ అధికారుల బృంద పర్యవేక్షణలో ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు జోరుగా సాగాయి. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఎప్పటికప్పుడు చర్యల్ని సమీక్షించారు. రైల్వే బోర్డు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మెయిన్‌లైన్ పునరుద్ధరణ పనులపై దృష్టిసారించారు. 1000 మందికి పైగా కార్మికులు, సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన సూపర్‌వైజర్లు ఇందులో భాగస్వాములయ్యారు. రెండు 140 టన్నుల హెవీ డ్యూటీ క్రేన్‌లు, 15 ఎక్స్‌కవేటర్లు మిషన్ మోడ్‌ల ద్వారా ట్రాక్‌లను పునరుద్ధరించారు. కేవలం 19 గంటల వ్యవధిలోనే అప్ అండ్ డౌన్ ట్రాక్‌లని పునరుద్ధరించారు. మొదటిగా డౌన్‌లైన్‌లో మధ్యాహ్నం 2.42 గంటలకు గూడ్స్‌రైలు ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తర్వాత మధ్యాహ్నం 2.55 గంటలకు అప్‌లైన్‌లో భువనేశ్వర్–బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ప్రమాద స్థలిని క్రాస్ చేసింది. మరికొన్ని మరమ్మతులు నిర్వహించి డౌన్‌లైన్‌లో రెండో ట్రైన్‌గా పూరీ–తిరుపతి–బిలాస్‌పూర్ రైలును అనుమతించారు. కాగా, ప్రమాదం జరిగిన మధ్యలైన్ ట్రాక్‌లోనే విశాఖపట్నం రాయగడ రైలు లోకో.. కూరుకుపోయింది. ట్రాక్‌లో లోతుగా కూరుకున్న ఇంజిన్‌ను తొలగించేందుకు తీవ్రంగా శ్రమించారు. ఏఆర్‌టీ మెషీన్ తెచ్చి.. జాకీ మాదిరిగా వినియోగించారు. సోమవారం రాత్రి 11 గంటల వరకూ మూడో లైన్ పనులు కొనసాగాయి. తెగిపడిన హెచ్‌టీ లైన్ల విద్యుత్ పునరుద్ధరణ పనులూ పూర్తిచేశారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రమాద ఘటన విషయం తెలియడంతో ఆదివారం రాత్రి నుంచే ప్రయాణికుల బంధువులు, కుటుంబ సభ్యుల ఆందోళనతో విజయవాడ రైల్వే స్టేషన్‌కు చేరుకుని తమ వారి గురించి ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు డివిజన్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికుల జాబితాతో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి బంధువులు, కుటుంబ సభ్యులకు వారి గురించి సమాచారం అందిస్తున్నారు.

విజయవాడ డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు..

విజయవాడ:	0866-2576924
అనకాపల్లి:	08924-221698
తుని:	08854-252172
సామర్లకోట:	0884-2327010
కాకినాడ టౌన్:	0884-2374227
రాజమండ్రి:	0883-2420541
నిడదవోలు:	0881-3223325
ఏలూరు:	0881-2232267
భీమవరం టౌన్:	0881-6230098
తెనాలి:	0864-4227600
ఒంగోలు:	0859-2280308
నెల్లూరు:	0861-2342028
గూడూరు:	9494178434

నారా వారి లిక్కరు స్కాం

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడిని కేసులు వెంటాడుతున్నాయి. తాజాగా ఆయనపై సీఐడీ మరో కేసు నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న మద్యం కుంభకోణానికి సంబంధించి నమోదైన ఈ ఎఫ్ఐఆర్‌లో ఏ–3గా చంద్రబాబు పేరును చేర్చింది. ఈ మేరకు ఏసీబీ కోర్టులో పిటిషన్‌ను కూడా వేసింది. న్యాయస్థానం కూడా విచారణకు అనుమతించింది. ఐపీసీ, ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ (పీసీ) యాక్ట్–1988ల ప్రకారం 166, 167, 409, 120 (బి), రెడ్‌విత్ 34, 13(1)(డి), రెడ్ విత్ 13(2) సెక్షన్లతో సీఐడీ ఆయనపై ఈ కేసు నమోదు చేసింది. ఇందులో ఏ–1గా అప్పటి ఎక్సైజ్ కమిషనర్ ఐఎస్ శ్రీనరేష్, ఏ–2గా నాటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్రపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది. డిస్టిలరీస్, బేవరేజెస్ కమిషనర్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి. వాసుదేవ రెడ్డి ఫిర్యాదు మేరకు వీరిపై కేసు నమోదైంది.

అయినవారి కోసం అడ్డదారులు..: నంద్యాల మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డికి చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కి, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడుకి చెందిన విశాఖ డిస్టిలరీకి, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కి చెందిన పీఎంకే డిస్టిలరీకి అప్పట్లో అడ్డగోలుగా మేలు చేకూర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం అడ్డదారులు తొక్కింది. ఇందుకోసం ఏకంగా 2012 ఎక్సైజ్ పాలసీని మార్చేసింది. 2012 నుంచి 2015 వరకు ప్రభుత్వానికి రూ.2,984 కోట్లు పన్నులు రాగా, 2015లో కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వానికి ఈ పన్నులు రాకుండా చేసింది. టర్నోవర్‌పై 8 శాతం వ్యాట్‌తో పాటు అదనంగా 6 శాతం పన్నులను తీసేసింది. 6 నుంచి 10 శాతానికి పన్నులు పెంచాలని త్రిసభ్య కమిటీ చేసిన సిఫార్సులనూ బేఖాతరు చేసింది. ఈ విధంగా రెండు బేవరేజీలు, మూడు డిస్టిలరీలకు లబ్ధిచేకూర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం క్విడ్ ప్రో కోకి పాల్పడినట్లు సీఐడీ తన ఎఫ్ఐఆర్‌లో వెల్లడించింది. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ కుంభకోణం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.1,300 కోట్ల నష్టం వాటిల్లుతోందని కోర్టుకు వివరించింది.

కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా నిర్ణయాలు..

నిజానికి.. ఎక్సైజ్ పాలసీ సమస్యలు, ఆదాయ వివరాలను ప్రభుత్వానికి సూచించడానికి గత ఫైళ్లను తిరగేయడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రానికి ఆదాయాన్ని తగ్గించి, లైసెన్సులకు ప్రయోజనం చేకూర్చేలా క్రిడ్ ప్రో కో జరిగినట్లు అధికారులు గుర్తించారు. అంతటితో ఆగక.. అందుకు సంబంధించిన వాస్తవాలపై లోతుగా అధ్యయనం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, ఎల్ఓఐ ఇవ్వడం ద్వారా కొన్ని డిస్టిలరీలకు అనుకూలంగా వ్యవహరించినట్లు గుర్తించారు. డీటీ నోటిఫికేషన్ తర్వాత కొత్త బ్రాండ్లను అనుమతించారని అధికారులు తెలుసుకున్నారు. సరఫరాదారులు కుట్రపూరితంగా, లైసెన్స్‌లతో కుమ్మక్కై, కొన్ని ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోయినా కృత్రిమంగా డిమాండ్ పెంచారు. తద్వారా కార్పొరేషన్‌కు తప్పుడు అంచనాలు ఇచ్చారు. అలాగే, 2015–2019 కాలానికి సంబంధించిన వాస్తవ డిమాండ్, సరఫరాల డేటా, పరిమాణాల వెరిఫికేషన్ కోసం ఎలాంటి యంత్రాంగం లేదు. 2019 ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత కొన్ని కంపెనీలకు ప్రాధాన్యత ఇస్తూ, వారి ఉత్పత్తులకు, వారి మార్కెట్ వాటాకు అనుకూలంగా హడావిడిగా ఆర్డర్లు ఇచ్చేశారు. అంతేకాక.. అవసరానికి మించి లిక్కర్ కంపెనీలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చి కొందరి నుంచే 70 శాతం బ్రాండ్లు కొనుగోలు చేశారు. పక్కా ప్లాన్‌తో, కొందరు అధికారుల సహకారంతో కొన్ని సంస్థలకు చట్టవిరుద్ధంగా ఆర్థిక ప్రయోజన చేకూర్చినట్లు స్పష్టమైంది. అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) ఉల్లంఘన ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందనే విషయం తేటతెల్లమైంది. దీంతో తగిన ఆధారాలతో కేసు నమోదు చేసినట్లు సీఐడీ వివరించింది.

కేబినెట్ ఆమోదం లేకుండా నచ్చినట్లు పాలసీ..: 2015–2017 ఎక్సైజ్ సంవత్సరాలకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి ముందు, కొనుగోళ్ల వార్షిక లైసెన్సు రుసుం కంటే పది రెట్లు మించి ఉంటే మాత్రమే ప్రివిలేజ్ రుసుం విధించే థ్రెషోల్డ్ టెండర్ పరిమితిని పెంచాలని మొదట ప్రతిపాదించారు. కానీ, అది అమల్లోకి రాలేదు. తెలంగాణలో అమలులో ఉన్న ఈ ఫీజులు ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. షాపుల కోసం పాలసీని కూడా తమకు నచ్చినట్లు ఎటువంటి చర్చలు లేకుండా, ఆర్థిక చిక్కుల గురించి ఆలోచించకుండా కేబినెట్ ఆమోదం కూడా లేకుండా ఖరారు చేసేశారు.

ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు అనుకూలంగా నిర్ణయాలు..

ఇక ఎస్పీవై రెడ్డికి చెందిన ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు చంద్రబాబు ప్రభుత్వం భారీగా లబ్ధిచేకూర్చింది. వాయిదా పద్ధతిలో లైసెన్స్ ఫీజు చెల్లించడానికి అనుమతించింది. ఈ ఫీజులో బకాయిలపై వడ్డీని కేవలం 18 శాతం (రూ.15 కోట్లు) మాత్రమే వసూలుచేయడానికి అనుమతించింది. హైకోర్టు తీర్పునకు విరుద్ధంగా, లైసెన్స్ ఫీజు బకాయిలపై అంతకుముందు కాలానికి చెల్లించాల్సిన వడ్డీని కూడా సడలించింది. నిజానికి ఇలా వడ్డీని వదిలేయడానికి, పరోక్షంగా మాఫీ చేయడానికి, తర్వాత చెల్లించేలా అనుమతించడానికి నిబంధనలు అంగీకరించవు.

డిస్టిలరీ మంజూరుకు అనుమతి..

ఇక 2014 నవంబర్‌లో జీఓ నెంబర్ 993 ప్రకారం.. రెవెన్యూ (ఎక్సైజ్–2) డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేసిన కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా, కమిటీ సూచించిన వాటి కంటే ఎక్కువ డిస్టిలరీల స్థాపనకు టీడీపీ ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. పీఎంకే డిస్టిలరీస్, విశాఖ డిస్టిలరీస్, మరో మూడు ప్రైవేటు డిస్టిలరీస్‌కు ఆర్థిక ప్రయోజనం చేకూర్చడానికే ఈ నిర్ణయం తీసుకుంది.

కొంతమంది సరఫరాదారులు.. డిస్టిలరీలపై ప్రేమ..


కుట్రలో భాగంగా కొంతమంది సరఫరాదారులు, డిస్టిలరీలపై టీడీపీ ప్రభుత్వం అప్పట్లో అమితమైన ప్రేమ కనబర్చింది. వారితో కుమ్మక్కై కొన్ని ఉత్పత్తులకు కృత్రిమ డిమాండ్‌ను సృష్టించింది. వాటికి మార్కెట్ డిమాండ్ లేకపోయినా ఉన్నట్లుగా చూపించింది. వాస్తవ డిమాండ్, సరఫరాల డేటా ధ్రువీకరణకు ఎలాంటి యంత్రాంగం కూడా లేదు. దీనివల్ల 2015–2019 మధ్య ఇలా నాలుగైదు కంపెనీలకు భారీగా లబ్ధి చేకూరింది. వీరి నుంచే 70 శాతం కొనుగోళ్లు జరిగాయి.

బ్రాండ్లకు అడ్డగోలు అనుమతులు..

మరోవైపు.. 2019లో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకపోయినా సరే అనేక బ్రాండ్లకు ఆమోదం తెలిపి తద్వారా వాటి సరఫరాదారులకు ఎక్కడలేని ప్రయోజనం చేకూర్చింది. వ్యక్తులు, సంస్థలకు ప్రయోజనాలను అందించడంవల్ల రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.

లోతుగా విచారణ జరపాలి : సీఐడీ

ఈ నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు నష్టం, లైసెన్సీలకు చట్టవిరుద్ధంగా ఆర్థిక లాభం చేకూర్చడంపై విచారణ జరగాల్సి ఉందని సీఐడీ ఏసీబీ కోర్టుకు తెలిపింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్ కాపీని న్యాయస్థానానికి సమర్పించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ కుంభకోణంపై లోతుగా విచారణ జరపాలని, బాధ్యులైన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని సీఐడీ కోరింది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

మంగళవారం ၊ 31 ၊ అక్టోబర్ ၊ 2023



దుర్గమ్మ సేవలో ..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డి.వెంకటరమణ సోమవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు ప్రారంభించారు. -IIలో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.00 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 844.60 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన నందిగం రాజా శ్రీనివాస్, నందిగం ప్రణవ్ పేరిట కుటుంబ సభ్యులు ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.2 లక్ష విరాళాన్ని ఇచ్చారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారి ప్రతాప్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మ కానుకల ఆదాయం రూ. 2.58 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గమ్మకు భవానీలు, భక్తులు హుండీల ద్వారా అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు సోమవారం నిర్వహించిన లెక్కింపులో రూ. 2,58, 64,740 నగదుతో పాటు 367 గ్రాముల బంగారం 8.745 కిలోల వెండి లభించినట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహించిన కానుకల లెక్కింపులో దేవస్థానం, సేవా సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం కూడా లెక్కింపు జరుగుతుందని ఆలయ ఈఓ పేర్కొన్నారు.

నేటి నుంచి లేపాక్షి హస్త కళా ప్రదర్శన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఈ నెల 31 నుంచి పది రోజులపాటు లేపాక్షి క్రాఫ్ట్‌బజార్ -2023 నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో హస్త కళల ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు. దీనిలో కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్తాన్, మహారాష్ట్ర, బిహార్, ఒడిశా, తెలంగాణతోపాటు రాష్ట్రంలో పేరుగాంచిన హస్త కళా ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయిస్తారన్నారు. ప్రదర్శనలో 100కు పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఉడ్ కార్వింగ్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, రంగులతో తయారైన మట్టి పాత్రలు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, మంగళగిరి కాటన్ చీరలు చేనేత వస్త్రాలు, ఇమిటేషన్ జ్యూయలరీ వెండి వస్తువులు తదితర హస్త కళా రూపాలను ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు.

అంతర్జాతీయ ఏషియన్ చాంప్‌లో 'ఎన్ఎస్ఎం' ప్రతిభ



పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 18 నుంచి 28వ వరకు చైనాలో జరిగిన 19వ అంతర్జాతీయ ఏషియన్ చాంపియన్ షిప్‌లో పటమట ఎన్ఎస్ఎం పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి కైవల్య, ఎనిమిదో తరగతి విద్యార్థి చైత్యల భాగస్వామ్యం బంగారు పతకాన్ని కైవసం చేసుకుందని, వ్యక్తిగత విభాగంలో చైత్య బంగారు పతకాన్ని సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సీబీఎస్ఈ చెన్నై రీజనల్ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన అథ్లెటిక్ క్లస్టర్ -17(గర్ల్స్) టేబుల్ టెన్నిస్‌లో నవ్విత, సునీత, మిథిల, చార్వి, సంవేద్ ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. వ్యక్తిగత విభాగంలో సంవేద్, చేతన ప్రియలు ద్వితీయ స్థానం సాధించటంతో పాటు రాయపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయికి అర్హత సాధించారని తెలిపారు.

విజేతలకు సత్కారం

మొగల్రాజపురం: పతకాలు సాధించిన క్రీడాకారులను రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యాన నగరంలోని ఓ హోటల్‌లో సత్కరించారు. ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.దుర్గాప్రసాద్, సంఘ కృష్ణా జిల్లా అదనపు సంయుక్త కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దర్శన భాగ్యం..

- తుది దశకు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు
- కార్తిక మాసంలో స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు
- రూ.72 కోట్ల నిధుల నుంచి పనులు



తుది దశలో మల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వార్ల దర్శన భాగ్యం భక్తులకు కార్తిక మాసంలో కలగనుంది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని మల్లేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. దుర్గగుడి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.72 కోట్ల నిధులను ప్రకటించారు. వీటి నుంచి అభివృద్ధి పనులను చేపట్టారు. స్వామి వారి ఆలయం మొత్తాన్ని రాతి కట్టడం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన రాతి కట్టడాలు, విగ్రహాలను తిరుపతిలో ప్రత్యేకంగా తయారు చేయించారు. రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప ప్రత్యేకంగా విగ్రహాల తయారీని పర్యవేక్షించారు. మల్లేశ్వరస్వామి ఆలయాన్ని పురాతన శైలిలో పునర్నిర్మిస్తున్నారు. స్వామి వారి ప్రధాన ఆలయంతో పాటు చుట్టూ రాతి ప్రాకార మండపం, నవగ్రహ మండపం నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావడంతో నవంబర్ మూడో వారంలో స్వామివారి దర్శనానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయానికి 36 విగ్రహాలు

మల్లేశ్వరస్వామి వారి ఆలయం చుట్టూ ప్రతిష్ఠించే 36 విగ్రహాలు ఇప్పటికే దేవస్థానానికి చేరాయి. కొన్ని విగ్రహాలను ఇప్పటికే ప్రతిష్ఠించగా, మరి కొన్నింటిని వారం రోజుల్లో ప్రతిష్ఠించే అవకాశాలు ఉన్నాయని ఆలయ వైదిక కమిటీ పేర్కొంటోంది. స్వామి వారి ఆలయం చుట్టూ త్రిపురాంతక మూర్తి, దక్షిణామూర్తి, గజసంహారమూర్తి, భిక్షాటన మూర్తి, హరిహరమూర్తి, అర్ధనారీశ్వర మూర్తి, వృషభారుడమూర్తి, వీరభద్రస్వామి, చతుర్ముఖ బ్రహ్మ , చంద్రశేఖరమూర్తి, సుబ్రహ్మణ్యస్వామి, లింగోద్భవమూర్తి, గణపతి విగ్రహాలతో పాటు అష్ట దిక్పాలకుల విగ్రహాలు, పడమర భాగంలో మొదటి కర్ణకోట మధ్యభాగంలోని శరభ మూర్తి, శిఖర భాగంలోని చతుర్ముఖ బ్రహ్మ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. శిఖర భాగంలో 8 దిక్కుల్లో 8 నందుల రాతి విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు.



మండప నిర్మాణం



ఆలయ ప్రాకారంపై రాతి విగ్రహాలు

కార్తిక మాసం, చైత్రమాస బ్రహ్మోత్సవాలు

మల్లేశ్వర స్వామికి కార్తిక, మాసం, చైత్రమాస బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. గతంలో ఉత్సవాల నేపథ్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయంలో ఒక్కో ఏడాది ఒక్కో చోట నిర్వహించేవారు. ఇక స్వామి వారి ఆలయం చుట్టూ నిర్మిస్తున్న రాతి ప్రాకార మండపంలోనే కల్యాణోత్సవాలు నిర్వహించే వీలుంటుంది. ఆలయం ఉత్తర భాగం, తూర్పు భాగం విశాలంగా ఉండటంతో భక్తులు ఆశీనులై స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే భాగ్యం కలుగుతుంది.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కండ్రికలో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే విష్ణు

విజయవాడరూరల్: రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. విలేజి కండ్రికలో రూ.52 లక్షలతో నిర్మించిన కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఆర్థిక సాయం, రైతుభరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రైతుభరోసా కేంద్రాలకు అనుబంధంగా మల్టీ ఫెసిలిటీ సెంటర్లను నిర్మిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కండ్రికలోని రైతులకు రూ. 44 లక్షల మేర ప్రయోజనం కల్గిందని, గ్రామంలో మల్టీఫెసిలిటీ సెంటర్ నిర్మాణానికి జేసీ స్థలం మంజూరు చేశారని, అడ్డంకులు తొలగిపోయాయన్నారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్య సాధన

కలెక్టర్ ఢిల్లీరావు



విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులకు అండగా ప్రభుత్వం ఉంటుందని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి లక్ష్యాలను సాధించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్, సైకిల్, వినికిడి యంత్రాలను కలెక్టర్ ఢిల్లీరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. వారికి అవసరమైన అన్ని ఉపకరణాలను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. వీటిని అందజేయడానికి జిల్లాలో 200కు పైగా దరఖాస్తులు స్వీకరించామన్నారు. వీటిలో అర్హులను ఎంపిక చేసి ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామన్నారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు, 70 శాతం వైకల్యం ఉన్న వారిని అర్హులుగా గుర్తిస్తామని చెప్పారు. ట్రై స్కూటర్లకు రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా నిర్వహించి రూ. 1.20 లక్షల విలువైన స్కూటర్‌ను అందజేస్తున్నామని వివరించారు. వినికిడి యంత్రాలు, ల్యాప్‌టాప్స్, టచ్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అందిస్తున్న సహాయ, సహకారాలను వినియోగించుకోవాలని కోరారు. డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వి.కామరాజు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆశించిన పరిష్కారం చూపాలి

'స్పందన'లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందనలో అందిన సమస్యలకు లబ్ధిదారులు ఆశించిన పరిష్కారం చూపాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని పింగళి సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదికని పేర్కొన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రజలు తమ సమస్య స్పందనలో చెప్పుకుంటే పరిష్కారం అవుతుందన్న నమ్మకంతో వస్తారని, దాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి చక్కటి పరిష్కారం ఇవ్వాలన్నారు. స్వీకరించిన ప్రతి అర్జీకి ఎకనాలెడ్జ్‌మెంట్ తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. తరచూ రీ ఓపెన్ అయ్యే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్పందనతో పాటు వివిధ రూపాల్లో అందే అర్జీలను అధికారులు రోజూ పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

స్పందనలో 120 అర్జీలు

స్పందనలో ప్రజల నుంచి 120 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. వీటిలో రెవెన్యూ 53, పోలీస్ 15, మున్సిపల్ శాఖ 8, విద్య 4, విభిన్న ప్రతిభావంతులు 4, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ 3, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 4, కార్మిక శాఖ 1, హెల్త్ 7, మార్కెటింగ్ 1, డీఆర్డీఏ 3, దేవదాయ శాఖ 1, గ్రామ, వార్డు సచివాలయాలు 1, పౌర సరఫరాలు 2, అటవీ శాఖ 1, కో ఆపరేటివ్ 3, సోషల్ వెల్ఫేర్ 2, హౌసింగ్ 2, ఐసీడీఎస్ 1, ఏపీ సీపీడీసీఎల్ 2, స్కిల్ డెవలప్‌మెంట్ 1, ఉపాధి కల్పన 1 చొప్పున అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీనివాస్, డీఈఓ సీవీ రేణుక, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎ. వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.విజయభారతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రుక్మాంగదయ్య, హౌసింగ్ పీడీ రజనీకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యమస్తు

- జగనన్న సురక్ష శిబిరాలకు విశేష స్పందన
- ఉన్నచోటుకే వచ్చి వైద్యం
- నెల రోజుల్లో 1.93 లక్షల మందికి వైద్య పరీక్షలు
- స్పెషలిస్టు వైద్యులతో చికిత్స



నున్నలో నిర్వహించిన వైద్య శిబిరంలో మందులు ఇస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల హక్కుగా.. ఆరోగ్య భాగ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. పేదల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ప్రతి ఇంటా జల్లెడ పడుతూ ప్రజల అనారోగ్య సమస్యలు తెలుసుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా చికిత్స అందిస్తున్నారు. గత ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యాధి పీడితులను చేయి పట్టుకుని నడిపిస్తూ ఆరోగ్యవంతులను చేస్తోంది. ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రజల నుంచి ప్రశంసలు అందుతున్నాయి. వ్యాధిపీడితులతో పాటు, బీపీ రక్తపోటు ఉందేమో తెలుసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. దీనికి అనుగుణంగా వైద్య ఆరోగ్యశాఖ శిబిరాలు నిర్వహిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు వైద్యాధికారులు, పారా మెడికల్ సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

1.93 లక్షల మందికి పరీక్షలు

గత నెల 30వ తేదీన రాష్ట్రంలో ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రారంభించారు. వైద్యశిబిరాలు ప్రారంభమై సోమవారానికి సరిగ్గా నెల రోజులైంది. ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 247 శిబిరాలు , అర్బన్ ప్రాంతాల్లో 80 వైద్య శిబిరాలను నిర్వహించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ శిబిరాల్లో 1,93,858 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో పురుషులు 94,786 మంది, స్త్రీలు 99,052 మందికి పరీక్షలు చేశారు. వారిలో 1,680 మందికి ఆస్పత్రిల్లో చికిత్సలు అవసరమయ్యాయి. వేర్వేరు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల కోసం రిఫర్ చేశారు. మొత్తం మీద 1,93,856 మందికి మందులు అందజేశారు.

పలు వ్యాధులకు చికిత్స

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు వచ్చిన వారిలో పోషకాహార లోపం ఉన్న వారు 596 మంది, గర్భిణులు, బాలింతలు 5,051 మంది, గర్భకోశ వ్యాధులున్న వారు 11,518 మంది, రక్తహీనత ఉన్న వారు 3,337, వృద్ధాప్య సమస్యలతో 34,250 మంది వచ్చారు. హైపర్‌టెన్షన్ ఉన్న వారు 43,457 మంది, మధుమేహ వ్యాధిగ్రస్తులు 37,699 మంది, హైపోథైరాయిడ్ రోగులు 5,115 మంది, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు 8,706 మంది ఉన్నారు. వారితో పాటు మరో 20,139 మందికి కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు చేశారు.

పోషకాహారంపై అవగాహన

ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు స్పెషలిస్టు వైద్యులు వచ్చిన పరీక్షలు చేస్తుండటంతో అనూహ్య స్పందన లభిస్తోంది. శిబిరాలు జరుగుతున్న చోటుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. చికిత్స తర్వాత ఇవ్వడానికి 172 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలను సైతం శిబిరాల్లో నిర్వహిస్తున్నారు. పోషకాహారంపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

మా ఊరికే వచ్చి పరీక్షలు చేశారు



నేను ఇప్పటి వరకూ ఏదైనా అనారోగ్య సమస్య ఉండే విజయవాడ వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకునే వాడిని. ఇప్పుడు మా ఇంటి సమీపంలోనే వైద్య శిబిరం నిర్వహించి పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షలు చేశారు. అవసరమైన మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఇలాంటి శిబిరాలు ఇంతకు ముందెన్నడూ చూడలేదు.

– సాంబశివరావు, నున్న

ఇబ్బందులు తొలగాయి



ఇంటికి వచ్చి ఏదైనా అనారోగ్య సమస్య ఉందా అని అడిగి తెలుసుకోవడంతో పాటు, పలానా రోజు ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నారు. పెద్ద డాక్టర్లు వస్తారని ముందే వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది చెప్పారు. ఈ రోజు ఇక్కడకు డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. మా ఊరికే డాక్టర్లు రావడం గొప్ప విషయం.

– కె.ఝాన్సీ, నున్న

విజయవంతంగా ..



జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో 247 వైద్య శిబిరాలు, అర్బన్ ప్రాంతాల్లో 80 శిబిరాలు నిర్వహించాం. వాటిలో దాదాపు 1.93 లక్షల మందిని పరీక్షించారు. ఆస్పత్రిల్లో చికిత్సలు అవసరమైన వారిని రిఫర్ చేస్తున్నారు. వారు అక్కడ చికిత్స పొంది ఇంటికి వచ్చే వరకూ మానిటరింగ్ చేస్తుంటాం.

–డాక్టర్ సుహాసిని, డీఎంహెచ్ఓ, ఎన్టీఆర్‌జిల్లా

సాగునీటి సమస్య తీర్చడానికి చర్యలు

కృష్ణా కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో సాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం సోమవారం జరిగింది. సాగునీటి సరఫరా, ధాన్యం సేకరణ తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. శివారు ప్రాంతాల్లో సాగునీటి సరఫరాలో రైతులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. సలహామండలి చైర్మన్ జన్ను రాఘవరావు మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి సరఫరాలో రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని, శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల్లో అపోహలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సరఫరా తక్కువగా ఉన్నందున వారాబందీ అమలు చేస్తున్నామని తెలిపారు. సాగునీరు అందుతున్న ప్రాంతాల్లో నీరు ఇక రాదేమోననే భయంతో మళ్లీ మళ్లీ పొలాలకు తడులు ఇస్తున్నారని, ఫలితంగా శివారు ప్రాంతాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. కొన్ని మీడియాల్లో వ్యతిరేక వార్తలు రావడంతో రైతుల్లో అపోహలు ఏర్పడ్డాయన్నారు. వీటిని తొలగించేందుకు జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు వాస్తవాలను వివరించాలని సూచించారు. అవసరానికి మించి సాగునీటి వినియోగాన్ని నివారించేందుకు కాలువలపై గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చూడాలన్నారు. కాలువల్లో సరైన వాటర్ లెవల్స్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, సాగునీటి సరఫరాలో పుకార్లు వ్యాప్తి చెందకుండా చూడాలని పేర్కొన్నారు. ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.

ధాన్యం సేకరణలో ముందస్తు చర్యలు

గత ఏడాది ధాన్యం సేకరణలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ రాజాబాబు సూచించారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారానికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై నివేదిక సమర్పించారు. జేసీఅపరాజిత సింగ్, జలవనరుల శాఖ ఎస్ఈ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శ్రీకాకోళపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ర్యాలీ ప్రారంభం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో మాట్లాడుతున్న కిషోర్‌బాబు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే స్టేట్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 18వ జిల్లా ర్యాలీని సోమవారం విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్, చీఫ్ కమిషనర్ పి.కిషోర్ బాబు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, వలంటీర్లు కిషోర్ బాబుకు స్వాగతం పలికారు. మొత్తం 19 టీమ్‌లు పాల్గొనగా విజయవాడ నుంచి 12, హైదరాబాద్, గుంటూరు, సికింద్రాబాద్, నాందేడ్, గుంతకల్లు డివిజన్లతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 2 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు, సీనియర్ డీపీఓ బాలమురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి కౌలురైతు మృతి

వత్సవాయి(జగ్గయ్యపేట): బావిలో పడి కౌలు రైతు మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కన్నెవీడు గ్రామానికి చెందిన దారావతు రమేష్(34), నాగేశ్వరి దంపతులు కౌలుకు భూమిని తీసుకుని వ్యవసాయం చేస్తు న్నారు. రోజూ లాగానే కూలీలను తీసుకుని పొలానికి వెళ్లిన రమేష్ మంచినీళ్ల కోసమని బావి వద్దకు వెళ్లాడు. నీళ్లు తోడేందుకు ప్రయత్నిస్తుండగా కాలుజారి బావిలో పడ్డాడు. మంచినీళ్ల కోసం వెళ్లిన రమేష్ ఎంతకీ రాకపోవడంతో కూలీలు బావి దగ్గరకు వచ్చి చూడగా అక్కడ కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చిన వారు కుటుంబసభ్యులకు తెలపడంతో వారు బావిలో దిగి చూశారు. అప్పటికే రమేష్ మృతిచెందాడు. మృతుని భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి. అభిమన్యు సంఘటనా స్థలానికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనపై మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్ కొండ ప్రాంతంలోని బ్రహ్మం గారి మఠం ప్రాంతానికి చెందిన చీపుర్ల నీరజకుమారి, తాతాజీ భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. తాతాజీ మార్బుల్ పని చేస్తుంటాడు. తాతాజీకి మద్యం అలవాటు ఉండగా, సోమవారం మద్యానికి డబ్బులు కావాలని భార్యను అడిగాడు. అయితే బుధవారం అయ్యప్ప మాల వేసుకుంటున్నావు.. మద్యం తాగవద్దు, డబ్బులు ఇవ్వనని నీరజ చెప్పింది. తర్వాత నీరజ కొండ దిగి కిందకు వెళ్లిన కొంత సమయానికి తాతాజీ ఇంట్లో ఇనుప పైపునకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి పక్కనే ఉండే రమాదేవి పాలు ఇవ్వడానికి నీరజకుమారి గదికి వెళ్లి చూడగా, లోపల తాతాజీ ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించడంతో వెంటనే నీరజకు సమాచారం ఇచ్చింది. ఇంటికి వచ్చిన నీరజకుమారి భర్త మృతిపై పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేశారు.

'బస్సుయాత్ర'ను పండుగలా నిర్వహిద్దాం

రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి


బస్సు యాత్ర సభా ప్రాంగణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

అవనిగడ్డ: సంక్షేమ పథకాలు ద్వారా 85 శాతం పేదల అవసరాలు తీరాయని, వీటిని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను జిల్లాలో పండుగలా నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో పెట్టినవన్నీ అమలు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలందరికీ మంచి జరిగేలా, సామాజిక అంతరాలు తొలగించేలా సీఎం జగన్ గొప్పపాలన అందించారని రామిరెడ్డి కొనియాడారు. వైఎస్సార్ సీపీ శ్రేణులే కాకుండా పలు పథకాల లబ్ధిదారులు ఈ పండుగలో భాగస్వామ్యం కావాలని అయోధ్య రామిరెడ్డి పిలుపునిచ్చారు.

2న డయాలసిస్ సెంటర్ ప్రారంభం..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అయిన అవనిగడ్డలో కిడ్నీ డయాలసిస్ కేంద్రాన్ని నవంబర్ 2వ తేదీన ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటిందని, మొదటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అగ్రవర్ణాల పేదలకు మంచి జరిగేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు రాష్ట్రంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, ఈనెల 2వ తేదీన అవనిగడ్డలో చేపట్టే బస్సు యాత్రకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తొలుత అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే సింహాద్రి కలసి బస్సుయాత్ర సభాప్రాంతం, అవనిగడ్డ ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో అపోలో సహకారంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ని పరిశీలించారు. ఏర్పాట్లు గురించి డీఎస్పీ మురళీధర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర షెడ్యూల్ ఇదే

అవనిగడ్డలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర షెడ్యూల్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యాలయం సోమవారం విడుదల చేసింది. నవంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 12.45 నుంచి 1.05 వరకూ మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం సందర్శన తర్వాత 1.05కి మోపిదేవిలో బయలుదేరి 1.45కి అవనిగడ్డ ఆర్‌సీఎం చర్చికి చేరుకుంటుంది. మధ్యాహ్నం 1.45 నుంచి 1.55 వరకూ కోటగిరిలంకలోని ఆర్‌సీఎం చర్చి సందర్శన. అక్కడ నుంచి బైక్, కార్, బస్ ర్యాలీగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యాలయానికి చేరుకుంటుంది. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత సాయంత్రం 3 గంటలకు స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ని ప్రారంభిస్తారు. అనంతరం సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బహిరంగసభ జరుగుతుంది. మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణతో పాటు నాయకులు పాల్గొంటారని చెప్పారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం


కంచికచర్లలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల(నందిగామ): రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం నేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేసిందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలనే ఉద్దేశంతో పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. మధ్యదళారుల ప్రమేయం లేకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంట పత్తి పంటను రైతులు విక్రయించాలన్నారు. గత ప్రభుత్వంలో పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అప్పుల పాలయ్యారని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుతం క్వింటా పత్తి రూ. 7,020 మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, సర్పంచి వేల్పుల సునీత, కంచికచర్ల, వీరులపాడు జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, ఏ. కీర్తి సౌజన్య, మాజీ ఏఎంసీ చైర్మన్లు బొమ్మిశెట్టి భాస్కరరావు, ఆవల రమేష్, కాలవ పెదబాబు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించేందుకు..

నందిగామ టౌన్: రైతులకు మద్దతు ధర కల్పించి అండగా నిలిచేందుకే ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నందిగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రాత్రి ఆయన ప్రారంభించారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చే రైతులు తేమ శాతం ఎనిమిది కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్ నల్లమల్లి మురళి, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, ఎంపీపీ అరిగెల సుందరమ్మ నాయకులు పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు



విశ్రాంత న్యాయమూర్తుల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న నాగరాజు, ఉదయకుమార్

కోడూరు/నాగాయలంక: కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు వరించాయి. మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందించినవారికి అవార్డులు ప్రదానం చేశారు. విద్యా రంగానికి సంబంధించి కోడూరు మండలంలోని యర్రారెడ్డివారిపాలెం గ్రామానికి చెందిన బొంతు నాగరాజుకు ఉపాధ్యాయరత్న జాతీయ అవార్డు లభించింది. నాగరాజు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎలిమెంట్రీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. అలాగే నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో బయాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కొమ్మినేని ఉదయకుమార్ వరల్డ్ టీచర్స్ డే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. హైదరాబాద్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో రిటైర్డ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ జి.చంద్రయ్య, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎం.ఎస్.కె.జైస్వాల్, సన్‌షైన్ హాస్పిటల్స్ ఫౌండర్ ఏవీ గురవారెడ్డి ఈ అవార్డులను ఉపాధ్యాయులకు అందించారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి



అజిత్ సింగ్ నగర్ (విజయవాడసెంట్రల్): డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబే కాలనీ ప్రాంతానికి చెందిన పరిశపోగు ఇర్మియా(35) తాపీ పనులు చేస్తూ ఉంటాడు. భార్య కొంతకాలం క్రితం మృతి చెందడంతో మద్యానికి బానిసగా మారాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఇర్మియా తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం సింగ్ నగర్ వాంబే కాలనీ మార్గం మధ్యలో ఉన్న డ్రైనేజీలో ఇర్మియా పడిపోయి ఉన్నాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. హుటాహుటిన వారు వెళ్లి చూడగా ఇర్మియా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్లోనూ నైపుణ్యం సాధించాలి

జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు


బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీ బాలుర టీమ్

మైలవరం: ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్‌లు నిర్వహించడం ద్వారా కళాశాలల విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 28న ప్రారంభమైన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్‌బాల్ ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్ 2023–24 ముగిసింది. కళాశాలలో సోమవారం విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలకు చెందిన ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 216 మంది విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. 13 బాలుర టీమ్‌లు, ఐదు బాలికల టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు డాక్టర్ జీపీ రాజు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌పీ రాజ్‌కుమార్ బహుమతులు అందజేశారు. బాస్కెట్‌బాల్ బాలుర విభాగంలో మొదటి స్థానంలో కాకినాడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ద్వితీయ స్థానంలో భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మూడో స్థానంలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల, ద్వితీయ స్థానంలో వీఆర్ సిద్ధార్థ కళాశాల, తృతీయ స్థానంలో విష్ణు కళాశాల నిలిచాయి.

కలెక్టర్‌ను కలిసిన షకిన్‌కుమార్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న షకిన్‌కుమార్

చిలకలపూడి(మచిలీపట్నం): ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కన్సల్టేటివ్ సభ్యుడు ఉన్నవ షకిన్‌కుమార్ సోమవారం కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబును ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండలాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్య కోసం జగనన్న విదేశీ విద్యాదీవెనపై అవగాహన కార్యక్రమాల నిర్వహణపై ఆయన కలెక్టర్ రాజాబాబుతో చర్చించారు. విదేశీ విద్యాదీవెన మార్గదర్శకాలు, అర్హతలు, ప్రత్యేక అవసరాలు, గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాల సమాచారం, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాల్లో వివరిస్తామన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపాలన్నది సీఎం జగన్ ఆశయమని వాటికి అనుగుణంగా విదేశీ విద్యాదీవెన పథకంపై అవగాహన కల్పించేందుకు ఇటీవల సీఎం జగన్‌ను కలిసి చర్చించామని కలెక్టర్‌కు ఆయన వివరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆస్ట్రేలియా ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ మాధు నవీన్‌కుమార్ ఉన్నారు.

'తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు పక్కా'

గన్నవరం: తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. విజయవాడలో జరగనున్న ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం ఆయన హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా భట్టి మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 74 నుంచి 78 స్థానాలకుపైగా విజయం సాధిస్తుందని చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని అన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బాలుడు మృతి

కాచవరం(ఇబ్రహీంపట్నం): మండలంలోని కాచవరం 65వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని నాలుగేళ్ల బాలుడు మృతి చెందగా, బాలుడు తండ్రి ఏడుకొండలు తీవ్రగాయాల పాలయ్యాడు. గ్రామంలో చిత్తుకాగితాలు ఏరుకునేందుకు వచ్చిన ఏడుకొండలు తన కుమారుడితో కలిసి రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొట్టింది. గాయాలపాలైన ఇరువురిని 108వాహన సిబ్బంది విజయవాడ ప్రభుత్వం వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. తండ్రికి చికిత్స కొనసాగుతోంది. వీరికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కంకిపాడు(పెనమలూరు): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన మోర్ల చిన్న వెంకటేశ్వరరావు (52) పొలం పనులు చేస్తుంటాడు. ఈనెల 29వ తేదీన పొలంలో గడ్డి కోసం వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం పొలంలోగడ్డి కోసే ప్రాంతంలో అపస్మారకస్థితిలో పడిపోయి నోటి వెంట నురుగు కక్కుతుండగా స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకునే సరికి ఆ ప్రాంతంలో గడ్డి మందు డబ్బా ఉండటాన్ని గుర్తించారు. వెంటనే వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో మృతుడి కుమారుడు సతీష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు నాగాయలంక జెడ్పీ బాలిక


క్రీడాకారిణి జ్యోతితో పీడీ లక్ష్మీప్రసాద్

నాగాయలంక(అవనిగడ్డ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ జిల్లా సెలక్షన్స్‌లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని నాయుడు జ్యోతి కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె. శాంతకుమారి సోమవారం తెలిపారు. గుడివాడ పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం కృష్ణాజిల్లా సెలక్షన్స్ జరిగాయని, అండర్-14 విభాగంలో ఈ బాలిక రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని చెప్పారు. త్వరలో రాష్ట్ర పోటీలకు వెళ్లనున్న జ్యోతిని పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, స్కూలు స్టాఫ్ అభినందించారు.

కబడ్డీ ఉమ్మడి కృష్ణాజిల్లా జట్ల ఎంపిక


ఎంపికైన అండర్-17 బాలుర జట్టు

గుడివాడ టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కృష్ణాజిల్లా కబడ్డీ జట్ల ఎంపిక సోమవారం జరిగింది. స్థానిక పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 900 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొనగా అండర్-14, అండర్-17 బాల బాలికల విభాగాల జట్ల ఎంపిక జరిగింది. అండర్-14 జట్లు అన్నమయ్య జిల్లాలోనూ అండర్ -17 జట్లు చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ దాసరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎంపికలో వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ సుధాకర్, మడకా ప్రసాద్, బాలు, ఆలీఖాన్, రవి, వెంకటేశ్వరరావు, ఎం. జ్యోతి, ఎం. జయ, అనూరాధ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


జయ వెంకట్ (ఫైల్)

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): ఎలుకల మందు తాగి ఓ ఇంటర్మీడియెట్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సింగనగర్ లూనా సెంటర్ ప్రాంతానికి చెందిన వంక జయ వెంకట్(18) ఏలూరు రోడ్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. జయ వెంకట్ కాలేజీకి సరిగ్గా వెళ్లకపోవడం, పరీక్షల్లో ఫెయిల్ కావడంతో అమ్మమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జయ వెంకట్ నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వెంకట్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహికులను అన్ని విధాల ప్రోత్సహించాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం రాత్రి జరిగింది. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సకాలంలో అన్ని రకాల అనుమతులు మంజూరు చేసి పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఏ పరిశ్రమల్లో ఏ రకమైన నైపుణ్యాభివృద్ధి అవసరమో అందుకు సంబంధించిన నివేదిక వచ్చే సమావేశానికి తీసుకురావాలని ఆదేశించారు. పరిశ్రమల ఎస్టేట్‌లో యూనిట్లు నెలకొల్పేందుకు 1942 మందికి స్థలాలు కేటాయించారని, ఇప్పటి వరకు ఎంత మంది యూనిట్లు నెలకొల్పారు, నిర్మాణ దశలో ఎన్ని ఉన్నాయి, ఎన్ని ఖాళీగా ఉన్నాయి అన్న వివరాలను వచ్చే సమావేశానికి తీసుకురావాలని సూచించారు. స్థలం కేటాయించినప్పటికీ యూనిట్లు ఏర్పాటు చేయని పారిశ్రామికవేత్తలకు నోటీసులు జారీ చేయాలన్నారు. స్థలాలు తీసుకుని వినియోగించుకోకపోతే వాటిని రద్దు చేసి, కొత్త పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిశ్రమల అధికారి వెంకట్రావు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో విజేతగా మిట్టగూడెం జట్టు


విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న స్పాన్సర్స్ శ్రీనివాసరావు

మిట్టగూడెం (విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ మిట్టగూడెం గ్రామంలో గొంతెమ్మ (బతుకమ్మ) పండుగ సందర్భంగా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 28 జట్లు పాల్గొనగా మేడా వెంకటేశ్వరరావు మెమోరియల్ మిట్టగూడెం టీం విజేతగా నిలిచి, రూ. 30వేలు నగదు బహుమతి అందుకుంది. రెండో స్థానంలో నిలిచిన దమ్మపేట జట్టుకు రూ. 20వేలు, మూడో స్థానంలో నిలిచిన ఈడ్పుగల్లు జట్టుకు రూ. 15వేలు, నాల్గో స్థానం సాధించిన బుట్టాయిగూడెంకు రూ. 10వేలు, ఐదో స్థానంలో ఈదర జట్టుకు రూ. 5వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఎంపీటీసీ మేడా తిరుపతిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వీఎంసీ కౌన్సిల్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాల సంస్థ పాలక పక్షం మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సభ్యులు ఎజెండాలో వచ్చిన అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఎజండాలో మొత్తం 127 అంశాలు, 11 ప్రశ్నలపై సభ్యులు అధికారులు చర్చించి తీర్మానాలు చేయనున్నారు.

నేషనల్ గేమ్స్‌కి ఎంపికైన నలంద విద్యార్థి విస్సంశెట్టి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్ రన్నింగ్ రిలే పోటీల్లో తమ కళాశాలలో బీబీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విస్సంశెట్టి ఖగవిశాల్ ఎంపిక అయ్యాడని నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు నేషనల్ గేమ్స్‌కు ఎంపికైన విశాల్‌ను అభినందించారు.

టేబుల్ టెన్నిస్‌లో సత్య వెంకటేష్‌కు ప్రథమ స్థానం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇటీవల అనంతపూర్‌లోని ఆర్‌డీటీ జూడో ఇండోర్ స్టేడియంలో జరిగిన ఏపీ స్టేట్ ఇంటర్‌డిస్ట్రిక్ అండ్ స్టేట్ చాంపియన్ షిప్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్–2023లో తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి పీవీ పవన్ సత్య వెంకటేష్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించాడని జనరల్ మేనేజర్ జీవీ రావు చెప్పారు. కళాశాల ఆవరణలో పవన్ సత్య వెంకటేష్‌ను అభినందించారు. క్రీడలపై ఆసక్తిని చూపించాలని చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు, శారద విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి తెలిపారు. కళాశాల సలహాదారుడు ఈయస్ఆర్‌కే ప్రసాద్ అభినందలు తెలిపారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. నియోజకవర్గంలోని రెండో డివిజన్ 35వ సచివాలయం, నాల్గో డివిజన్ 16వ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సోమవారం నిర్వహించారు. అవినాష్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందన్నారు. ఒక్కో సచివాలయానికి రూ. లక్ష వెచ్చించి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. రోగులకు ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఉచితంగా ఆపరేషన్లు చేయించి, కళ్ల జోళ్లు అందజేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి ప్రజలకు సీఎం జగన్ చేస్తున్న సేవలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకంతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ సైతం తండ్రి బాటలోనే నడుస్తూ ఆరోగ్య పరిధిని విస్తరించి రూ. వెయ్యి పైబడిన ప్రతి వైద్య సేవలను ఉచితంగానే ప్రజలకు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు ఆయన పాలనలో ఎప్పుడైన ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారా అని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం గురించి చంద్రబాబు ఎప్పుడూ పట్టించుకోలేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి ఆసుపత్రి బిల్లులను పెండింగ్‌లో పెట్టి రోగులను ఎన్నో ఇబ్బందులకు గురి చేశారన్నారు. నాడు చేసిన అవినీతికి జైలు శిక్ష అనుభవిస్తుంటే టీడీపీ నాయకులు పిచ్చిపిచ్చి కార్యక్రమాలతో దిక్కుతోచని స్థితిలో ఉంటూ ప్రజల్లో మరింత చులకన అవుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు చేస్తున్న చేష్టలు, నీచ రాజకీయాలు చూసి ప్రజలు అసహ్యంచుకుంటున్నారన్నారు. వారి అనుకూల మీడియా ద్వారా ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలకు నిజం తెలుసని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు తెలిపేందుకు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. డీఎంహెచ్‌వో సుహాసిని, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షులు మెహబూబ్, ఈఈ చంద్రశేఖర్, కార్పొరేటర్లు అంబడిపూడి నిర్మలకుమారి, అంబేద్కర్, నాల్గో డివిజన్ పార్టీ ఇన్‌చార్జ్ గల్లా రవి పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం



అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏడీఆర్ఎం శ్రీనివాసరావు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): డివిజన్ వ్యాప్తంగా సోమవారం నుంచి నవంబర్ 5 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఏడీఆర్ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విధుల్లో పారదర్శకత, అవినీతి రహిత సేవలు అందిస్తామంటు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు అవినీతి రహిత భారతదేశం కోసం కృషి చేయాలని, విధుల్లో సమగ్రతతో పారదర్శకత ఉండేలా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని యునిటీ రన్, సెమినార్‌లు, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్పందనలో 89 ఫిర్యాదులు



స్పందనలో బాధితుల నుంచి సమస్యలను తెలుసుకుంటున్న డీసీపీ అజిత వేజెండ్ల

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 89 ఫిర్యాదులు నమోదయ్యాయి. కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ అజిత వేజెండ్ల స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి బాధితుల నుంచి వివిధ సమస్యలు, వినతులు స్వీకరించారు. నేరుగా బాధితులతో మాట్లాడారు. అదే విధంగా దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు. నగదు లావాదేవీలకు సంబంధించినవి 28 ఫిర్యాదులు, భార్యాభర్తలు, కుటుంబ కలహాలపై 14, సివిల్ వివాదాలు 15, వివిధ మోసాలపై 10, ఇంటి అద్దె సమస్యలపై 3, చోరీలపై 2 ఫిర్యాదులు, ఇతర చిన్న చిన్న వివాదాలపై 17 మొత్తం 89 ఫిర్యాదులందాయి.

మిర్చి తోటల పరిశీలన



మక్కపేటలో రైతులతో కలిసి పరిశీలిస్తున్న డీహెచ్‌వో బాలాజీ

వత్సవాయి: మిర్చి రైతులు జెమినీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.బాలాజీకుమార్ సూచించారు. మండలంలో భీమవరం, మక్కపేట, ఇందుగపల్లి గ్రామాల్లోని మిర్చి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. జెమినీ వైరస్ సోకి పంట నష్టపోయిన రైతులు, తిరిగి మిర్చి నారును నాటుకునే సమయంలో నారును ఇమిడాక్లోప్రిడ్ లేదా వేపనూనెలో ముంచి నాట్లు వేస్తే మంచిదన్నారు. అలాగే వేపపిండి ఎకరాకు క్వింటా చొప్పున చల్లుకోవాలన్నారు. ఇప్పటికే ప్రైడ్ పిచికారీ చేసిన రైతులు పదే పదే అవే రకాల మందులను వాడకుండా ఉండాలన్నారు. మార్కెట్లో దొరికే మందులను విచ్చలవిడిగా పిచికారీ చేసి నష్టపోవద్దన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న ఉద్యానవశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ విద్యార్థిని సత్తా



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల గోవాలో జరిగిన 37వ నేషనల్ గేమ్స్‌లో ఉమెన్ బాడ్మింటన్‌లో ఆంధ్రప్రదేశ్ టీమ్‌లో కీ ప్లేయర్‌గా సిద్ధార్థ విద్యార్థిని టి.సూర్య చరిష్మ సత్తా చాటింది. ఆ పోటీల్లో బ్రాంజ్ మెడల్ పొందిన చరిష్మను సోమవారం శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మజ , ఇతర అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వికలాంగుడి వద్దకే వైద్యులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని గవర్నర్‌పేట సీవీఆర్ స్కూల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ శిబిరానికి ఓ దివ్యాంగుడు ట్రై సైకిల్‌పై వచ్చాడు. మూగ చెముడు కూడా ఉండటంతో మాట్లాడలేని స్థితిలో శిబిరం బయట ఉన్నాడు. అతని వెంట అటెండెంట్ కూడా లేరు. గమనించిన లబ్బీపేట యూపీహెచ్‌సీకి చెందిన వైద్యురాలు మెబీనా, శిబిరంలో ఉన్న జనరల్ మెడిసిన్ వైద్యురాలు ఆయేషాలు అతని వద్దకే వెళ్లారు. దగ్గు, ఆయాసంతో పాటు, ముక్కు వెంట రక్తం వస్తున్నట్లు గుర్తించి మందులు ఇచ్చి పంపారు. కాగా వైద్యులు శిబిరం బయటకు వచ్చి వికలాంగుడికి చికిత్స చేయడంపై అక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అక్కినేని భావినటులకు మార్గదర్శకం



విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం భావి నటులకు మార్గదర్శకమని సీనియర్ గాయకుడు చావా నరసింహారావు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో బందరురోడ్డులోని బాలోత్సవ భవన్‌లో అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలు ముగింపు వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ కృష్ణా జిల్లాకు చెందిన అక్కినేని ప్రారంభదశలో చిన్నపాత్రలు పోషించినా స్వయం కృషి, పట్టుదలతో తెలుగు సినిమా గర్వించే స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రూపాశ్రీ, విష్ణు ప్రియ, సుధా శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, రసూల్‌బాబు, సత్యవర్ధన్, సుశీల్‌కుమార్ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను ఆలపించారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

పెద్దాపురం(వీరులపాడు): మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా మద్యం అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉక్కుపాదం మోపుతున్నట్లు వివరించారు. తనిఖీలలో భాగంగా తెలంగాణా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌కు పరామర్శ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కావలిలో అల్లరి మూకల దాడిలో గాయపడిన ఆర్టీసీ డ్రైవర్ బి.రామ్‌సింగ్‌ను ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం పరామర్శించారు. విద్యాధరపురంలోని సెంట్రల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న రామ్‌సింగ్‌ను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వెంకటపతి, సభ్యులు ఎం.రామకోటేశ్వరరావు ఉన్నారు. రామ్‌సింగ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు అసోసియేషన్ అండగా నిలుస్తుందన్నారు.

మెరుగైన విద్యుత్‌కు కృషి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట 53వ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు అన్నారు. కొత్తపేట శిల్పాశ్రమంవీధి, అల్లాడివారి వీధిల్లో సుమారు పది లక్షల వ్యయంతో విద్యుత్ వైర్లు మార్పు, త్రీఫేస్ సదుపాయానికి సంబంధించిన ఏర్పాట్లకు పనులను ప్రారంభించారు. ఈ పనులను కార్పొరేటర్ అప్పాజీరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అందులో భాగంగా నూతన వైర్లు మార్పు స్తంబాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా అప్పాజీరావు మాట్లాడుతూ శిల్పాశ్రమం వీధి పరిసర ప్రాంతాల్లో త్రీఫేస్ లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత పనులు పూర్తయితే వారికి మంచి సేవలందించటానికి అవకాశముంటుందన్నారు.

విజయవాడ ఆర్ట్ సొసైటీకి ఆర్ట్ గెలాక్సీ అవార్డ్



విజయవాడ కల్చరల్: ఒంగోలుకు చెందిన సృష్టి ఆర్ట్స్ అకాడమీ సంస్థ చిత్ర కళా రంగానికి చేస్తున్న సేవలను గుర్తించి 2023 సంవత్సరానికి గానూ ఆర్ట్ గెలాక్సీ పురస్కారానికి ఎంపిక చేసినట్లు విజయవాడ ఆర్ట్స్ సొసైటీ ప్రధాన కార్యదర్శి యు.వేణు గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్ గెలాక్సీ సంస్థ ఏటా ఒంగోలులో ఆర్ట్స్ వర్క్‌షాప్ నిర్వహించి విశిష్టమైన సేవలను అందించి వారికి అవార్డ్‌ను అందజేస్తుందని తెలిపారు. ఒంగోలులో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు అంజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కొలుసు సుబ్రహ్మణ్యంతోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

6 నుంచి శిక్షణ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నవంబర్ 6వ తేదీ నుంచి ఎం.ఎస్ ఆఫీస్ కొత్త బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నమని ఎం.బి.విజ్ఞాన కేంద్రం శిక్షణా విభాగం బాధ్యుడు టి.క్రాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సహకారంతో జరుగుతున్న ఈ శిక్షణ తరగతులు రెండు నెలల పాటు ప్రతి రోజు రెండు గంటలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు నవంబర్ 4వ తేదీలోగా 0866 2578044, 94900 98042 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్: తన భార్య కనిపించడం లేదంటూ భర్త కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదయింది. నూకల వారి వీధికి చెందిన మహ్మద్ జాఫర్, రిజ్వాన భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జాఫర్ వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం భార్యాభర్తలిద్దరికి గొడవ జరిగింది. సోమవారం నిద్ర లేచిన రిజ్వాన పిల్లలకు టిఫిన్ చేసేందుకు వంట గదిలో ఉంది. కొంత సమయం తర్వాత బాత్‌రూమ్ నుంచి బయటకు వచ్చిన జాఫర్‌కు రిజ్వాన కనిపించలేదు. దీంతో జాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

స్మృతివనం పనులు పరిశీలన



స్మృతివనం పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో నిరంతరం పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రానైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రాంగణంలో అంద మైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సంతృప్తికర పరిష్కారాలే లక్ష్యం



స్పందనలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న స్పందనలో పరిష్కారాలు లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారులకు సంతృప్తికర పరిష్కారాలు అందించాలని సూచించారు. సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందనలో మొత్తం 25 సమస్యలపై ఫిర్యాదులు రాగా అందులో పట్టణ ప్రణాళిక విభాగం–9, ఇంజినీరింగ్ విభాగం–9, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి)–4, రెవెన్యూ–1, ఎస్టేట్ విభాగం–1, ఇతర –1 కు సంబంధించి అందుకున్న సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ కేవీ సత్యవతి, పట్టణ సాధికారాభివృద్ధి అధికారి శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మీ, సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, సీఈ ప్రభాకర్, సీఎంవోహెచ్ డాక్టర్ రత్నావళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా 4.0 రన్‌లో భాగంగా విజయవాడ కెనరా బ్యాంక్ సర్కిల్ ఆధ్వర్యాన ఫిట్ ఇండియా.. స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ రవివర్మ పాల్గొని స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌ను జెండా ఊపి ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని అన్నారు. ప్రతి ఒక్కరినీ ఆరోగ్యవంతులుగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నేటి జీవన శైలిలో ప్రతి ఒక్కరు ఎన్నో ఒడిదులుకులతో అనారోగ్య సమస్యలకు గురవుతూ రోగాల పాలవుతున్నారని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూక్తిని ప్రతీ ఒక్కరు పాటించి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఏదో ఒక రకమైన వ్యాయామాన్ని ప్రతి రోజూ అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సీనియర్ మేనేజర్ రామారావు, బ్యాంకు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో అప్రమత్తం

ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్



పెనమలూరు పాఠశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

పెనమలూరు: ప్రకృతి వైపరీత్యాల కారణంగా తలెత్తే ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి ప్రమాదం నుంచి బయటపడాలని ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మిదిలీష్ యాదవ్ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాల నుంచి బయటపడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలెండర్ ప్రమాదాల విషయంలో కూడా జాగ్రత్త వహిస్తే ప్రమాదాలు నివారించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నుంచి బయటపడే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆర్.మద్దిలేటి, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

సత్యనారాయణపురం(విజయవాడ సెంట్రల్): నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాల్లో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు సోమవారం 3వ ట్రాఫిక్ పోలీసులు 7 కేసుల్లో మద్యం తాగి వాహనములు నడిపే చోదకులను అరెస్టు చేసి ఏడవ అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారికి జైలు, జరిమానా విధించారు. వారిలో ఒక వ్యక్తికి 10 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 07 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, ఒక వ్యక్తికి 02 రోజులు జైలు, రూ. 10వేలు జరిమానా, మిగిలిన నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారు.



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోంది ప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.




పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్‌ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను విన డానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: మోహనాచారి

మల్టీ టాలెంట్



బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ-నామినేటెడ్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది.



సుమధుర గాయనిగా...

యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్-బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండన్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మాస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్‌ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్‌ఎహెచ్‌ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్‌ఎయు

సాగుబడి
స్వాతి కార్డ్: నవంబర్ 6 వరకు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!





సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్‌ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్‌ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్‌ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్‌ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్‌ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్‌ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్‌ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్‌ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) చెబుతోంది. బిఎస్‌ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్‌ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు
5 రోజుల వయసులో పిల్ల పురుగులు
గ్రాములో 3 వేల పిల్ల పురుగులు
కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం
ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం
15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్‌ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్‌ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్‌ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్‌ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్‌ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్‌ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్‌ఎఫ్ జాతికి వుంది. బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– డా. వి. అనిత, కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్‌ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్‌ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్‌ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయటం కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్‌ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్‌ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్‌ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్‌ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్‌ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఒ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్